# యెహోవా ఏర్పాటు చేసిన దినము

## (శుభ శుక్రవారం?! Good Friday)

డా॥ బి. జాన్

ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి

హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, ఇండియా

www.bibletechnology.net

# *YEHOVA YERPATU CHESINA DINAMU*

*No part of our publications may be re printed*
*without our written permission*

*మొదటి ముద్రణ : ఏప్రిల్ 2011*

*ప్రతులు : 2000*

**వెల : 50.00**

*రచయిత :* ***డా॥ జాన్ బొంకూరి,*** Director & Evangelist
**INSTITUTE OF BIBLE TECHNOLOGY HYD**
**TEMPLES OF GOD MEET HERE CHURCH**
#06-264/13/1/5H, HAL / Aeronautics Enclave,
Opp. Godavari Homes,
Suchitra Bus Stop to Quthbullapur Road, Chintal Post,
Quthbullapur GHMC, Hyd - 500 054, India,
Ph : 040-20000700 Cell : 9440142887
e-mail : bibletechnology@gmail.com

*సర్వహక్కులు రచయితవి*

*డిజైన్డ్ & ప్రింటెడ్*

*'థీమ్స్' విజయవాడ, 9666000772*

***For Copies :***
***Institute of Bible Technology - Hyderabad***
**Bro. J. RAVI,** Admn. Officer - IBT,
H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet, Hyd-16
Cell : 9440792192, 9704692533
**RK. Evangelical Marketing**

# అంకితం

సాతాను తెలివిగా కట్టిన దుర్మార్గపు కట్లను, జ్ఞానం పేరిట ప్రవేశపెట్టిన ఆచారాలను, తప్పుడు బోధలను కూకటి వేళ్లతో సహా పెరికివేసి దేవునికిష్టమైన ఉపవాసం చేసి ఆయన కుమారుని యొక్క మరణ సమాధి - పునరుత్థానములను సమయమందును, అసమయమందును, ప్రకటించి మాట చేతగాని, క్రియచేతగాని క్రీస్తు ద్వారా దేవున్ని ఆరాధించే ప్రతి విశ్వాసికి నా పుస్తకాన్ని అంకితం చేస్తున్నాను.

**- డా॥ బొంకూరి జాన్**

# ముందుమాట

అపోహలతో, అర్థంలేని వాదనలతో భక్తిని భ్రష్టు పట్టిస్తున ప్రస్తుత సమాజంలో డా॥ బొంకూరి జాన్ గారి లాంటి సందేశకులు, రచయిత తెరపైకి రావటం చాలా సంతోషదాయకంగా ఉంది. ఆయన చేసిన అనేక రచనలను, వాక్యఉపదేశాలను చాలా విన్నాను, చదివాను. నిర్వీర్యమైపోతున్న భక్తికి తిరిగి ప్రాణంపోసే దశగా, నిద్రాణంలో ఉన్న క్రైస్తవ్యాన్ని చేయితట్టి లేపాలనే ఆయన తపన చాలా బాగుంది. తన కష్టార్జితమును సైతం దైవసేవకై వినియోగిస్తూ, క్షణం కూడా తీరికలేకుండా దేవునికై కష్టపడే ఆయన గుణం హర్షణీయం.

ముఖ్యంగా ఈ పుస్తకం గురించి చెప్పాలంటే.... మెప్పు కోసం, గొప్పకోసం, తృప్తికోసం చేసుకునే ఉపవాసాలను ఉపవాసాలు కాదని, నిజమైన ఉపవాసమేదో అదే మనం చెయ్యాలని ఈ పుస్తకంద్వారా అద్భుతరీతిలో వాక్యం ద్వారా సత్యాలను వివరించారు. క్రీస్తు ప్రభువు సిలువలో పలికిన మాటలను తలోరకంగా చెప్పకుంటున్నప్పటికీ ఒక నూతనమైన రూపం వాటికి తెచ్చి సామాన్యునికి కూడా అది అర్థమయ్యే భాషలో వ్రాసిన జానన్న ప్రాసకు నాజైజైలు. అందరి ఆత్మీయ జీవితాలకు అవసరమైన నిజ నిర్ధార సహితమైన సత్యాలను తెలుసుకోవడానికి ఈ రచనలు ఎంతో ఉపయోగయుక్తంగా ఉంటాయని నేను నమ్ముతున్నాను. ఈ పుస్తకం ప్రతిక్రైస్తవునికి అందుబాటులో ఉండాలనేదే నా ధ్యేయం, ఆశ.

ప్రభు నామ స్మరణలో

**- బి. పూర్ణచంద్రరావు**

డిజైనర్, విజయవాడ.

# నామాట

క్రీస్తునందు ప్రియమైన నా ఆత్మీయ సహోదర సహోదరీ మణులందరికి ప్రభువైన యేసు నామంలో నా వందనాలు, శుభములు పలికి వ్రాయునది.

దేవుని మహదైశ్వర్యాన్ని బట్టి, క్రీస్తు కృపను బట్టి, పరిశుద్ధాత్మని నడిపింపును బట్టి మరోసారి మీముందుకు వాక్యాధారమైన కొన్ని సంగతులను తెచ్చాను. జగత్తు పునాది వేయబడక మునుపే ఏర్పాటు చేసిన ఆ దినం (యెహోవాదినం) ఇశ్రాయేలీయుల పాపం పండగానే వచ్చింది. నేటి క్రైస్తవుల పాపం (భ్రష్టత్వం) పండగానే క్రీస్తు దినము వస్తుంది. అయితే నిరీక్షణ, విశ్వాసం కల్గినవారు సాతాను మాయలోంచి బయటపడి క్రీస్తు దినమున ఎత్తబడాలనే ఆశ - ఆశయం, దేవుని ఆజ్ఞను బట్టి ఈ పుస్తకం వ్రాసాను. ఆత్మతో చదివి, ఆలోచించి, ఆచరించి యేసును, ఆయన తండ్రిని అనుదినము మహిమపరుస్తారో లేక నా మీద ఎదురుదాడి చేస్తారో మీకే వదిలేస్తున్నాను.

ఇందులో అచ్చు తప్పులుంటే క్షమించి సరిదిద్దుకొని చదువుకొని నాకు తెలియజేస్తే మలి ముద్రణలో సరిచేస్తాం. వాక్యానుసారంగా తప్పుంటే మాత్రం వెంటనే నన్ను సరిచేయగలరు. అందమైన ముఖచిత్రం వేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, అద్భుతంగా ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెచ్చిన సోదరుడు బి. పూర్ణచంద్రరావు (థీమ్స్, విజయవాడ)కు నా హృదయపూర్వక వందనాలు.

దీనిని ప్రజలలోనికి తీసుకెళ్ళాలని ముందుకొచ్చిన సోదరుడు జంగిటి రాజు (ఆర్.కె. ఇవాంజిలికల్ మార్కెటింగ్) గారికి, నా వెనుకాల ఉండి అన్నివిధాల సహకరిస్తున్న సోదరుడు జె. రవి గారికి ప్రిన్సిపల్ డి. ప్రసాదరావు గారికి మిగతా ప్రిన్సిపల్స్, సువార్తికులందరికి పేరుపేరున వందనాలు.

యేసుప్రభువు, యోనావలె మూడు రాత్రింబగళ్ళు సమాధిలో ఉన్నాడా? అనే అంశాన్ని లేఖనాధారంతో మరో పుస్తకంలో వివరంగా వ్రాస్తానని మనవి చేసుకుంటున్నాను. ఈ రాజ్య సువార్త సకల జనుల సాక్ష్యార్ధమై, సర్వపలోకానికి ప్రకటించుటకై మీ వంతు సహాయ, సహకారాలు అందించి, విడిపోయిన సంఘాలన్నిటికి వాక్యంలో ఐక్యం చేయగలరని (యోహాను 17:21) ఆశిస్తూ అనగా శ్రమలు, ఉపవాసములు, మట్టలాదివారం, గుడ్‌ఫ్రైడే, ఏడుమాటలు ఇవన్నీ అన్ని సంఘాలలో ఒకేరీతిలో ప్రకటింపబడునట్లు దేవుడు మనల్నందరిని తన ఆత్మచేత ముద్రించి, తన వాక్యం వెలుగు దీవించి, ఆశీర్వదించాలని కోరుతున్నాను.

రారాజు క్రీస్తు రాజ్యంలో, సహనంలో
మీ ఆత్మీయ సోదరుడు
**డా॥ బి. జాన్**

# యెహోవా ఏర్పాటు చేసిన దినం

ఆది నుండి మానవ జీవనయానంలో దినము లేక రోజు అనే మాట ఎంతో గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. ప్రతి మనిషి యొక్క ఆయుష్షును, ఈ సకల చరాచర సృష్టియొక్క ఆయుష్షును కూడా కొలిచే విధానము ఈ దినము అనే పదము పైనే ఆధారపడి ఉన్నది అని మనకు బాగా తెలిసిన విషయమే. మొదటి మానవుడైన ఆదాము మొదలుకొని నేటి వరకు నరుడు దిన, దినము ఎంతో అభివృద్ధి చెందాడని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరము లేదు కదా, సర్వశక్తి మంతుడైన దేవుడు ఈ ప్రకృతిని అనగా పంచభూతములను అందులోని సర్వస్వాన్ని నిర్మించినపుడే దానినంతా దినములతోనే విడగొట్టినట్లుగా లేదా వేరు చేసినట్లుగా మరియు మానవ నివాస యోగ్యమైనదిగా తయారు చేయడము గూర్చి ఆదికాండము ప్రారంభ అధ్యాయములలో చదువవచ్చు.

ఈ దినము అని లేక ఈ రోజు అని లెక్కపెట్టడానికి మనిషి తన కళ్ళకు కనబడుతున్న ఈ అనంత విశ్వాన్ని, మరియు ఈ అంతరిక్షంలో క్రమం తప్పకుండా జరిగే మార్పులను కూడా లెక్కలోనికి తీసుకొన్నాడు. మనం ఉన్న ఈ భూమి తనచుట్టు తాను తిరిగే కాలమే ఒక దినము లేక 24 గంటలుఅంటున్నాము. భూమి చుట్టు చంద్రుడు తిరిగే కాలం 30 రోజులు లేక దినములను ఒక నెల అనియు, ఈ భూమి చంద్రుడు కలిసి సూర్యుని చుట్టు తిరిగి రావడానికి 365 రోజులు లేక 1 సంవత్సరము అనియు మనం కాలాన్ని విభజించి లెక్కగట్టుచున్నాము. ఇది మానవాళి చరిత్రను లెక్కించడానికి మన బ్రతుకును లెక్కగట్టడానికి ఎంతో అవసరం అయింది. ఇదే విషయాన్ని దేవుడు మనుషులందరి బ్రతుకు పుస్తకమైన బైబిల్ గ్రంథంలోని ఆదికాండం 1వ అధ్యాయం 14 నుండి 19 వరకున్న వాక్యాలలో మనం దిన, నెల,

సంవత్సరములు చూసుకొని దేవుని స్తుతించడానికే పైన చెప్పిన మూడు గోళాలను (భూమి, సూర్యుడు, చంద్రుడు) సృష్టించి వాటి మధ్య సంబంధం కడ్డలను పెట్టి అది మంచిదని చెప్పాడు.

దేవుడిని తెలుసుకొని, ఆయనను పూజించి, ఆయన సన్నిధానానికి చేరడానికి మాత్రమే ఈ దినము అనే కాలాన్ని (అపొ.కా. 17:26) మన కొరకే ఇచ్చాడని మర్చిపోయి దీనిని ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకొని, వాడుకుంటున్నాం. దేవునికి కాలంతో అనగా దినంతో పనిలేదు. ఆయనకు నిన్న గాని, రేపు గాని ఉండదు. ఎప్పుడు అడిగినా నేడు అంటాడు లేదా నేను ఉన్నవాడను (నిర్గమ 3:14) అంటున్నాడు. అనగా ఆయన కాలానికి అతీతుడు. మనకు అనగా మనిషి జీవితంలో నిన్ను - నేడు - రేపు ఉన్నాయి గనుకనే మనతో మాట్లాడినపుడే నిన్న -నేడు - రేపు నిరంతరం ఒక్కరీతిగా ఉన్నాను అని అంటాడు. కాలములు, సమయాలు అన్నీ దేవుని స్వాధీనంలో ఉన్నాయి గనుకనే ఈ దినము ఎవ్వరికోసం ఆగదు. దానికి పక్షపాతము లేదు (అపొ.కా. 1:8).

కాని ఈ రోజుల్లో జీవిస్తున్న మనుషులు ప్రతిరోజు తమ దైనందిన జీవితంలో ఎక్కువగా మాట్లాడుతున్నదేమిటో తెలుసా? ఈరోజు మంచిరోజు కాదు, ఫలానా ఘడియ మంచిది కాదు అంటున్నారు. దేవుడు సృష్టించిన ప్రతిరోజు అది మంచిది అని అన్నాడు (ఆదికాండం 1వ అధ్యాయం). అలాగే ప్రతివారు దినాలు లేక రోజులు బాగా లేవండి అని అంటున్నారు. మరికొందరు రోజులు మారాయి, పరిస్తితులు బాగా లేవు అని మాట్లాడేస్తుంటారు. నిజంగా ఆలోచిస్తే దినాలు / దినం / రోజు ఎలా చెడిపోయిందని ఎవరూ ఆలోచించుట లేదు. ఎవ్వరైనా అడిగితే నిరుత్తరులే సుమా. మన లెక్కల ప్రకారం ఒకరోజుకు 24 గంటలు కదా! దేవుడు సృష్టిని పుట్టించినప్పటి నుండి (మానవుడు కనుగొన్న నేటి బిగ్‌బాంగ్ సిద్ధాంతం ప్రకారమైతే సుమారు 1370 కోట్ల సం॥రాలు) ఏరోజైనా

కాలం ఆగడం కాని, చెడిపోవడం కాని, దానిని తిరిగి రిపేరు చేయడం గాని జరిగిందా? దేవుని ఆజ్ఞ ప్రకారమే క్రీస్తు పూర్వం యెహోషువా కాలంలో ఒకరోజు మాత్రమే ఆపినట్లుగా బైబిల్లో వ్రాయబడి వుంది (యెహోషువా 10:12-15).

మనం కాలాన్ని కొలువడానికి తయారు చేసుకొన్న గడియారం చెడిపోవచ్చు లేదా ఆగిపోవచ్చు. కాని ఏ ఒక్కరోజైనా ఒక నిమిషం లేటు గాని, ఒక నిమిషం ముందు గాని అనగా స్లో లేదా ఫాస్ట్‌గా దినం ఉన్నట్లు చరిత్రలో గాని, శాస్త్ర పరంగా గాని రుజువు చేయగలరా? గడియారాన్ని రిపేరు చేసుకొని సమయాన్ని సరిచేయవచ్చునేమో గాని కాలగమనాన్ని మార్చలేము గదా!. దినములు చెడ్డవి అంటున్న మనుషులు ఆలోచించడం లేదు. ఈ రోజు గాని ఏ రోజైనా గాని దినాలు చెడిపోయాయా? ఆయా దినాలలో జీవించిన, జీవిస్తున్న మనుషులే చెడిపోయారు, పోతున్నారనేది జగమెరిగిన సత్యం. ఈ విషయాలు నా చిన్నపటి వాస్తవాతీతమైన మాట గుర్తుకొస్తుంది. చదువుకొనే రోజుల్లో మా ఊరు నుండి చదువుకొనే ఊరికి రైలుబండిలో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసి రైల్వేస్టేషన్ బైటికొచ్చాక నేను దొంగ బండి ఎక్కివచ్చానని గర్వంగా, సంతోషంగా చెప్పేవాడిని, ఇప్పటికి మా ప్రాంతంలో అందరూ అంటూంటారు కూడా. ఆలోచిస్తే టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసిన వాడు దొంగనా? రైలుబండి దొంగదా? ఇపుడు కూడా మనిషి చెడిపోయి దినాలు చెడిపోయాయి అంటున్నాడు. మరియు మంచిరోజులు లేవు కావు అంటాడు.

ఎవరైనా బాగా సంపాదిస్తూ, ఆనందంతో ఒక్కో మెట్టు పైకెక్కుతుంటే చూసేవారు అతడి దినాలు, రోజులు లేక టైము బాగుంది అనుకోవడం, ఎవరైనా పడిపోతుంటే అనగా బ్రతికి చెడిపోతుంటే మా దినాలు లేక టైము బాగా లేదు అనుకోవడం పరిపాటి అయిపోయింది. ఎవరైనా మనల్ని ఆటపట్టిస్తున్నప్పుడు

లేదా అవమానించినపుడు నాకు మంచిరోజులు వస్తాయి ఆరోజు నీ సంగతి చూస్తాను అని అనడం కూడా చూస్తుంటాము. మనం కూడా ఎన్నోసార్లు అనుకొని, అని ఉంటాం. ఇంకా ప్రతి మనిషి తన దినం కోసం ఎదురుచూస్తూంటాడు. నేటి యాంత్రిక యుగంలో జీవిస్తున్న వారు తమ ఆనందం కోసం కొన్ని ప్రత్యేక దినాలు ఏర్పాటు చేసుకొని వాటికోసం ఎదురుచూస్తున్నారు. అవేనండి జన్మదినం, పెళ్ళిరోజు, ప్రేమికులరోజు, తల్లిరోజు, తండ్రిరోజు, పిల్లలరోజు, స్నేహితుల రోజు ఇలా సం॥లోని ప్రతి దినాన్ని ఒక్కో ప్రత్యేక దినంగా అంతర్జాతీయంగా ప్రకటించుకొన్నారు. విచిత్రమేమంటే చస్తామని తెలిసినా చావురోజు కోసం మాత్రం ఎవ్వరూ ఎదురు చూడరు.

దేవుడు సృష్టించిన కాలాన్ని దినాలుగా విడగొట్టి తమ స్వార్థం కోసం వాడుకొని దేవుడిని మరచిపోతున్నప్పుడు దేవుడు కూడా తను కొన్ని దినాలను తన దినాలుగా ప్రకటిస్తాడని మరచి పోయారు. దేవుని వాక్యము, మానవుని జీవగ్రంథము లేక బ్రతుకు పుస్తకము, సత్యవేదముగా పిలువబడుతున్న బైబిల్ గ్రంథంలో దేవుడు తన దినాన్ని గూర్చి చెప్పాడని, తన కుమారుడు, లోకరక్షకుడైన క్రీస్తు పేరు మీద మరొక దినాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాడని బైబిల్ గ్రంథాన్ని దేవుని ఆలోచన లేక మనస్సు నెరిగి చదివితేనే అర్థమయింది. దేవుడు తన పేరు మీద ఒక దినాన్ని ఏర్పాటు చేసినట్లుగా చెప్పాడు. అది యెహోవా దినము లేక యెహోవా ఏర్పాటు చేసిన దినముగా చెప్పారు నాటి ప్రవక్తలు. ఇది తను కావాలనుకొన్న పిల్లల మేలుకోసం ఏర్పాటు చేశాడు. రెండవది క్రీస్తు దినము లేక ప్రభువు దినముగా చెప్పబడింది. ఇది లోకానికి తీర్పు దినం లేదా అంత్యదినం. మొదటిది మానవాళికి రక్షణ దినము రెండవది శిక్షణ (శిక్షించే) దినము. మొదటి దినమైన దేవుని (యెహోవా) దినమును గూర్చి ఆలోచిస్తూ ముందుకు సాగుదాం. అయితే ఈ విషయాలను ధ్యానించి, అర్థం చేసుకోవడానికి ముందు కొన్ని సంగతులను గ్రహించుకోవాలి. దేవుని

వాక్యము పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాయబడింది గనుక ఆత్మ నేర్పు సంగతులను ఆత్మ నేర్పు మాటలతోనే సరిచూసుకోవాలి గాని తియ్యటి మాటలు, మాయమాటలు చెప్పగూడదు. మరియు మనుషుల సాక్ష్యాలు కూడా ఎందుకూ పనికిరావు (1కొరింథీ 2:1-16) (1యోహాను 5:5-12, యోహాను 8:12-19).

ఆనాటి ప్రవక్తలు, అపొస్తలులే లేఖనాలను, సమయం సందర్భానుసారంగానే పరిశీలించారు గనుక మనము దానినే ఆధారం చేసుకొంటేనే సుళువుగా గ్రహించుకోగలుగుతాము. "మీకు కలుగు ఆ కృపను గూర్చి ప్రవచించిన ప్రవక్తలు ఈ రక్షణను గూర్చి పరిశీలించుచూ, తమయందున్న క్రీస్తు ఆత్మ, క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, వాటి తర్వాత కలుగబోవు శ్రమలను గూర్చియు ముందుగా సాక్షమిచ్చినపుడు, ఆ ఆత్మయే కాలమును, ఎట్టి కాలమును సూచించుచూ వచ్చెనో దానిని విచారించి పరిశోధించిరి." (1పేతురు 1:8-11).

ఇలా బైబిల్‌కు బైబిలే సమాధానమని ఆలోచించినపుడు ఈ యెహోవా దినము, క్రీస్తు దినమును గూర్చి సంపూర్ణముగా సుళువుగా గ్రహించగలము. అలాగే మనుష్యులు ఏర్పరచినట్టి పవిత్రవారము, మట్టలాదివారము, భస్మ బుధవారము లాంటి వాటిని గూడా వాక్యానికి ఎంతవరకు ఉపయోగమో తెలుస్తుంది. వాక్యానుసారంగా కాదు గనుక వద్దు అంటే వినేరకము కాదు నేటి క్రైస్తవులు గనుక వాటి అర్థాన్ని గూర్చి అయినా తెలుసుకొందాము. అన్నింటి కన్నా ముఖ్యముగా దేవున్ని వ్యర్థముగా ఆరాధించకూడదు గనుక ప్రతి ప్రార్థనా / ఆరాధన కూడికలలో క్రీస్తు ద్వారా దేవునిని మహిమపరచాలి. గనుక క్రీస్తు సిలువలో పలికిన 7 మాటలను కూడా జాగ్రత్తగా ధ్యానిద్దాం. ఎందుకనగా దేవుడు ఏర్పాటు చేసిన దినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది గనుక దీనికి ముందు జరిగిన అద్భుతమైన సంగతులను తెలుసుకొందాం మనుషులు ఏర్పాటు చేసిన దినాల అంతు తేల్చుదాం.

# శ్రమలు ఎప్పుడు? ఎక్కడ?

పాత నిబంధన లేదా పాత ధర్మశాస్త్రప్రకారంగా నాటి ఇశ్రాయేలీయులకు దేవుడు కొన్ని పండుగలలో సంతోషంగా ఉండమని, కొన్ని పండుగల్లో శ్రమతో బాధపడుమని, కొన్ని దుఃఖ దినాలు సల్పమని ఆజ్ఞాపించాడు. వారు వాటిని నెరవేర్చలేక దేవుని ఆజ్ఞను మీరి వారి పాపం పండి, వారి అంత్య దినాలలో యేసును భూమి మీదకు పంపి ఆయన మరణ దినంతో వారి బలాన్ని, వారికిచ్చిన వాగ్దానాలను, ఆజ్ఞలను అంతంచేసి, వారితోనే తన నూతన నిబంధన ప్రారంభించి ఆ నూతన ధర్మ శాస్త్రాన్ని లేక ఆజ్ఞలను పాటించ మన్నాడు. వారితోపాటు సమస్త మానవాళిని ఆ నూతన నిబంధనను హత్తుకోమన్నాడని దేవుని వాక్యం సెలవిచ్చిన సంగతి మనందరికి బాగా సుపరిచితమే.

అయితే తన రాజ్యం అనగా దేవుని రాజ్యంలోనికి ప్రవేశింపక ముందే జనులు అనేక శ్రమలు అనుభవించాలి అని అపొస్తలుల బోధ తెలియజేస్తుంది (అపొ.కా. 14:22). క్రీస్తు బోధించేటప్పుడే అనేకులను ''ఇరుకు మార్గమున ప్రవేశింప పోరాడుడి'' (మత్తయి 7:13-14) అని హెచ్చరించాడు. ఇకపోతే మనందరికి రాజు, ప్రధాన యాజకుడు అయిన క్రీస్తు ప్రభువే జీవితాంతం శ్రమలను అనుభవించాడు. ''శరీరధారియై ఉన్నదినములలో మహా రోదనలతోను, కన్నీళ్ళతోనూ, తన్ను మరణం నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను, యాచనలను సమర్పించి భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను. ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను'' (హెబ్రీ 5:7-10). మనకు మాదిరికరంగా అనగా మనము ఆయనలోనికి రూపాంతరము చెందుటకే

రక్తమాంసములలో పాలివాడైనని వ్రాయించాడు (హెబ్రీ 2:14-18). ప్రతి సంవత్సరం 40 దినాలను శ్రమల దినాలుగా మనం ఏర్పాటు చేసుకొని మన ఇష్టమొచ్చినట్లుగా మనం శ్రమపడ్డట్టు నటిస్తున్నాం గాని, దేవుడు తన పిల్లలను శిక్షించే విధానం అర్థం చేసుకోవడంలేదు. అందుకే ముందు యేసు జీవితాంతం శ్రమపడ్డాడు. (హెబ్రీ 12:1-13). అంతకు ముందు ప్రవక్తలు, భక్తులు జీవితాంతం శ్రమపడ్డారు (హెబ్రీ 11వ అధ్యాయం).

ఆ తర్వాత సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిన అపొస్తలులు ప్రతి దినము తమ సిలువ (శ్రమ) నెత్తుకొని జీవితాంతం యేసును వెంబడించి (లూకా 9:22,23) ఆ ప్రకారమే మనల్ని వెంబడింపమని బోధించి, హెచ్చరించి, ఆజ్ఞాపించి హతసాక్షుల యినారు. వారెలా తమ బ్రతుకు కాలములో శ్రమలనుభవించారో ఈ వాక్యాలను చదివి ఆలోచిస్తే ఈనాటి శ్రమదినాలు ఎంత అన్యాయమైనవో మీరే గ్రహించగలరు. పౌలు పత్రికలు, జీవితమే మనకు గుర్తు చేస్తున్నాడు (1కొరింథీ 4:9-13, 2కొరింథీ 4:7-18, 6:7-10, 7:3-5, 11:23-33). క్రీస్తు చేత, క్రీస్తు కొరకు ప్రత్యేకముగా పట్టబడి, రక్షింపబడి, అనేకుల రక్షణార్థమై వినియోగింపబడిన పౌలు అనబడిన సౌలు ఎన్ని శ్రమలు అనుభవించాడో చెప్పనలవికాదు. "మేము క్రీస్తును పోలి నడుచుకొన్న ప్రకారము మీరు మమ్మును పోలి నడుచుకొనుడి" (1కొరింథీ 4:1) అని ఆయన చెబితే ఆ బోధ ఇంకా క్రైస్తవ సమాజం చెవికెక్కడమే లేదు.

అయితే పౌలు వారి బాధలు చెప్పి మనం అలాగే నడుచుకోవాలని ఎంతగానో శ్రమకోర్చి ప్రయాణాలు సాగించి అనేక సంఘాలను స్థాపించాడు. ప్రారంభంలో ప్రతి నిత్యం శ్రమించిన సంఘం సాతాను మాయలో అనగా మనుషులు కల్పించిన పద్ధతుల కలవాటుపడింది. చివరగా క్రీస్తు రాజ్యాన్ని లేక ప్రారంభ సంఘాన్ని స్థాపించిన పేతురు బోధను కూడా విందాం." క్రీస్తు శరీరమందు

శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడి.'' (1పేతురు 4:1,2,12-9, 5:1-9). ఇక్కడ క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించాలి అన్నాడు గాని సంవత్సరానికి ఇన్నిరోజులు అని చెప్పడం లేదు. లోకమందున్న సోదరులందరికి, అగ్నివంటి మహాశ్రమలు కలుగుచున్నవి అని ఈ పత్రిక వ్రాసేటప్పటికీ చెప్పుచున్నాడు. యోహాను గారు కూడా క్రీస్తు శ్రమలలో పాలిభాగస్తుడను అని అంటున్నాడు (ప్రకటన 1:6-9).

భూమిమీద బ్రతికినన్ని రోజులు ప్రతి విశ్వాసి, ప్రతిరోజూ శ్రమలు అనుభవించాలి. అని ఇప్పటికీ ఎన్నో వాక్య రుజువులు చూపాను. మరికొందరు 7 ఏండ్ల శ్రమలు రాబోతున్నాయి అని బోధచేస్తున్నారు. ఈ ఏడేండ్ల శ్రమలు గూర్చి అపొస్తలుల బోధలో ఎక్కడ వ్రాయబడలేదు. ఈ ఇరుకు మార్గంలో క్రీస్తుమాట ప్రకారం నడిచిన ప్రతి వారికి ప్రతిక్షణం ఏదో ఒకరకంగా శ్రమ కలుగుతూనే ఉంది. శరీరాన్ని విడిచాక, మనకు నెమ్మది, క్రీస్తురాకడలోనే ఈ శ్రమలకు ఫలితం ఉంది (1పేతురు 1:6,7). యేసుక్రీస్తు బలిదినము అనగా యెహోవా ఏర్పాటు చేసిన దినమునకు ముందే 7 సం॥లు అగ్ని మండుతుంది, లేక ఏడేండ్ల శ్రమలు ఇశ్రాయేలీయులకేనని యెహెజ్కేలు ప్రవచించాడు (యెహె. 39:6-10). కావున 40 దినాల శ్రమలు సాతాను మాయ అని గ్రహించిన వారు ధన్యులు మరియు ఏడేండ్ల శ్రమలకోసం చూసేవారిని ఏమనాలో ఆలోచించండి.

# ఉపవాసం ఉపవాస దినములు

ఉపవాసం, ఉపవాస దినమనేది ఈ మధ్య సరికొత్త ఫ్యాషన్ గా మారింది. కొందరు గొప్పగా చెప్పుకోవడం కోసం చేస్తే, మరికొందరు డైటింగ్ లేదా ఆరోగ్యం కోసం చేస్తే, ఇంకొందరు అవసరాలకోసం దేవుడిని అడుక్కోవడం లేదా కోర్కెల సాధనకోసం చేస్తున్నారు. ఉపవాసం చేసే చర్చిలకోసం జనం గొప్పలు చెప్పుకొంటున్నారు. ప్రతినెలా తప్పనిసరిగా ఒకరోజును ఉపవాస దినంగా ప్రకటించిన సంఘాలు కోకొల్లలు. వారంలో ఒక్కరోజు ఒక్కో దేవుడు / దేవత పేరున హిందూ సోదరులు చేస్తే, ముస్లింలు శుక్రవారాలు చేస్తే, క్రైస్తవులు కూడా శుక్ర, శనివారాలు చేస్తున్నారు. లోకంలో ఉన్న వారు ఎలా చేసినా మన కనవసరం కాని మనం వారిలా చేయడమే అభ్యంతరకరంగదా! (రోమా 12:1,2). అసలు ఉపవాస దినాలలోనే బలమైన ఆహారం తింటున్నారు జనం. ఎందుకంటే మహాశివరాత్రి రోజు గాని, రంజాన్ మాసంలోనూ, గుడ్‌ఫ్రైడే రోజులో అమ్ముడు పోయినన్ని పండ్లు (ఫ్రెస్ మరియు డ్రైఫ్రూట్స్) మామూలు దినాలలో అమ్ముడుపోవు తెలుసు గదా! అందుకే దేవునికనుకూలమైన ఉపవాసం ఎలా ఉంటుందో, ఉండాలని దేవుడు చెప్పాడో మరోసారి జాగ్రత్తగా లేఖనాలను పరిశోధించి పరిశీలన చేసి, గ్రహించి, దాని ప్రకారం ప్రవర్తిద్దాం.

ఇశ్రాయేలీయులు కాలంలో దేవుడు వారిని ఉపవాసం చేయమన్నాడు దుఃఖ దినములు పాటించమన్నాడు. వారు ఆరోజుల్లో మామూలు దుస్తులుగాకుండా గోనెపట్ట కట్టుకొని, ఒంటికి బూడిద రాసుకొని ఉపవాసం చేసేవారు. దేవుడు వారి కోర్కెలు తీర్చుకోవడానికి మాత్రమే ప్రత్యేకంగా క్రటించి, వారినికొకసారి, ప్రత్యేక

సందర్భాలలో అనగా పెళ్లిళ్ళు, ఉద్యోగాలు, ఆస్తులు, అంతస్తులు పొందడం కోసం, కొందరు మాత్రమే సువార్త సభలు విజయవంతం అవడం కోసం, కొందరు మాత్రమే సువార్త సభలు విజయవంతం అనడం కోసము ఉపవాస ప్రార్థనలు చేస్తున్నారు. అయితే నాటి నుండి తన జనులు ఎలా ఉపవాసం చేయాలో, ఏవిధంగా చేస్తే ఆయన కిష్టమో చెప్పినా ఎవ్వరూ అర్థం చేసుకోక వ్యర్థంగా ఈ ఉపవాసమును ఆచరిస్తున్నారు. క్రీ॥పూ॥ 700 సం॥ల క్రితమే యెషయా వ్రాసిన సంగతులను, ఆతర్వాత యేసు చేసిన బోధను పరిశీలించి, ధ్యానిద్దాం.

"మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు? మేము మా ప్రాణములను ఆయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు? అని అందురు. మీ ఉపవాస దినమున మీరు మీ వ్యాపారము చేయుదురు. మీ పని వారిచేత కఠినమైన పని చేయించుదురు. మీరు కలహపడుచూ వివాదముచేయుచూ అన్యాయముగా గుద్దులాడుచూ ఉపవాసముందురు. మీకంఠధ్వని పరమున వినబడునట్లుగా మీరిప్పుడు ఉపవాసముండరు. అట్టి ఉపవాసము నాకనుకూలమా? మనుష్యుడు తన ప్రాణమును బాధపరచు కొనవలసిన దినము అట్టిదేనా? ఒకడు జమ్మువలె తలవంచుకొని, గోనెపట్ట కట్టుకొని, బూడిద పరచుకొని కూర్చుండుట ఉపవాసమా? అట్టి ఉపవాసము యెహోవాకు ప్రీతికరమని మీరనుకొందురా? దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు, కాడిమాను మోకులు తీయుటయు, బాధింపబడినవారిని విడిపించుటకు నేనేర్పరచుకొనిన ఉపవాసము గదా! నీ ఆహారము ఆకలిగొనిన వారికి పెట్టుటయు, నీ రక్తసంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు, వస్త్ర హీనుడు నీకు కనబడినపుడు వానికి వస్త్రములిచ్చుటయు ఇదియే గదా నా కిష్టమైన ఉపవాసము" (యెషయా 58:3-8,11)

ఈ వాక్యాన్ని గ్రహించిన వారికి నేను వివరించనవసరం లేదు గాని, అర్ధం కాని వారు ఇంకా లోతైన వివరణ అందని వారే అనేకులు ఉన్నారు గనుక దేవునికిష్టమైన విషయాన్ని గ్రహించి ఆయనను సంతోషపరుద్దాం. నాటి నుండి నేటి వరకున్న దేవుని ప్రజలు పై అధ్యాయంలోని 3,4,5 వచనాలలో ఉన్నవారివలెనె ఉపవాసముండి దేవునికి మొరపెడుతున్నారు. ఆయన నీతిని, రాజ్యమును వెదుకకుండా ఏది అడిగినా ఇవ్వడనియు (మత్తయి 6:25-34), ఆయన చెప్పిన పని చేయక ఆయనను ఏ రీతిగానైనా పిలువవద్దని (అడుగవద్దని) అస్సలు గుర్తు చేసుకోవడం లేదు (లూకా 6:46). ఉపవాసమనగా నేటి కాలంలో ప్రజలు - ఉద్యోగులు తమకు కావాల్సిన వాటికోసం పనిచేయకయే జీతాలిమ్మని నిరాహారదీక్ష చేయడం లాంటిదే. కంపెనీ / ఆఫీసు యజమాని ముందు పనిచేస్తేనే మీకు బెనిఫిట్స్ ఇస్తామనే సంగతి మరచిపోయారు. మన పరలోకపు తండ్రి / యజమాని కూడా ఆనాటి నుండి నేటి వరకు ఇదే చెబుతున్నాడు. ఇంతకు ఏంటి ఆయన నీతి లేక ఆయనకిష్టమైన ఉపవాసమో చూద్దాం.

ఈ లోక మాయ /చీకటిలో బంధింపబడిన వారిని, సాతాను తన కట్లతో బంధించిన వారిని అనగా తప్పుడు బోధలోనూ, మూఢ నమ్మకాలతోనూ, మంత్ర, తంత్రాలు అనో, క్షుద్ర శక్తులతో, దైవిక శక్తులతో పాకులాడే వారి, మనో నేత్రములను వెలిగించుటకు, జ్ఞానవంతులను చేయుటకు దేవుని రాజ్య సువార్తను ప్రకటించాలి. ప్రయాసపడి పాపభారమును మోయుచున్న (కాడి మాను మేకులు మోయుచున్న) వారికి క్రీస్తు మరియు దేవుని పిలుపునందించి వారికి విడుదల ప్రకటించాలి. అనగా ప్రతి దినము సువార్తను ప్రకటిస్తే దేవుని కోరిక లేక ఆకలిని తీర్చి ఆయన పిల్లలందరిని ఆయన యొద్దకు చేర్చడమే ఆయన కిష్టమైన ఉపవాసము. మరియు బీదలను ఆదుకొని, అందరికి సహాయం చేయడం, ఆకలిగొన్న వారికి అన్నం

పెట్టడం మొదలగు పనులన్నీ కూడా చేయాలి (మత్తయి 25:31-46, యాకోబు 2:14-26).

ఒకవేళ కొత్త నిబంధన ప్రకారం మనం ఉపవాసం చేయాలనుకొంటే ఎలా చేయాలో క్రీస్తు చెబుతున్నాడు. “మీరు ఉపవాసము చేయునపుడు వేషధారులవలె దుఃఖముఖులై ఉండకుడి. తాము ఉపవాసము చేయుచున్నట్లు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖము వికారము చేసికొందురు. వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఉపవాసము చేయుచున్నట్లు మనుష్యులకు కనబడవలెనని కాక, రహస్యమందున్న నీ తండ్రికి కనబడవలెనని, నీవు ఉపవాసము చేయునపుడు నీ తల అంటుకొని, నీ ముఖం కడుగుకొనుము. అప్పుడు రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును.” (మత్తయి 6:16-18).

పై మాటలను లోతుగా ఆలోచిస్తే మనం ఉపవాసం చేస్తున్నట్లు అవతలి వ్యక్తులకు తెలియకూడదన్నమాట. కాని ఈరోజుల్లో ఉపవాసం చేయకముందే ఫలానా రోజున ఉపవాస కూటము లేక కూటములు ఉన్నాయి అని ప్రకటిస్తున్నారంటే ఎంతటి ఘోరమైన ఆజ్ఞాతిక్రమమో ఒకసారి జాగ్రత్తపడండి. అందరికి తెలిసేటట్లు ఉపవాసం చేస్తే దానిఫలితం పొందియున్నారు అన్నాడంటే, అది పాపమేనని గ్రహించండి. ఇది ప్రారంభ క్రైస్తవ్యమును హెచ్చరించాడు, అప్పటికింకా నూతన నిబంధన అమలులోనికి రాలేదు. కాని తనను వెంబడించే వారంతా ఇలా ఉండాలని ముందే తన కొండమీది ప్రసంగంలో హెచ్చరించాడు. దేవునికిష్టమైన ఉపవాసమేమిటో క్రీస్తుకు బాగా అర్థం అయింది. గనుక ఆయన ఈ కొత్తనిబంధన అమలులోనికి రాకముందే అనగా సిలువ వేయబడక ముందే ఉపవాసము చేశాడా? ఏలాంటి ఉపవాసం చేశాడు? అనే విషయం చూద్దాం ఆశ్చర్యం, అద్భుతంగా ఉంటుంది.

క్రీస్తు, ఆయన శిష్యులు బోధిస్తున్న కాలంలో ఎప్పుడు ఇలాంటి అనగా నాడు -నేడు అందరు చేసినట్టి ఉపవాసం చేయలేదు. అయితే అప్పటికే ఆయన మార్గము సరాళం చేయడానికి వచ్చిన యోహాను శిష్యులు, శాస్త్రులు, పరిసయ్యులు అనగా మతాధికారులు, శిష్యులు ఉపవాసం చేస్తున్నారు. అనగా అందరికి కనబడే ఉపవాసం చేస్తున్నారు. కాని క్రీస్తు, శిష్యులు చేసినట్లు, చేస్తున్నట్లు ఎవ్వరికి కనబడుటలేదు. అందుకే "వారు వచ్చి యోహాను శిష్యులును, పరిసయ్యుల శిష్యులను ఉపవాసము చేయుదురుగాని, నీ శిష్యులు ఉపవాసము చేయరు. దీనికి హేతువేమని అడుగగా, యేసు - పెండ్లి కుమారుడు తమతో కూడా ఉన్న కాలము పెండ్లి ఇంటివారు ఉపవాసము చేయుతగునా? పెండ్లి కుమారుడు తమతో ఉన్నంతకాలము ఉపవాసము చేయతగదు గాని, పెండ్లి కుమారుడు వారియొద్ద నుండి కొనిపోబడు దినములు వచ్చును, ఆ దినములోనే వారు ఉపవాసము చేతురు." (మార్కు 2:18-20).

యెషయా చెప్పింది మరియు కొండమీద చెప్పింది కూడా వారు గ్రహించలేదని తెలిసి, మళ్ళీ చెప్పినా వారు వినరని గ్రహించి, మరో క్రొత్త సంగతిని బయలుపరిచాడు. ఇక్కడ సుళువుగా అర్థమయ్యే ఉదాహరణ ఇచ్చాడు. పెండ్లి కుమారుడు ఇంట్లో ఉంటే ఎవ్వరు ఉపవాసము ఉండరు గాని మంచి విందులో ఉంటారు గదా! యేసయ్య పెండ్లి కుమారుడు, పెండ్లి ఇంటివారు దేవుని జనాంగము అనగా సంఘము. ఆయనకు సంఘానికి పెళ్ళి జరిగింది (2కొరింథీ 11:1-3) అప్పటికింకా పూర్తిగా పాతనిబంధన తొలగింపబడలేదు, నూతన నిబంధన పూర్తిగా అమలులోనికి రాలేదు అనగా పూర్తిగా సర్వసత్యములోనికి రాలేదు గనుక. యూదుడైన యేసుకు, సంఘానికి ప్రధానమే పెళ్ళి. ఇది ఇశ్రాయేలీయుల పద్ధతి. యోసేపు - మరియమ్మల ప్రధానమే వివాహము. అందుకే పౌలు ఎఫెసిలో భార్యభర్తలు అని సంబోధించాడు సంఘాన్ని క్రీస్తును (ఎఫెసి 5:22-33). మరియు మనం పెండ్లి విందులోనే ఉన్నాం అది దేవుడు

ఆనాటినుండే పిలుచుచున్నాడని చెప్పబడింది. దాని గ్రహించక ఎవరు విందులోనికి రాక సాకులు చెబుతూ, పెండ్లికోసం, విందుకోసం ఎదురుచూస్తూ ఇంకా ఉపవాసముంటున్నారు. ఎందుకనగా చాలా సంఘాలు సిలువ వేయబడిన క్రీస్తు బోధలో లేవు గనుక ఇప్పుడు నేను చెబుతున్న విషయాలు కూడా గ్రహించలేక ఎదురు తిరుగుతున్నారు. పెండ్లి కుమార్తె అనగా సంఘం దిగివచ్చి, ఆయనకు భార్యగా మారింది అని యోహాను ప్రకటనలో చెప్పాడు (ప్రకటన 21:2-10).

ప్రకటన 21వ అధ్యాయం అంతా క్రీస్తు పరమునకెత్తబడిన వెంటనే జరిగినదని జాగ్రత్తగా చదివితే సులువుగా గ్రహించగలవు. ఆత్మ నేర్పుమాటలను, ఆత్మతో వ్రాయబడిన లేఖనాలతో సరిచూస్తే, అర్థం అవుతుంది. ఇదంతా యిర్మీయా 30:22-34, 31:31-34, అపొ.కా. 4:32-35, 2కొరింథీ 5:17, యెషయా 65:17-24 చదివి సరిచూస్తే అర్థమయి తీరుతుంది. ఇంకా మనం విందులో ఉన్నాము. దేవుడు తన కుమారుని పెండ్లి విందుకు పిలుస్తున్నాడా? పిలిచాడా? మత్తయి 22:1-14 చదివి గ్రహించండి. అలాగే మనుష్య కుమారుడు, పెండ్లి కుమారుడు పైకెత్తబడిన కాలములో అనగా అపొస్తలుల కార్యములలో మాత్రమే ఉపవాసముండి, ప్రార్థన చేసి పంపారు అంటే అప్పటికింకా సర్వసత్యము అనగా బైబిల్ అంతా పూర్తి కాలేదు. అందరికి అందలేదు (అకా. 13:2-3, 14:23).

అయితే యేసుప్రభువు ఇప్పుడు మన యొద్ద ఉన్నాడు (రోమా 10:8-12) ఆయన తనను నమ్మి, బాప్తిస్మం తీసుకొన్న వారందరితోను సదాకాలం ఉంటానని వాగ్దానం చేశాడు (మత్తయి 28:18-20, యోహాను 14:23,24) పెండ్లి కుమార్తెగా అనగా మనకు సంఘంగా, పెండ్లి కుమారుడైన క్రీస్తు మనలో, మనతో ఉండగా మనమెందుకు ఉపవాసముండాలి అందుకే ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించమని అన్యజనులకు అనగా మనకు అపొస్తలుడైన పౌలు మరీమరీ చెప్పాడు (ఫిలిప్పీ 4:4-7).

ధర్మశాస్త్రానికి లోబడవడలసిన వాడైన యేసు ఆయన శిష్యులు దేవునికిష్టమైన ఉపవాసం చేశారు. ఎందుకంటే ఇంకా ధర్మశాస్త్రము కొట్టివేయబడలేదు, అది సిలువలో మాత్రమే క్రీస్తు కొట్టి వేశాడు. అయితే ఆయన ధర్మశాస్త్రాన్ని నెరవేర్చుటకే వచ్చాడు (మత్తయి 5:17), నెరవేర్చితే కొట్టివేయబడుతుందని కూడా చెప్పాడు గనుక, ఆయన, ఆయన శిష్యులు ఇశ్రాయేలీయులే గనుక ఉపవాసము చేసి తీరాలి. కాని అది యోహాను శిష్యులు, పరిసయ్యుల శిష్యులు చేసినట్లుగా కాదు గాని దేవునికిష్టమైనట్లుగా చెయ్యాలి. అది ఆయనకు ఆయనకు ఆత్మతో వెంబడించిన వారికే అర్థం అవుతుంది. దేవుని ఆత్మ సహాయంతో చదివితే నాకర్థమయింది (ఎఫెసీ 3:12) మీ ముందుంచుచున్నాను చదివి, గ్రహించి, ఆనందించి ఇప్పటికి సాతాను కట్టిన కట్ల నుండి అనగా దుర్భోధనల నుండి, మూఢాచారాల నుండి సంఘాన్ని విడుదల చేయండి.

యేసుప్రభువు ఆత్మచేత శోధింపబడి, విజయుడై తిరిగి గలిలయప్రాంతానికి వచ్చి బలముతో బోధ చేస్తున్నాడు. తరువాత తాను పెరిగిన నజరేతుకు వచ్చి తన వాడుక చొప్పున సమాజ మందిరములోనికి వెళ్ళగా ప్రవక్తయైన యెషయా గ్రంతము ఆయనకియ్యబడింది. ఈ ప్రవచనం యెషయా 61:1-3, 42:1-6లలో ఉంది. అదే యెషయా 58:3-11లో ఈలాంటి ఉపవాసమే దేవుని కిష్టమైనదని, అలా చేసిన వాడి పని సఫలమవుతుందని చెప్పాడు. అదేదో ఇప్పుడు ఆలోచించి చదవండి, లేదా చదివినాకనైనా ఆలోచించండి గ్రహించండి. “ఆయన గ్రంథము విప్పగా - ప్రభువు ఆత్మ నామీద ఉన్నది, బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయననన్ను అభిషేకించెను. చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డి వారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును, నలిగిన వారిని విడిపించుటకును, ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు. అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరికెను. ఆయన గ్రంథము చుట్టి పరిచారకునికిచ్చి కూర్చుండెను.

సమాజమందిరములో నున్న వారందరు ఆయనను తేరిచూడగా, ఆయన - నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరిందని వారితో చెప్పసాగెను" (లూకా 4:14-21).

పై వచనములు యెషయా యేసును గూర్చి ఇశ్రాయేలీయుల మధ్య ప్రవచింపగా, అవే లేఖనములను యేసు వారి మధ్యకొచ్చి నెరవేర్చాడు. ఆయనతో పాటు శిష్యులు కూడా, సువార్తను ప్రకటిస్తూ అనేకులను శారీరక, ఆత్మీయ గుడ్డి; కుంటి తనము నుండి విడుదల చేశారు. అదే విషయాన్ని చెరసాలలో అనుమానంతో ఉన్న యోహానుకు తెలియజేసాడు (మత్తయి 11:2-6) యోహాను కూడా గ్రహించలేనంతగా దేవునికి ప్రీతికరమైన ఉపవాసాన్ని యేసు, ఆయన శిష్యులు చేశారు. అయితే ఆత్మీయ గుడ్డితనంలో ఉన్నవారు గ్రహించలేక అప్పటికింకా అనేకులు ఉపవాసాలు (కనబడేవి) చేశారు. ఇప్పుడైతే పరిశుద్ధాత్మను పొంది సర్వసత్యాన్ని ప్రకటించి ఆనాటి వారిని ఒప్పింపచేశారు అపొస్తలులు (యోహాను 16:1-16).

ఇప్పుడైతే సర్వసత్యము (66 గ్రంథముల సముదాయము) మన చేతుల్లో ఉంది. ఆనాటి సంఘాలకు అన్ని గ్రంథాలు ఒకచోట చేర్చి అందించబడలేదు గాని క్రీ॥శ॥ 325 తర్వాత సంపూర్ణ నూతన నిబంధన అమలులోనికి వచ్చి అందరి చేతుల్లోనికి అందివ్వబడింది. 1కొరింథీ 2వ అధ్యాయము, కొలస్సీ 1:24-29, ఎఫెసి ఇలా అన్ని పత్రికలలో అనగా సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిన పౌలు, ఇతర అపొస్తలుల వ్రాతల్లో మనం ఎలా బ్రతికితే తీర్పు తీర్చబడుతుందో చెప్పబడింది. ఆనాటి వారికి పరిశుద్ధాత్మ వరాలున్నాయి గనుక వాక్యముతో పాటు, సూచక క్రియలు చేసి వాక్యాన్ని స్థిరపరచి, యేసు దేవుని కుమారుడని నమ్మించి, ఆ వాక్యాన్ని మన చేతుల్లో పెట్టారు. ఎందుకంటే అపొస్తలులు వరాలున్న ఆనాటి శిష్యులు వెళ్ళాక అనగా వారి కాలం అయిపోతే సూచకక్రియలు ఆగాక ఆ వాక్యమే మనకు దిక్కు గదా! (అపొ.కా. 20:18-32, యాకోబు 1:10-27, 2పేతురు 1:12-21) అందుకే మనకు కేవలం పరిశుద్ధాత్మ

వరము మాత్రమే ఇవ్వబడింది. దానితో ఆత్మఫలాలు ఫలించాలి వాటిని అనేకులకు అందించాలి (అపొ.కా. 2:37-42, గలతీ. 5:16-26).

క్రీస్తు అనే వెలుగు నొద్దకు, జీవజలమునొద్దకు, జీవాహారము నొద్దకు చీకటి అనే పాపంలో జీవించుచున్న వారిని నడిపించి, వారిని దేవునిలో నిలిపి, వారిలో ఉన్న దురాచారాలను, విగ్రహారాధనను, మూఢనమ్మకాలను, క్షుద్రశక్తులు - దైవిక శక్తులు ఇంకా ఉన్నాయి అనే మాయలో నుండి విడిపించుటకై క్రీస్తు / దేవుని రాజ్య సువార్తను సకల విధములైన అనుభవ జ్ఞానంతో, దేశ చట్టాలను గౌరవిస్తూ, దేవుని చట్టానికి లోబడి ప్రకటించడమే దేవుని చిత్తము లేదా ఆయనకు ప్రీతికరమైన ఉపవాసము. దీనిని ప్రతి క్రైస్తవుడు ప్రతి దినం, ప్రతిక్షణం చేయాలి. జాతి, మత, కుల, ప్రాంతీయ, భాషా బేధాలు లేకుండా అందరిని ప్రేమించి, దేవుని రాజ్యంలోనికి సర్వమానవాళిని నడిపించడమే, క్రీస్తు యేసులో ఈ సృష్టికి పూర్వమే దేవుడు ఏర్పాటు చేసుకొన్న దయాపూర్వకమైన సంకల్పమే (ఎఫెసీ 1:3-12) ఈ రక్షణ మార్గము.

అందుకే పౌలు గారు మనందరికోసం తన కిష్టమైన తిమోతి నుద్దేశంచి ఈ ఉపవాసంను గూర్చి ఎలా బోధిస్తున్నాడో చదవండి "దేవుని యెదుటను, సజీవులకును, మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షతతోడు, ఆయన రాజ్యము తోడు, నేను ఆనబెట్టి చెప్పునదేమనగా! వాక్యమును ప్రకటించుము, సమయమందును, అసమయమందును ప్రయాసపడుము, సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు, ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము. ఎందుకనగా జనులు మత బోధను సహింపక...." (2తిమోతి 4:1-8). ఉత్తమమైన వాటిని గూర్చిన "సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" (రోమా 10:14,15, యెషయా 52:7) ఇలా సువార్తనెరుగని వారికి ప్రకటిస్తూ, తప్పుడు

సువార్తలో ఉన్న వారికి నిజమైన రాజ్యసువార్త ప్రకటించి, దేవుని కనుకూలమైన సజీవయాగము చేసి రూపాంతరం చెందాలి. (రోమా 12:1-2).

ఈలోక మర్యాదకు లోబడి, మనుషులు కల్పించిన పద్ధతులే దైవోపదేశములని వ్యర్ధముగా దేవుని ఆరాధించి, క్రీస్తు నామాన్ని అన్యజనుల మద్యన దూషిస్తారో, దేవుని వాక్యాన్ని ప్రకటించి, దాని ప్రకారం ప్రవర్తించి మన ఆత్మలను రక్షించే ఈ శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించి, దేవునిని ఆయన వాక్యము, ఆత్మ ద్వారా ఆరాధించి, ధ్యానించి పరలోకము చేరుతారో, ప్రకటించడం, ప్రకటించేవారికి సహాయం చేయడం చేతకాదు బ్రదర్ వీలైతే లేక వీలుచేసుకొని ఉపవాసముండి దేవునిని అడిగి మీకు సహకరిస్తాం అని అంటారో  దేవుడు వాక్యంలో వ్రాసిందికాక, మీకు, పెద్దలకు, మీ కాపరులకు బయలు పర్చినదే చేస్తారో, నన్ను ఈ సంగతిని గూర్చి క్లుప్తంగా వ్రాయడానికి సహాయం చేసిన ఆత్మను ఎదిరిస్తారో మీకే వదిలివేయుచున్నాను.

# మట్టలాదివారము
# (Palm Sunday)

ఇశ్రాయేలీయుడైె పౌలు, సమస్త అన్యజనులకు అపొస్తలుడుగా ఉండుటకు పిలువబడి అందరిని సర్వసత్యము లోనికి నడిపిస్తూ కూడా తన స్వజనమైన ఇశ్రాయేలీయులైన వారందరి రక్షణ కొరకు బాధపడుతున్నాడు. ఎలాగంటే వారి వద్ద నిత్యజీవాన్నిచ్చే లేఖనాలున్నా వాటినర్థం చేసుకోలేకపోయారు. "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని నా హృదయాభిలాషయు వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునైయున్నవి. వారు దేవునియందు ఆసక్తిగల వారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను అయినను వారి ఆసక్తి జ్ఞానాను సారమైనది కాదు. ఏలయనగా వారు దేవుని నీతినెరుగక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచూ, దేవుని నీతికి లోబడలేదు." (రోమా 10:1-3).

ఆనాటి శ్రాయేలీయులు దేవునియందు ఎంతో ఆసక్తి, భయభక్తులు కలిగి జీవించినవారే కాని వారి విశ్వాసము మనుషులు నిర్ణయించిన పద్ధతులకు లోబడిందే కాని వాక్యానుసారమైనది కాదని పైవచనాలు రుజువు చేస్తున్నాయి. వారికి తెలియకనే లేఖనాలను నెరవేర్చియున్నారు. అదే మూర్ఖపు, మూఢభక్తి నేటి క్రైస్తవులలో కూడా ఉండడమే బాధాకరము. క్రైస్తవుల విశ్వాసము అనేక విషయాలలో వాక్య ప్రకారము లేక అనేకులు తప్పిపోవుచున్నారు. ఎందుకంటే ప్రతి సం॥రము ఈ మట్టల ఆదివారాన్ని ఎంతో భక్తులతో ఆచరిస్తున్నారు. కాని దాని వెనుకాల ఉన్న చరిత్రను గ్రహించుట లేదు. ఆరోజు పలికే పలుకులు, ఊరేగింపులు నిరర్ధకమయ్యేటట్లు తమ మాటలు, పాటలలో వ్యక్తపరుస్తున్నారు. ఆనాడు ఇశ్రాయేలు రాజుకు జయమన్నవారే, మాకు కైసరు తప్ప వేరొక రాజు లేడు అన్నారు. ఈ రోజుకూడా క్రీస్తు రాజ్యపరిపాలన చేయుచున్నాడు అంటే

ఒప్పుకోరు కాని ఆయన రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు అంటారు. నీరాజ్యము వచ్చును గాక అనియు ప్రార్థిస్తూ రాజు యేసు రాజ్యమేలరావే అనే పాటల పాడుతున్నారు. లెంటు తర్వాత పవిత్రవారం అంటూనే దానికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. మట్టలాదివారం నాడు, దానికి ముందు వెనుకాల జరిగిన చరిత్ర చూద్దాం.

"మరునాడు ఆ పండుగకు వచ్చిన బహు జన సమూహము యేసు యెరుషలేముకు వచ్చుచున్నాడని విని, ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి - జయము, ప్రభువు పేరిట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజుల స్తుతింపబడును గాక అని కేకలు వేసిరి. సీయోను కుమారీ, భయపడకుము, ఇదిగో నీరాజు గాడిదపిల్ల మీద ఆసీనుడై వచ్చుచున్నాడు. అని వ్రాయబడిన ప్రకారము యేసు ఒక చిన్న గాడిదను కనుగొని దానిమీద కూర్చుండెను. ఆయన శిష్యులు ఈ మాటలు మొదట గ్రహింపలేదు గాని యేసు మహిమపరచబడినపుడు అవి ఆయనను గూర్చి వ్రాయబడెననియు, వారాయనకు వాటిని చేసిరనియు జ్ఞాపకము తెచ్చుకొనిరి" (యోహాను 12:12-16).

ఇదే విషయాన్ని మత్తయి తన సువార్త 21:1-11లోను, మార్కు తన సువార్త 11:1-11లోనూ, లూకా తను వ్రాసిన సువార్త 19:29-40లోను ఇంకా వివరంగా వ్రాస్తు, దీనికి మూలమైన గ్రంథాలు జకర్యా 9:9లోను కీర్తన 118:26 వ్రాసిన సంగతులనెత్తి వ్రాసారు. అంటే ఆరోజు యేసు వ్రాయబడిన ప్రకారం యెరూషలేములో వారి రాజుగా జయోత్సాహముతో ప్రవేశించాడని అపొస్తలులు తర్వాత గ్రహించారు అని మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడింది. ఆయన బ్రతికున్నపుడే అనగా సిలువ వేయబడకముందే రాజుగా అభిషేకింపబడినాడని ఈరోజు ఎంతమందికి తెలుసు? యేసు రాజుగా వచ్చుచున్నాడు అని పాడేవారెంత అనాలోచనతో పాడుతున్నారో చూస్తే జాలివేస్తుంది.

అందుకే యేసుగొప్పతనము, ఇంకా ప్రపంచానికి అందడం లేదు గనుకనే ఆయన నామము దూషింపబడుచున్నది.

ఆయన అప్పగింపబడిన తర్వాత పిలాతు అడుగుతాడు నీవు రాజువా? అని, అందుకు యేసు నీవన్నట్టు నేను రాజునే అని అంటాడు (యోహాను 18:33-38) ఇంతకు ఎప్పుడు రాజయ్యాడో, ఇశ్రాయేలుకు రాజుగా ఉండాలంటే ఎలా ఆరాజును అభిషేకించి, ఊరేగించాలో ముందు మనం గ్రహించాలి. ఇశ్రాయేలుల రాజులు అప్పటికి భూసంబంధమైన వారే గనుక అందరికి కనబడేటట్లు ఆర్భాటంతో రాజులయ్యారు. ఈయన రాజరికం + రాజ్యం పరసంబంధమైనది గనుక లోకంలోని వారు గ్రహించి, గ్రహించలేకపోయినట్లుగా జరిగింది. దావీదుకు దేవుడిచ్చిన వాగ్దానం ఏమిటంటే ఆయన సంతానంలో నుండే వచ్చినవాడు మాత్రమే యుగయుగాలు పరిపాలించాలి ఆయన కుమారుని రాజ్యమే సూర్యుడున్నంతకాలం, చంద్రుడున్నంతకాలం ఈ భూమి మీద ఉంటుందని లేఖనములో వ్రాయబడింది (కీర్తన 89:19-37) అందుకే యేసు దావీదు కుమారుడిగా తనను నమ్మినవారందరిని ఇప్పటికి 2000 సంవత్సరాల నుండి పరిపాలిస్తున్నాడు. అయితే దావీదు తదనంతరం ఆయన కుమారుడైన సొలొమోను రాజ్యాభిషేకంను గుర్తు చేసుకొంటే, యేసు కూడా అలాగే అభిషేకింపబడి తన రాజనగరిలో (యెరుషలేము) ప్రవేశించాడు. ఇది అద్భుతం అని ఆత్మతో ఆలోచించి చదివినవారు ధన్యులు.

“కాబట్టి యాజకుడైన సాదోకును, ప్రవక్తయైన నాతానును, యెహోయాదా కుమారుడైన బెనాయాయును, కెరేతియులను, పెరేతీయులను రాజైన దావీదు కంచర గాడిద మీద సొలొమోనును ఎక్కించి గిహోనుకు తీసుకొని రాగా, యాజకుడైన సాదోకు గుడారములో నుండి తైలపు కొమ్మును తెచ్చి సొలొమోనుకు పట్టాభిషేకము చేసెను. అప్పుడు వారు బాకా ఊదగా కూడిన

జనులందరును - రాజైన సొలోమోను చిరంజీవియగును గాక అని కేకలు వేసిరి. మరియు ఆ జనులందరు అతని వెంబడివచ్చి పిల్లన గ్రోవులు ఊదుచు, వాటి నాదము చేత నేల బద్దలగునట్లు అత్యధికముగా సంతోషించిరి (1రాజులు 1:32-48, 2రాజులు 9:3-13లో) యెహూను రాజుగా అభిషేకించినపుడు జనులు తమ బట్టలు మెట్లమీద పరచి, బాకా ఊది కేకలు వేయడం జరిగింది. అలాగే 2రాజులు 11:12-14లోను 2దిన. 23:11లోను ఇశ్రాయేలీయులరాజు అభిషేకించినపుడు జనులు కేకలు వేయటం జరిగింది. ఈ పద్ధతి ప్రకారంగానే యేసు రాజ్యాభిషేకం జరిగి, రాజుగా యెరూషలేములో ప్రవేశించి, జనులు, చిన్నపిల్లలు కేకలు ఆపమంటే వారు ఆగితే రాళ్ళు కేకలేస్తాయి మీ ఈ రాజు కోసం అన్నాడు.

అభిషేకం అనగా తైలము పోయాలిగదా! సౌలు రాజుగా అభిషేకింపబడిననపుడు (1సమూ. 10:1-7), అతని తర్వాత దావీదు రాజుగా అభిషేకింపబడినపుడు కూడా (1సమూ. 16:12,13) తైలము చేత అభిషేకించాడు. అభిషేకం అంటేనే రుద్దడం, అంటడం అనగా తలమీద నూనె పోయడం అన్నమాట. మరి యేసుప్రభువు కూడా రాజుగా ప్రకటింపబడక ముందు ప్రజల కేలకలు వేయక ముందు ఆయనకు కూడా అభిషేకిం జరగాలి గదా! అది కూడా జరిగింది కాని జనులు, అపొస్తలులు గ్రహింపలేదు. కాని మనం గ్రహించి, ఒప్పుకొని తీరాలి. ఎందుకంటే మన ప్రభువు ఆ అభిషేకాన్ని గుర్తించి, అబిషేకించిన వ్యక్తిని ఆశీర్వదించాడు. ఒక దేశంలోని, రాష్ట్రంలో గాని ప్రధానినో, ప్రెసిడెంట్‌నో, ముఖ్యమంత్రినో అధిష్టించి వారిచేత ప్రమాణం చేయించి అధినేతగా ప్రకటించిన వారి పేర్లు సదాకాలము వారితో పాటు గుర్తుంటాయి గదా. ముఖ్యమంతి, మంత్రి మండలి చేత ప్రమాణము చేయించిన గవర్నరు పేరు చరిత్రలో నిలుస్తుంది. అలాగే యేసును అభిషేకించిన వ్యక్తికి ఆ గౌరవం దక్కింది.

“యేసు బేతనియ కుష్టరోగియైన సీమోను ఇంట నున్నప్పుడు, ఒక స్త్రీ మిక్కిలి విలువగల అత్తరు బుడ్డి తీసుకొని ఆయన యొద్దకు

వచ్చి, ఆయన భోజనమునకు కూర్చుండగా దానిని ఆయన తలమీద పోసెను. శిష్యులు చూచి కోపపడి, ఈ నష్టమెందుకు? దీనిని గొప్ప వెలకు అమ్మి బీదలకియ్యవచ్చునే అనిరి. యేసు ఆ సంగతి తెలుసుకొని - ఈ స్త్రీ నా విషయమై ఒక మంచి కార్యము చేసెను. ఈమెను మీరేల తొందపెట్టుచున్నారు? బీదలెల్లప్పుడు మీతో కూడా ఉన్నారు గాని నేనెల్లప్పుడు మీతో కూడా ఉండను. ఈమెను ఈ అత్తరు నా శరీరము మీద పోసి నా భూస్థాపన నిమిత్తము దీనిని చేసెను. సర్వలోకమందు ఈ సువార్త ఎక్కడ ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు, ఈమె జ్ఞాపకార్థముగా ప్రకటింపబడుననియు మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో చెప్పెను (మత్తయి 26:6-13, మార్కు 4:3-9).

ఆనాటి రాజులను అభిషేకించిన సమూయేలు, సాదోకు మొదలగువారు గుర్తుండినట్లు, యేసు రాజ్యస్థాపనకు గుర్తుగా ఈమె ఆయనను అభిషేకించింది. ఆతర్వాతనే యేసు పిలాతు ముందు నిలబడి నీవన్నట్లు రాజునే అని అన్నాడు. అదిగ్రహించిన పిలాతు సిలువపై ఆయన విలాసము రాసి ఉంచాడు యూదులు ఒప్పుకోక వద్దు అని అన్నా, ''మరియు పిలాతు యూదుల రాజైన నజరేయుడగు యేసు'' అను పైవిలాసము (అడ్రస్సు) వ్రాయించి సిలువ మీద పెట్టించెను. యేసు సిలువ వేయబడిన స్థలము పట్టణమునకు సమీపమైయుండెను. అది హెబ్రీ, గ్రీకు, రోమా భాషలలో వ్రాయించెను గనుక యూదులలో అనేకులు దానిని చదివిరి.'' (యోహాను 19:19-22) అదే **INRI** **I**-ఈసస్, **N**- నజరేనస్, **R**- రెక్స్, **I**- ఇడారియమ్. సిలువ వేయబడిన తర్వాత దేవుడాయనను అందరికి ప్రభువుగా, రాజుగా నియమించెను కనుక సర్వలోకము ఆయనను రాజుగా అంగీకరించి జైకొట్టాలి.

# భస్మ బుధవారం
## (Ash Wednesday)

ఇది బైబిల్‌లో ఎక్కడ లేదు గాని యేసు అనేక శ్రమలను అనుభవించిన తరువాత యెరూషలేములో ప్రవేశిస్తానని చెప్పాడు గనుక ఇశ్రాయేలీయులకు శ్రమలు కలిగినపుడు బూడిద పోసుకొని, గోనెపట్ట కట్టుకొని దేవునికి మొరపెట్టినట్లు పాత నిబంధనలో అనేక సంఘటనలలో లేదా సందర్భాలలో ఉన్నదని గుర్తు చేసుకొన్న భక్తులు (ఆది.కా. 18:27, 2సమూయేలు 13:19, ఎస్తేరు 4:1, యెషయా 2:8, దానియేలు 9:3) యేసు మరణించింది శుక్రవారం, లేచింది ఆదివారం గనుక అంతకు ముందు వారం నాడే యెరూషలేములో జయముతో ప్రవేశించాడు గనుక, ఆ ఆదివారమును మట్టల ఆదివారం అని అక్కడి నుండి సిలువ వేసే వరకు పవిత్రవారం అని నిర్ణయించినట్లు కనబడుతుంది. 40రోజులు శ్రమపడ్డాడని లెక్కకట్టారేమో లేదా మనం పాటించాలనుకొని మట్టలాదివారానికి 40రోజులముందు శ్రమలదినాలు (లెంటు) ప్రారంభించారు. మట్టలాదివారానికి సరిగ్గా 40 రోజుల ముందు లేదా ఈస్టరుకు 46 రోజుల ముందు బుధవారం వస్తుంది గనుక ఆ రోజు బూడిద పూసుకుని శ్రమలను ఆచరించాలి అనుకొని బూడిద బుధవారం లేదా భస్మబుధవారం అని నామరణం చేశారు. మట్టలా దివారం నుండి ఆరు (6) రోజులకే పస్కాపండుగ అనగా సిలువ వేయబడిన దినం అనగా వీరి లెక్క ప్రకారం శుక్రవారం గనుక దానిని శుభశుక్రవారం లేదా మంచి శుక్రవారం అని నిర్ణయించారు. ఆ తర్వాత మూడవరోజు ఆదివారం లేచాడు గనుక ఈస్టర్ పండుగను ఆదివారంనాడే నిర్ణయించినారని అర్ధమగుచున్నది. అందుకే భస్మబుధవారం, శుభశుక్రవారం, పునరుత్థానం తేదీలు మారినా దినములు మారవు.

మరోసారి ఈ దినాల నిర్ణయం గూర్చి తెలుసుకొందాం. ప్రతి సం॥ము 2రోజులు సమరాత్రిందినాలు వస్తాయి. భూమి సూర్యుని చుట్టూ తిరిగేటపుడు సంక్రాంతి తర్వాత సూర్యుడు ఉత్తరాయణం ప్రవేశించినపుడు మార్చినెల 21తేదీనాడు - పగలు రాత్రి సరిసమానంగా ఉంటుంది. ఆ తర్వాత 6 నెలలకు మరో సమరాత్రి దినము సంభవిస్తుంది (సెప్టెంబర్ 21,22) అనగా దక్షిణయాణంలో సూర్యుడు ప్రవేశిస్తాడు. యూదుల కాలమాన ప్రకారం నీసాను నెల (మొదటినెల) మన తెలుగు పంచాంగ క్యాలెండరు ప్రకారం చైత్రమాసము. ఇంగ్లీషు / గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి - ఏప్రిల్ నెలలో వస్తుంది. నీసాను నెల 14వ దినము పస్కా బలి పండుగ ఆ తర్వాత పునరుత్థానం జరిగింది గనుక ఈ నాటికి యూదులు నిర్ణయించే దినాలు ఎలా వస్తాయంటే మార్చినెల 21 తర్వాత వచ్చే మొదటి పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి ఆదివారమే ఈస్టర్, దానికి ముందు శుక్రవారం - గుడ్ ఫ్రైడే, దానికి ముందు వచ్చే ఆదివారం మట్టలాదివారం. అంతకు 40 రోజులకు ముందు వచ్చే బుధవారమే భస్మబుధవారం. ఇవన్నీ సాతాను తెలివిగా మన పెద్దలచేత భక్తి ముసుగులో ప్రవేశపెట్టిన ఆచారాలు మాత్రమే. అందుకే పౌలు గలతీయులకు వ్రాస్తూ మీరు దినములను, మాసములను, సంవత్సరాలను లెక్క పెట్టకూడదు అని అన్నాడు (గలతీ. 4:8-11). యూదులు కొలిచేకాలమానం అమావాస్య - పౌర్ణమిలమీద ఆధార పడిందని మరచిపోకండి.

ఈ దినాలు ఎప్పుడు వస్తాయో మీకు తెలియడానికి నావద్ద 5సం॥ల సమాచారం ఉన్నది దానిని మీకు తెలియజేస్తున్నాను. తెలుసుకొని ఆనందించి, జాగ్రత్త (అలర్ట్) పడండి. ఈ సం॥ 2011లో గుడ్‌ఫ్రైడే ఏప్రిల్ 22నాడు వచ్చింది. భస్మబుధవారం మార్చి 9నాడు వచ్చింది. ఈస్టర్ ఏప్రిల్ 24నాడు వచ్చింది. మరో 4 సం॥ రాబోయే తేదీలు చెబుతాను చూడండి.

| సం॥ | భస్మబుధవారం | మట్టలాదివారం | గుడ్‌ఫ్రైడే | ఈస్టర్ |
|---|---|---|---|---|
| 2011 | మార్చి 9 | ఏప్రిల్ 17 | ఏప్రిల్ 22 | ఏప్రిల్24 |
| 2012 | ఫిబ్రవరి 22 | ఏప్రిల్ 1 | ఏప్రిల్ 6 | ఏప్రిల్ 8 |
| 2013 | ఫిబ్రవరి 13 | మార్చి 24 | మార్చి 29 | మార్చి 31 |
| 2014 | మార్చి 5 | ఏప్రిల్ 13 | ఏప్రిల్ 18 | ఏప్రిల్ 20 |
| 2015 | ఫిబ్రవరి 18 | మార్చి 29 | ఏప్రిల్ 3 | ఏప్రిల్ 5 |

ఇలా మనుషులు కల్పించిన పద్ధతులను దైవోపదేశములని వ్యర్థముగా దేవుని ఆరాధింపక, దేవున్ని ఆత్మతోను (పరిశుద్ధాత్మ) సత్యముతోను (వాక్యముతో) అనగా ఆత్మచేత వ్రాయించిన వాక్యములో ఉన్నట్లు ఆరాధించుదాం. జీవ కిరీటాన్ని, నిత్యజీవాన్ని పొందుదాం.



# 1. దేవుని (యెహోవా) దినం

## గుడ్ ఫ్రైడే

సకల చరాచర ప్రకృతిని, అందులోని జీవరాశిని సృష్టించిన సర్వేశ్వరుడైన దేవునికి, సబ్‌కామాలిక్ ఏక్‌గాను, ఊపర్ వాలాగాను, అందరికి తండ్రియైన దేవుడు గాను పిలువబడుతున్న దేవునికి తన స్వరూపంలో, తనలాంటి స్వతంత్రుడైన జీవున్ని అనగా మనుషులనుగా సృష్టించినా, వారు భూమి మీద తన లాగా బ్రతకలేక పాపంలో మునిగి భ్రష్టులైనపుడు తన కుమారుడైన క్రీస్తు యేసు ద్వారా రక్షించి తిరిగి తన స్వరూపంలోనికి మార్చుకొని తన కుమారుడు చూపిన మార్గంలోనే తన యొద్దకు రావాలని ఈ జగత్తు పునాది వేయకముందే నిర్ణయించుకొన్నాడని సిలువ వేయబడిన క్రీస్తు బోధను ప్రకటించిన అపొస్తలుడైన పౌలు ద్వారా సర్వలోకానికి తెలియజేసాడు. (ఎఫెసీ 1:3-12).

మొదట తాను ఏర్పాటు చేసుకొన్న ప్రజలైన ఇశ్రాయేలు జనాంగానికి తన ప్రవక్తల ద్వారా ఈ విషయాన్ని మర్మయుక్తంగా వారికి అర్థం అయ్యే రీతిలోనే తెలియజేసి లేఖనాలలో ఈ విషయాన్ని వ్రాయించి భద్రపరచడం జరిగింది. పాపం చేసినవాడు దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలంటే రక్తప్రోక్షణ గావించాలని తన ధర్మశాస్త్రంలో తెలియజేసాడు. ఇశ్రాయేలీయులు దేవుడు మాకు మాత్రమే దేవుడు, మేమే దేవుని పిల్లలం అందరికంటే శ్రేష్టులం అనే గర్వంతో దేవుని చిత్తాన్ని మరచి పాపం మరింతగా చేస్తూ, బలులను (రక్తప్రోక్షణను) ఎక్కువ చేశారే గాని పాపం మానలేదు. అయితే తండ్రి అయిన దేవుడు తన కుమారుడు, విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము కిచ్చిన వాగ్ధానమును బట్టి ఐగుప్తులో బానిస బ్రతుకు వెళ్ళదీస్తున్న వారిని విడిపించి,శ్రేష్టమైన దేశానికి నడిపించిన రోజును

జ్ఞాపకం చేసుకోవడానికి ''పస్కాపండుగ''ను ఆచరించమని ఆజ్ఞాపించాడు. తరువాత దినమునుండే పులియని రొట్టెల పండుగను చేయమన్నాడు. (నిర్గమ 12వ అధ్యాయం మరియు లేవి. 23,24 అధ్యాయాలు.

నాటి ఇశ్రాయేలీయుల పండుగలే మరో రూపాన్ని సంతరించుకొని గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలుగా నేటి క్రైస్తవులు ఆచరిస్తున్నారు. కాని గుడ్‌ఫ్రైడే నాడే క్రీస్తు చనిపోయాడని బైబిల్ గ్రంథంలో వ్రాయబడలేదు. ఎందుకంటే అప్పటికి శుక్రవారం అనే పేరులేదు. నాటి ఇశ్రాయేలీయులు నామకార్థంగా పస్కాను ఆచరిస్తు దేవునికి దూరమవుతున్నప్పుడు దేవుడు తన చిత్తాన్ని లేదా సంకల్పాన్ని అనగా పస్కా బలి పశువుగా సర్వమానవాళి పాప పరిహారం కోసం క్రీస్తును బలిగా అర్పించబోయే దినాన్ని గూర్చి ఆనాటి ప్రజలకు హెచ్చరించడం మొదలుపెట్టాడు. యూదుల క్యాలెండర్ (పంచాంగం) ప్రకారం వారికి నెల పొడుపు నుండి అమావస్య వరకు ఒక నెల. వారి దినం సాయంత్రం అనగా సూర్యాస్తమయంతో ప్రారంభమై సూర్యాస్తమయంతో ముగుస్తుంది. వారికి వారానికి ఏడురోజులు ఉన్నాయి కాని ఆనాడు ఆ దినాలకు పేర్లు లేవు అనగా ఆది, సోమ......... శుక్ర, శని వారాలు వాళ్ళకు లేవు, 11వ శతాబ్ధంలోనే వారాలకు, నెలలకు ఈనాటి పేర్లు వచ్చాయి. అయితే వారి నెలలకు పేర్లున్నాయి. మొదటి నెల పేరు "నీసాను" ఇది మన తెలుగు క్యాలెండర్ ప్రకారం చైత్రమాసంగా ఉంటుంది. ఇంగ్లీషు క్యాలెండరు ప్రకారం మార్చి - ఏప్రిల్ మధ్యలో వస్తుంది. బైబిల్ ప్రకారం వారి మొదటి నెల మొదటి దినం మన తెలుగు పంచాంగం ప్రకారం ఉగాది అనగా చైత్ర శుద్ధ పాడ్యమి అని గుర్తించుకోండి చాలు.

ఈ పస్కాపండుగను ఆచరించే విధానం నిర్గమకాండం 12వ అధ్యాయంలో పూర్తిగా వివరించాడు. ఒక వేళ దానిని జరిగించకపోతే వారి తొలిచూలు పిల్లలను చంపేస్తాను అన్నాడు. చీకటి నుండి అనగా పాపము నుండి పాలు తేనెలు ప్రవహించే దేశంలోనికి

ప్రవేశించడానికి గుర్తును అనగా ఆ ఆనందానికి గుర్తుగా ఈ పండుగను చేసుకొమ్మన్నాడు. మొదటి నెల దశమినాడు నిర్దోషమైన మేక లేదా గొఱ్ఱెపిల్లను తెచ్చి 14వ దినమున దానిని బలిచ్చి ఏది మిగలకుండా అందరూ తినాలి. సాయంత్రంలోగా దాని ఆనవాలు కూడా మిగలకూడదని ఆజ్ఞాపించాడు. అలా వారు దానిని ఆచారం చేస్తున్నప్పుడు దేవుడు వారికిచ్చిన కాలం ముగిసింది, వారి అంతం దగ్గరపడింది. వారి పాపం పండింది గనుక ఇశ్రాయేలును నాశనం చేసి, భక్తిగల వారిని రక్షించి, మిగతా లోకంలో ఉన్న తన పిల్లలందరిని కాపాడవలసిన తన అనాది సంకల్పాన్ని తెలియజేస్తూ వారి అంతాన్ని, లోకానికి ఆనంద దినాన్ని లేదా రక్షణ దినాన్ని ప్రకటించుచూ, అదే తను ఏర్పాటు చేసిన దినంగా చెబుతూ వచ్చాడు.

క్రీస్తుకు మూలపురుషుడు, దేవునికిష్టుడైన దావీదు మహారాజు ద్వారా ఆదినాన్ని ఎలా జరుపుకోవాలో ప్రవచించాడు. ''ఇల్లు కట్టువారు నిషేదించిన రాయి మూలకు తలరాయి ఆయెను. అది యెహోవా వలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము దీనియందు మనము ఉత్సాహించి సంతోషించెదము'' (కీర్తన 118:22-24). ఈ దినాన్ని ఇశ్రాయేలీయులతో పాటు దేవునికిష్టులైన పిల్లలందరు ఉత్సహించి సంతోషించాలి అని దావీదు వ్రాస్తూ, ఆయన కూడా సంతోషించినట్లు కనబడుతుంది. అయితే ఈ దినమును గూర్చి నాటి ప్రజలు గ్రహించలేదు నేటి ప్రజలు గ్రహించక ఏడుస్తూ, రోదిస్తూ, ఉపవాసాలు చేస్తూ అన్యాయమైపోతున్నారు. మరికొందరు భ్రష్టులైతే వారి పెళ్ళి దినమే ఇది అనుకొని, పెళ్ళికార్డుల మీద ఈ వచనాన్ని వ్రాసుకొని, ప్రసంగించి, ఆరోజు (పెళ్ళిరోజు) ఆనందించి నిత్యాగ్ని దండన పాలైపోతున్నారు.

యెహోవా ఏర్పాటు చేసిన ఆ దినము సర్వమానవాళి ఎలా ఉంటుందో ఆ తర్వాత వచ్చిన ప్రవక్తయైన యెషయా చెబుతున్నాడు చదవండి ''యెహోవా దినం వచ్చుచున్నది.... ఆకాశ నక్షత్రములును,

నక్షత్రరాసులును వెలుగు ప్రకాశింపనియ్యవు. ఉదయకాలమున సూర్యుని చీకటి కమ్మును, చంద్రుడు ప్రకాశింపడు..." (యెషయా 13:9-11). ఈ యెషయానే క్రీస్తు యొక్క జన్మదినం లేదా ఆయన మొదటి రాకడను గూర్చి ప్రకటించినాడు అని మరువవద్దు. దేవుడు ఇశ్రాయేలీయులను శిక్షించేరోజు, మిగతా అన్యులను అనగా అప్పటికి దేవుడు ఎవరో తెలియని మనలందరిని రక్షించే రోజున ఏమి జరుగబోతుందో చెప్పాడు. దీనినే యోవేలు ప్రవక్త ప్రవచించాడు. "యెహోవా దినము వచ్చుచున్నది... ఆదినము అంధకారమయముగా ఉండును, మేఘములు, గాఢాంధకారమును ఆ దినమున కమ్మును...." (యోవేలు 2:1-2). ఆ తర్వాత ఆమోసు ప్రవక్త మరింత విశదంగా ఈ దినమును గూర్చి చెప్పాడు "...ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా... ఆ దినమున నేను మధ్యాహ్న కాలమందు సూర్యుని అస్తమింపజేసెదను. పగటి వేళ భూమికి చీకటి కమ్మును...." (ఆమోసు 8:1-11). ఆ తర్వాత జెఫన్యా,జెకర్యా ఇంకా అనేకమంది ఈ దినమును గూర్చి ప్రవచించారు. (జెఫన్యా 1,2, జెకర్యా 12,13,14 అధ్యాయములు).

ఆనాటి ప్రజలు, ఈనాటి ప్రజల యొక్క పాపాలు కోడెలు, మేకలు, గొఱ్ఱెలు మొ॥ వాటితో పోవడం లేదు గనుకనే తనే ఏర్పాటు చేసిన నిర్దోషమైన, పవిత్రమైన, పాపములేని, పరిశుద్ధుడైన తన కుమారుని రక్తప్రోక్షణ ద్వారానే సౌఖ్యమని ముందే ఎరిగి నిర్ణయించిన దేవుడు ఆ దినాన్ని వెంటనే ఏర్పాటు చేసి దానిని గూర్చిముందే ప్రకటించి వ్రాయించాడు గనుక నెరవేర్పుకు సిద్ధమయ్యాడు. లేఖనముల యందున్న దేవుని సంకల్పాన్ని ఎరుగకయే ఆ దినాన దేవుని నిర్ణయాన్ని జరిగించినారు నాటి యూదులు, యూదా మతాధికారులు ఇంతకు ఇది ఏ దినమున నెరవేరిందో ఒకసారి వాక్యాన్ని చూద్దాం.

'మధ్యాహ్నం మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతయు చీకటి కమ్మెను... యేసు మరలా బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను అప్పుడు దేవాలయపు తెరపైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను, భూమి వణికెను, బండలు బద్ధలాయెను. సమాధులు తెరువబడెను..." (మత్తయి 27:45-55) ప్రవక్తలందరు ప్రవచించిన యెహోవా ఏర్పాటు చేసిన దినం క్రీస్తు సిలువలో మరణించిన దినమని దీనిని బట్టి ఇట్టే గ్రహించగలము. యేసు మరణించి తిరిగి లేచాక లేఖనములన్నీ నెరవేరినవని చెప్పాడు (లూకా 24:44-48) ఆ తర్వాత అపొస్తలులు ప్రకటించారు. (అపో.కా. 3:13-26, 13:26-43). యేసు ప్రభువు కూడా ఆనాటి స్త్రీలు యేసు పిలువను మోయుచున్నప్పుడు ఏడుస్తుంటే కూడా నాగురించి ఏడవవద్దు, నేను వ్రాయబడిన ప్రకారము పోవుచున్నాను. మీ పిల్లలకోసం, వారు పొందబోయే శ్రమలకోసం ఏడవండి అన్నాడు. అనగా యేసు మరణం గూర్చి గాని, మరణదినం గూర్చి గాని ఎవ్వరూ ఏడవక, సంతోషించి గంతులు వేయకున్నా కనీసం దావీదు ప్రవచనాన్ని గూర్చి లోతుగా ఆలోచిస్తే అది అక్షరసత్యం అని బోధపడుతుంది.

ఎందుకంటే రేపే నాకు మరణ దండన అని తెలిస్తే ప్రతివారు ఎంత కుమిలి కుమిలి ఏడుస్తారో అందరికి తెలిసిన పచ్చి నిజం. అయితే నీవు! నేను పొందబోయే ఆ మరణ దండనను మరొకరు స్వీకరించి, నిన్ను / నన్ను విడుదల చేస్తే, విడిపింపబడినవారు ఎంత ఆనందించి పండుగ జేసుకుంటారో వేరే చెప్పనక్కరలేదు. కాబట్టే యేసు క్రీస్తు మరణ దినం వలన ప్రపంచ మానవాళికి ఎంతో మేలు జరిగింది. దీనినే సొలోమోను మహారాజు చెప్పాడు "ఒకని జన్మదినం కన్నా, ఒకని మరణదినమే మేలు" (ప్రసంగి 7:1) అయితే ఇది అర్థం కాని నామకార్థ క్రైస్తవులు యేసు జన్మదినమని పెట్టుకొన్న రోజు హ్యాపి క్రిస్మస్ అంటూ గ్రీటింగ్స్ చెప్పుకొని, బహుమానాలు ఇచ్చుకొని గొప్ప పండుగ చేసుకొని వాక్యానికి విరుద్ధంగా ప్రవర్తించి నరకాగ్నికి

చేరువవుతున్నారు. నిజానికి క్రైస్తవులంతా యేసు మరణాన్ని గుర్తు చేసుకుంటూ హ్యాపీ గుడ్‌డే అని గ్రీటింగ్స్ చెప్పి, బహుమానాలిచ్చుకొని, పండుగ జేసుకోవాలి. (యోహాను 18:14). కాని నేడు దీనికి పూర్తిగా వ్యతిరేకంగా మానవులు కల్పించిన పద్ధతులే దైవోపదేశములని భక్తి పేరుమీద కన్నీళ్ళతో గుడ్డిగా దేవున్ని ఆరాధించి ఆయన కోపానికి గురి అవుతున్నారు. (మార్కు 7:6-9, అపొ.కా. 28:26,27).

ఆనాటి పస్కాపండుగ దినం ఇశ్రాయేలీయులకు శుభదినం దానికి సాదృశ్యమైన క్రీస్తు మరణదినం గూడా నేటి ప్రపంచ ప్రజలందరికీ శుభదినమే. ఎవరు నిర్ణయించి పేరుపెట్టారో గాని గుడ్ ఫ్రైడే అని బాగా పెట్టారు. కాని దానియందు ఆనందించక, ఉపవాసాలు, ఏడ్పులు, పెడబొబ్బలుతో ఆ శుభదినాన్ని, దుర్దినంగా మార్చుతూ, క్రీస్తును మరలా సిలువ వేస్తున్నారు. 40రోజులు మాత్రమే శ్రమలని బైబిల్‌లో ఎక్కడా లేదు. వాటిని ఆ మరణ దినానికి ముందు లెంట్ అని పెట్టి శుభకార్యాలన్నిటినీ చేయడం లేదు. ఇది అన్యాయం, అక్రమం. దీని గురించి కొందరు యేసుప్రభువు 40 రోజులు ఉపవాసముండి శ్రమపడ్డాడు గనుక మేం పాటిస్తున్నాం అంటున్నారు. ఇంతకు యేసు ఎప్పుడు శ్రమపడి 40రోజులు ఉపవాసమున్నాడో తెలుసా? తను దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి, బాప్తీస్మము తీసుకొని సువార్త ప్రకటించడానికి ఆయత్తపడటానికి ముందే (ట్రైనింగ్) ఆయన శ్రమపడ్డాడు. సిలువలో చివరి రక్తపు బొట్టు కార్చుతూ కూడా తన్ను హింసించిన వారిని దీవించి, క్షమించి, వారి కొరకు విజ్ఞాపన చేయడానికి దేవుడిచ్చిన తర్ఫీదు అది.

నిజంగా క్రైస్తవులు ప్రతి సం॥ క్రీస్తును చంపక, అన్యులవలె ప్రతి సం॥ 40రోజులు ఆచార ఉపవాసం చేయక, పోయే ఇరుకు మార్గములో ప్రయాణించడానికి, బాప్తీస్మం తీసుకొన్న వెంటనే మరియు సువార్తకు సమర్పించుకొన్న వెంటనే యేసు చేసినట్లు ఏమియు తినక ఘోరమైన, కటిక ఉపవాసం చేసి తమ శరీరాన్ని, దాని కోర్కెలను జయించాలి (లూకా 4:1-13). యేసు మరణము

వలన ప్రపంచానికి మేలు జరిగింది గనుక, ఆ దినము ఆనందించాలి. సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిన పౌలు ఫిలిప్పీలోని సంఘంలో ఇలాంటి వాక్య వ్యతిరేక పనులు, భూసంబంధమైన పనులు చేసి క్రీస్తును మరలా సిలువ వేస్తుంటే వారి గూర్చి బాధపడి, వారిని ప్రభువును ఆనందించుడి, మలా చెప్పుదును ప్రతి దినము, ప్రతిక్షణము క్రీస్తులో ఆనందించమన్నాడు (ఫిలిప్పీ 4:4-6).

ఇంతకీ క్రీస్తు మరణించింది శుక్రవారమా? కాదా! అని అనేకుల సందేహం. క్రీస్తు మరణం ఈనాటి క్యాలెండరు ప్రకారం శుక్రవారం కాదు అని బైబిల్‌లోని లేఖనాలను జాగ్రత్తగా చదివినవారు మాత్రమే గ్రహించగలరు. కొందరు నవీన యూదులు (యాషువా, యావె సమాజం వారి మూడు రాత్రింబగళ్ళు అనగా 72 గంటలు ప్రకారం బుధవారం కూడా కాదు) అలాగే మహాజ్ఞానులనే అజ్ఞానులు, చెప్పిన అర్ధరాత్రి జి.యం.టి. లెక్కలు కాదు. క్రీస్తు చనిపోయింది ఇశ్రాయేలీయుల కాలమానం ప్రకారం పస్కాపండుగ, పులియని రొట్టెల పండుగ దినాలు గనుక సీసాను నెల 14వ దినం చనిపోయాడు, మరుసటి విశ్రాంతి దినము వారంతంలో (సబ్బాతు) వచ్చే విశ్రాంతి దినము కాదు. పస్కా మరునాడే పులియని రొట్టెల పండుగ మొదటి దినం గనుక అది మహాదినం (యోహాను 19:31). ఆ తర్వాత మామూలుగా ఏడవదినమైన విశ్రాంతి దినము వచ్చును (ఇది 16వ దినము). ఇది కూడా విశ్రాంతి దినమేకాని నీసాను నెల 15వ దినము (లేవి. 23:4-8, మత్తయి 27:62-66) తెల్లవారితే వారములో మళ్లీ మొదటి దినము వస్తుంది (ఇది 17వ దినము).

ఆ 17వ దినము రాత్రే అనగా తెల్లవారకముందే క్రీస్తు లేచాడు గనుక ఈ లెక్కన మనం లెక్క చూసుకొంటె, ఆనాటి యూదుల కాలమాన ప్రకారంగానే క్రీస్తు 3 రాత్రింబగళ్ళు సమాధిలో ఉన్నాడు (మత్తయి 12:39,40). మూడవ దినము లేదా మూడు దినములైన తర్వాత లేచాడు. అదే ఈస్టర్ పండుగరోజు. వారంలో మొదటి రోజుకు ఇప్పటి క్యాలెండర్ ప్రకారం ఆదివారం అనుపేరు పెట్టారు

గనుక ఈస్టర్ ఎప్పుడు ఆదివారం నాడే రావాలి గనుక దానిని ఫిక్స్ చేసుకొన్నారు. కాని శుక్రవారం సాయంత్రం సమాధిలో పెట్టి, ఆదివారం తెల్లారకమునుపే యూదుల కాలమానం ప్రకారం 3 రాత్రింబగళ్ళు (పూర్తి రాత్రింబగళ్ళు అని బైబిల్‌లో లేదు) రావు అనే విషయాన్ని సాతాను మాయలో పడి మరచిపోయారని తెలుస్తుంది.

ప్రతి సంవత్సరము ఈస్టర్‌ను ఎలా నిర్ణయిస్తారంటే యూదుల లెక్కప్రకారం వారి మొదటి నెల మొదటిరోజు మన తెలుగు క్యాలెండరు ప్రకారం ఉగాది, నెల మొదటి రోజు, తర్వాత 14వరోజు మరణదినం, ఆ తర్వాత 17వ దినం లేవాలి ఈస్టర్ రావాలి అయితే ఈస్టర్ ఆదివారమే రావాలని రూలు పెట్టుకున్నారు గనుక ప్రతి సంవత్సరం మార్చి నెల 21 (సమ రాత్రి దినం - Vorn of Equinox - ఉత్తరాయణం) తర్వాత వచ్చే మొదటి పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి ఆదివారమే ఈస్టర్‌గా నిర్ణయిస్తారు. అంతకు ముందు వచ్చే శుక్రవారమునే శుభ శుక్రవారమని నిర్ణయించారు గాని క్రీస్తు నిజంగా వాక్యానుసారంగాను (1పేతురు 1:8-11) నేటి క్యాలెండరు ప్రకారంగా చూస్తే గురువారం చనిపోయాడు అని చెప్పవచ్చు. ఈ దినాలు, ఉత్సవకాలాలు, నెలలు, సం॥లు క్రైస్తవులు చేయకూడదని హెచ్చరించాడు పౌలు (గలతీ. 4:8-11, కొలస్సి 2:16,17). అంతకు ముందే క్రీస్తు మరణ దినాన్ని కాదు, మరణాన్ని ప్రచురించమన్నాడు (1కొరింథీ 11:26). ఈ విధంగానైనా అనగా పండుగ పేరుతోనైనా క్రీస్తును ప్రకటిస్తున్నామనే అజ్ఞానులకు పరిశుద్ధాత్ముడు ప్రతి దినం, ప్రతిక్షణం సువార్తను ప్రకటించమన్నాడు (2తిమోతి 4:1-8) సువార్త అనగా క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములు (1కొరింథీ 15:1-3) దీనిని క్రైస్తవులైన వారందరు ఎల్లప్పుడు ప్రకటించాలి. సంవత్సరంలో ఒకరోజు, దానికి ముందు 40 రోజులు మాత్రమే ఏడుస్తూ ప్రకటించడం వాక్య విరుద్ధం. మరణకరమైన పాపం. కాబట్టి ప్రియులారా మీకందరికి హ్యాపీ గుడ్ (డే) ఫ్రైడే. దేవుడు మనల్ని దీవించి, తన వాక్యపు వెలుగులో నడిపించును గాక ఆమేన్.

# 1. తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము.

సర్వోన్నతుడు, సర్వశక్తిమంతుడు అందరికి తండ్రియైన దేవునికి మానవులందరికి ప్రభువైన క్రీస్తు ద్వారా స్తోత్రములు. క్రీస్తు యేసు స్వరక్తములో కడుగబడిన సంఘములోని సభ్యులందరికి శుభ శుక్రవారపు శుభాభి వందనములు. ప్రభువైన దేవుని అత్యున్నతమైన సంకల్పము చొప్పున ఒకరి తర్వాత ఒకరుగా భూమి మీదకు ప్రయాణించి మన అపరాధములచేత చనిపోయిన వారమై ఉండగా పరిశుద్ధుడైన క్రీస్తు సిలువయాగముతో మనల్ని అందరిని విమోచించిన మహాగొప్ప దినమే యెహోవా ఏర్పాటు చేసిన దినమే శుభ శుక్రవారముగా పిలువబడుతున్న ఈ ప్రత్యేక దినము. నాటి ఇశ్రాయేలీయులు ఆచరించిన పస్కాపండుగనే ఈ శుభ దినము. మానవులందరికి మేలు కలిగిన ఈ శుభ దినమును ఎవరు శోక దినము / దినాలుగా మార్చారో తెలియదు గాని, ఆరోజున క్రీస్తు సిలువలో పలికాడని చెప్పిన 7 మాటల వెనుక అద్భుతమైన సందేశం మాత్రము దాగియున్నది. తమకు తెలియని దానిని ఆరాధిస్తున్న నేటి సంఘాలు ఇక నుండి తెలిసిన దానిని ఆరాధించేటట్టుగా చేయడమే ఈ 7 మాటల ధ్యానము. దేవుని ఆత్మతో వాక్యాన్ని సరిచూసుకొని ముందుకు సాగుదాం. ఇందులోని పరమార్థాన్ని గ్రహించి దాని ప్రకారం ప్రవర్తించి పరమపురికి చేరుదాం.

**"యేసు! తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా 23:34).**

ఎదుటి మనుషులు ఏమి ఆలోచిస్తున్నారో చెప్పగలిగిన క్రీస్తు, హృదయము నిండిన దానిని బట్టి నోరు మాట్లాడుతుందని చెప్పిన గొప్ప మానసిక నిపుణుడు **(మత్తయి 12:34, 5:27,28)** ఆయనను తిట్టి, గుద్ది, ముఖము మీద ఉమ్మివేసినా గూడా వీరేమి చేయుచున్నారో వీరెరుగరు అని అంటున్నాడేమిటి అని

ఆలోచించాలి. వారు వారికి తెలిసిన లోక జ్ఞానముతో చేస్తున్నారే గాని, యేసును సిలువ వేసన్తూ దేవుని సంకల్పాన్ని నెరవేర్చుచున్నామన్న సంగతిని ఎరుగుట లేదు. అలా ఎరిగియుంటే మహిమా స్వరూపియైన ప్రభువు సిలువ వేసి యుండక పోదురని పరిశుద్ధాత్మ సాక్షమిచ్చాడు **(1కొరింథీ 2:8)** లోక జ్ఞానంతో ఆలోచిస్తే వారు తెలిసే, చంపాలనే చంపుచున్నారు. తెలిసి చేసినా క్షమించేవాడు ప్రభువు. అయితే మనిషిగా ఉన్న యేసు మనుష్య జ్ఞానంతో ఆలోచించకుండా దేవుని ఆత్మ జ్ఞానంతో ఆలోచించి సత్యమునే అనగా వారేమి చేయుచున్నారో వారెరుగరు అని అన్నాడు. ఇది అక్షరాల నిజమే ఆయన మాటల్లో ఎప్పుడూ, ఎక్కడా అబద్ధమాడలేదు.

అదే మనము అయితే మనల్ని తిట్టిన వారిని వెంటనే తిడుతాం. ఎందుకంటే వారు తెలిసే తిడుతున్నారని అనుకొని నమ్ముతుంటాం. వారు మనల్ని హింసించుచున్నపుడు మన విశ్వాసాన్ని బలపరచి, పరీక్షించి దేవుని పనిచేయుచున్నారని తెలిసినపుడు మాత్రమే వారిని క్షమించమని ప్రార్థన చేయగలం **(మత్తయి 5:3-12)**. దేవుడు మానవులతో చేసిన నిబంధనలలోని సారాంశమంతయు "నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించాలంటే **(గలతీ 5:3)** వారు మనయెడల చేసిన అపరాధములన్నింటిని క్షమించగలగాలి. అప్పుడే మనం వారిని క్షమించమని దేవునికి విజ్ఞాపన చేయగలము. మొదటి మానవుని నుండి నేటి ఆధునిక మానవులందరి వరకు (యేసుక్రీస్తు తప్ప) అందరూ పాపము చేసి ఆయన అనుగ్రహించు మహిమను పొందలేక పోతారని తెలిసిన దేవుడు మనము ఒకరినొకరు క్షమించుకోవడం అలవాటు చేసుకోవాలనే ఆయన మన పాపములను క్షమించుచున్నాడు.

"నేను మీతో చెప్పునదేమనగా, మీ పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై ఉండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి.

మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి. ఆయన చెడ్డ వారి మీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను అనీతిమంతుల మీద వర్షము కురిపించుచున్నాడు'' **(మత్తయి 5:43-48, రోమా 12:9-21)** ''మనుష్యుల అపరాధములను మీరు క్షమించినయెడల మీ పరలోకపు తండ్రి మీ అపరాధములను క్షమించును'' **(మత్తయి 6:14,15)** క్షమాగుణమును అలవర్చుకొనుడని యేసు తన శిష్యులు కాగోరు వారందరికి బోధించాడు. ఇలా చేసినపుడే మనిషి మానవత్వంలో నుండి దేవత్వములోనికి మారగలడు. ఇదే దేవుని చిత్తము. ఆయన అనాది సంకల్పము. ఎప్పుడైతే దేవుని తత్వము లేక తన స్వరూపము ఏర్పడుతుందో అనగా ప్రేమ అలవాటవుతుందో అపుడే మనం వారిని క్షమించగలము. ప్రేమంటే క్రీస్తు సంఘాన్ని ఎలా ప్రేమిస్తున్నాడో, **(ఎఫెసి 5:25-32)** దేవుడు మనల్ని ఎంతగా ప్రేమించి మనం పరలోకానికి చేరడానికి తన ప్రియ కుమారుని బలిగా ఇచ్చాడో **(యోహాను 3:16)** జ్ఞాపకం చేసుకొంటే మనం ప్రేమ, క్షమాపణ గుణం అలవర్చుకొని మనవారు మనయెడల తెలిసి, తెలియక చేసిన ఏ అపరాధమునైనా క్షమించి వారి పరలోక వ్యాప్తి కొరకు విజ్ఞాపనలు, ప్రార్థన చేయగలము. ఇది ప్రతి క్రీస్తు శిష్యునకు, శిష్యురాండ్రకు అలవాటు కావాలన్నదే ఈ మొదటి మాటలోని భావం.

యేసుక్రీస్తు భూలోకమందు ప్రవేశించునపుడే ''బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి, పూర్ణ హోమములును పాప పరిహారార్థ బలులును, నీకిష్టమైనవి కావు. అపుడు నేను గ్రంథపు చుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారము, దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నాను'' **(హెబ్రీ 10:5-10)** అని అన్నాడు గదా! అలాగే మనము కూడా దేవుని చిత్తాన్ని నెరవేర్చుటకే భూమి మీదకొచ్చామని మనకోసం కూడా సత్క్రియలు అనగా వాక్య సంబంధమైన పనులు ముందుగానే వ్రాయించి పెట్టాడు **(ఎఫెసి 2:6-10)**. దేవుని

చిత్తమేమనగా ''మనము క్రీస్తు యేసు ద్వారా పరిశుద్ధులము నిర్దోషులమై ఆయనకు పిల్లలుగా స్వీకరింపబడాలనేదే'' **(ఎఫెసి 1:3-12)** అనగా యేసు ఎలా బ్రతికాడో, ఏఏమాటలు పలికి, తను వాటి ప్రకారం ప్రవర్తించి **(హెబ్రీ 5:7-10)** కుమారుడిగా అంగీకరింపబడ్డాడో మనము అలాగే దేవుని చిత్తాన్ని నెరవేర్చాలనేది క్రీస్తు సిలువలో చూపిన మార్గము, పలికిన మాటల పరమార్ధమైయున్నది.

క్రైస్తవుడిగా మన జీవితము ప్రారంభములోనే మనము ప్రేమ, క్షమాగుణం, ఇతరుల గూర్చి విజ్ఞాపన చేయడం అలవర్చుకోవాలనేది దేవుని ఉద్దేశ్యము. క్రీస్తు అది చేశాడు, చివరి క్షణంలో కూడా పలికిన మొదటి మాటలోనే ఆయన చేసి చూపాడు. అందుకే మనల్ని కూడా **"ప్రభువా నీవు మాకోసం బలి అయ్యావా?"** అని మరీ ఏడుస్తూ పలకకుండా ఆయన చెప్పిన మాటల ప్రకారం చేయమన్నాడు **(లూకా 6:46-49, మత్తయి 7:21-27)**. అయితే ఈ మాటలు ఎప్పుడు పలకాలి, ఎప్పుడు ప్రవర్తించాలి అని మనకు అనుమానం రావచ్చు. యేసు జీవితంలో పలికి, సిలువలో మరణిస్తూ కూడా ఈ మాటల ప్రకారం ప్రవర్తించాడు. ఆయన నిజంగా చనిపోయాడు. కాని మనం మరలా లేదా అందరి కోసము సిలువలో చావమని లేదుగా, చావము కూడా. మరి ఎలా? దానికి ముందే సమాధానం చెప్పి వెళ్ళాడు. ''యేసు అందరితో ఇట్లనెను - ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను **(లూకా 9:23,24)**. ఆయన కూడా మనకు కనబడని, ఆయనకే తెలిసిన సిలువను రోజు నడిచి, చివరిరోజు మాత్రమే కనబడే మానును మోసుకొని వెళ్ళి దానిపై తన ప్రాణం పెడుతూ ఈ మాటను పలికాడు. **మనకు కనబడే సిలువ మానుపై చనిపోయే అవకాశం లేదు.** ఎందుకంటే అందరికి విమోచన క్రయధనము మనకోసమై శాపమై ఆయన మాత్రమే సిలువ మీద చావాలనేది దేవుడు ఆయనకోసం ఏర్పాటు చేసిన సంకల్పము.

అందుకే మనల్ని మనకే తెలిసిన, అర్థమయ్యే మన సిలువను (ఇది కనబడదు, అనుభవిస్తేనే గాని అర్ధం కాదు) మాత్రమే ప్రతిరోజు మోయుమంటున్నాడు. అంటే ఈ సిలువ సూక్తులను లేదా 7మాటలను ప్రతి దినము పలుకుతూ, వాటి ప్రకారం ప్రవర్తిస్తూ యేసును వెంబడించి పరలోక మార్గంలో ప్రయాణించాలనే దేవుని ఆజ్ఞ. అంతేకాని సంవత్సరానికొకసారి మాత్రమే పలికి, పండగ జేసుకోమని కాదు. ఇది గ్రహించని అనేకులు పారంపర్యాచారముగా కేవలం పలికి, దేవుని ఆజ్ఞను కాదని క్రీస్తు సిలువకు శత్రువులుగా నడుచుకొనుచున్నారు **(ఫిలిప్పీ 3:17-21).**

దేవుని ధర్మశాస్త్రమైన లేఖనాలలోని వాటిని శరీరంతో నెరవేర్చుటయే దేవుని చిత్తము అలాగే లేఖనము నెరవేరునట్లు అని సువార్తికులు ఈ మాటకు ముందు వ్రాయకపోయినా తనను గూర్చి ప్రవక్తల గ్రంథమందు వ్రాయబడిన వాటిని నెరవేర్చుటకు కూడా ప్రభువు ఈ మాటలు పలికినట్లు చూడగలము.''... అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను, అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసిన వారిని గూర్చి విజ్ఞాపన చేసెను'' **(యెషయా 53:11,12).** ఏ నేరము చేయకపోయినా నేరస్తులతో సహా వేలాడదీయబడ్డాడు. యూదా మత పెద్దలు, యూదులు కక్షతో ఆయనను నిందించి, హింసించారు. తనతోపాటు సిలువ వేయబడుతున్న దొంగలు కూడా నిందించినా వారిని క్షమించమని తండ్రికి విజ్ఞాపన చేసాడు. యెషయా గ్రంథములోని ఈ అధ్యాయంలో యేసు పొందిన దెబ్బలు, గాయాలచేత ఆనాడు ఇశ్రాయేలీయులకు స్వస్థత దొరికితే ప్రపంచంలోని అన్యులైన మనకందరికి పాపక్షమాపణ, రక్షణ దొరికిందనే సంగతి నేడు మనం గ్రహించుటలేదు.

''పరిశుద్ధాత్ముని బోధలో ఒకనియెడల ఒకడు దయ కలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారం మీరును ఒకరి నొకరు క్షమించుడి'' **(ఎఫెసీ 4:32)** ప్రభువు

సిలువలో పలికిన ఈ మాటలో మానవుడు తన జీవితంలో మొదట చేయవలసిన విధిని, కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నాడు. క్రీస్తు యేసు ద్వారా దేవుడు సర్వమానవాళికి అందించిన పాప క్షమాపణను, విముక్తి మార్గమును మనము మన తరము వారికి అందించుట యే దేవుని చిత్తాన్ని నెరవేర్చుట. అదే క్రీస్తు చెప్పాడు, చేసాడు. మనం కూడా మన సొంత కార్యములనే గాక, ఇతరుల కార్యములను చూచుటకై క్రీస్తుకు కలిగిన మనస్సును కలిగి ఆయనను పోలి నడుచుటకే ఈ ఏడు మాటలు పలికినాడని అనిపిస్తుంది. అంతేగాని పెదవులతో మాత్రమే పలకకూడదని ప్రభువు నేర్పించుచున్నాడు. పని నేర్చుకొని ఆ పని చేయడమే నిజమైన దైవారాధన. వేశ్యనైనా క్షమిస్తాడు గాని వేషధారణను క్షమించడని గుర్తుంచుకొని, తండ్రి పని మీద లోకానికొచ్చిన యేసు తన కర్తవ్యాన్ని నెరవేర్చి, మనంకూడా తండ్రిపని చేయాలనే మన ప్రథమ కర్తవ్యాన్ని గుర్తుచేయడానికే ఈ మొదటి మాటను పలికినాడు గనుక మనము కూడా మన పొరుగు వారిని క్షమించి, ప్రేమించి వారిని గూర్చి "**తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము**" అని, మనమీద తిరుగుబాటు చేసిన వారికై విజ్ఞాపన చేయబద్ధులమైయున్నాము. ఎందుకంటే పగతీర్చుకొనుట మన పనికాదు అది దేవుని పని అని వాక్యం చెబుతుంది. (రోమా 12:9-21). దేవుని కృపా సమాధానములు మనకు తోడైయుండును గాక... ఆమెన్

## 2. నేడు నీవు నాతో కూడా 'పరదైసు'లో ఉందువు

ఈలోకం శాశ్వతం కాదని చెప్పుకుంటూనే ఈ భూమి మీద కేవలం యాత్రికులు, బాటసారులైన నేటి ప్రపంచ ప్రజలందరు తమకిష్టమొచ్చిన బాటలో లేదా తమకు నచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. కొంచెం కష్టమైనా, మేలైనది. సూటిగా వెళ్ళే దారి వదిలి చుట్టు తిరిగైనా సుఖంగా వెళ్ళాలనే లోకం నానుడిలోనే

వెళ్తున్నారు కాని దేవుడు చూపిన లేదా ఆయనకిష్టమైన మార్గంలో నడవడం లేదు. దేవుని మార్గంలోనే ఉన్నామని నమ్మి మోసపోతున్న అనేకమంది క్రైస్తవుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదని ఈ క్రింది విషయాన్ని చదివి గ్రహిస్తే సుళువుగా అర్ధమై తీరుతుంది.

క్రీస్తు యేసునందు ప్రియులైన క్రైస్తవులకు, ప్రభువైన క్రీస్తు నామంలో శుభాభివందనాలు. ప్రతి శుభశుక్రవారం మనం మాట్లాడబోయే ఏడు మాటలలో ప్రభువు సిలువలో పలికిన 2వ మాట ఎంతో ప్రాముఖ్యమైనది. సిలువలో వ్రేలాడుతున్న యేసును ఇరువైపుల సిలువ వేయబడిన దొంగలు కొంతసేపు ఇద్దరూ తిట్టారు. **(మత్తయి 27:44, మార్కు 15:32)** వారు తిట్టినా, యూదులు తిట్టినా, సైనికులు కొట్టినా ఏమీ అనకుండా ఉండి, పైగా వారిని క్షమించమన్న యేసును చూచిన ఒకవైపున ఉన్న ఒక దొంగకు జ్ఞానోదయమై మారు మనస్సుతో ప్రభువును "యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునపుడు నన్ను జ్ఞాపకము చేసుకో" అని వేడుకొన్నాడు. అప్పుడు యేసు ఈ దొంగకు నా బోధ, నా రాజ్యము, నా ఆలోచన అంతా అర్థం అయిందనే సంగతిని గ్రహించి, అతనిని క్షమించి అతనితో **"నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను."** (లూకా 23:43) అనే మాట పలికినాడని అర్థమవుచున్నది.

మొదటిమాటలో మన ప్రథమ కర్తవ్యమైన ప్రేమ, క్షమాపణ, విజ్ఞాపనలను గుర్తు చేసాడు క్రీస్తు ప్రభువు పలికిన ఈ రెండవ మాటలో చాలా గొప్ప సంగతి దాగి ఉన్నది. తన తప్పు తెలుసుకొని, మారుమనస్సు పొంది పాపక్షమాపణ అడిగిన వారికి రక్షణ ఇచ్చి, పరలోక మార్గము చూపాడు. నాటి యూదులు మొదలుకొని నేటి క్రైస్తవులలో చాలామందికి అర్థం కాని అద్భుతం ఇందులో చెప్పబడి ఉన్నది. మనం ఈ మాటను సం॥రానికి ఒకసారి గుడ్‌ఫ్రైడే రోజు మాత్రమే పలికి వెళ్ళుచున్నాం. కాని దానిలోని అర్థం గ్రహించలేకపోతున్నాం. ప్రభువు పలికిన ఈ మాటలో **'పరదైసు'**

అనే పదం ఉన్నది. **పరలోకం వేరు పరదైసువేరు.** చాలామందికి ఈ రెండింటి మధ్య వ్యత్యాసం తెలియదు. పరలోకం అనగా పైన దేవుడున్న లోకం. పరదైసు కూడా మనది కాని మరో పరాయి (పర) లోకంలో ఉన్నది. ఆ లోకం పేరు పాతాళ లోకం అక్కడ అందరూ విశ్రాంతి అనగా నెమ్మది పొందే స్థలమే పరదైసు. అయితే క్రీస్తు సిలువలో తన ప్రాణాన్ని పెట్టి తాను ఆరోజున పరలోకం వెళ్ళలేదు. **(అపో.కా. 2:27-33)** ప్రస్తుతం ఎవ్వరు కూడా చనిపోయిన వెంటనే పరలోకం వెళ్ళరు అనే నిజాన్ని చెప్పడానికే దొంగతో ఈ మాటను పలికినాడు. యేసు మరణించి తిరిగి లేచిన వెంటనే ఈ భూమి మీద తన రాజ్యాన్ని స్థాపించి దానిని ఈ లోకాంతం వరకు పరిపాలించి అటు తర్వాత తన రెండవ రాకడతో ఆ రాజ్యాన్ని తీసుకెళ్ళి తన తండ్రికి అప్పగిస్తాడని **(1కొరింథీ 15:24,25)** అర్థం చేసుకొన్న దొంగవాడు అప్పటివరకు నన్ను జ్ఞాపకం చేసుకో అని అడిగినాడు. అన్ని సంవత్సరాలు నిన్ను భూమి మీద నా రాజ్యంలో బ్రతికి ఉంచడం వీలు కాదు గనుక, ఆరోజే నాతో పాటు పరదైసుకు తీసుకెళ్ళి అక్కడ క్షేమంగా ఉంచుతానని దొంగతో ఈ వాగ్దానం చేసాడు యేసుప్రభువు.

మనకంటే ముందుగా మరణించిన వారెవరు ఇప్పటి వరకు పరలోకం వెళ్ళలేదు. **అపోస్తలుల కార్యములు 2:34, 13:36,37** లేఖనముల ప్రకారము దేవుని ప్రియుడైన దావీదే పరలోకం ఎక్కిపోక తన పితరులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబులున్న ప్రదేశానికి వెళ్ళాడు అని తెలుస్తుంది. అనగా పరలోకం నుండి యాత్రికులుగా భూమి మీద కొచ్చిన నరులందరూ తిరిగి పరలోకం చేరాలంటే యేసుక్రీస్తు రెండవ రాకడ వరకు వేచి ఉండక తప్పదు. **(హెబ్రీ 11:1-40).** మరి అంతవరకు వీరందరు ఎక్కడ ఉన్నారు. లాజరు - ధనవంతుని గాథలోను ఇదే విషయాన్ని చెప్పాడు **(లూకా 16:19-31)** లాజరుతో పాటు చనిపోయిన నీతి మంతులందరు అబ్రహాము

రొమ్మున ఆనుకొని ఉన్నారని, అబ్రహాము కూడా పరదైసులోనే ఉన్నాడని వారికి అదే లోకంలోని నరకంలో ఉన్నవారు కూడా కనబడుచున్నారని కూడా చెప్పాడు. మరి యేసు మరణించిన వెంటనే ఎక్కడికి వెళ్ళాడు అని బైబిల్ గ్రంథాన్ని పరిశీలించి పరిశోధించి చదివితే యేసు సిలువలో తండ్రీ నీచేతికి నా ఆత్మనప్పగించుచున్నానని చెప్పి భూమియొక్క క్రింది భాగములలో ఉన్న పాతాళ లోకములోనికి దిగి వెళ్ళాడు (ఎఫెసి 4:9). అక్కడ మూడు రాత్రింబగళ్ళు గడిపి మూడవ దినమున తిరిగి లేచి అక్షయ శరీరాన్ని ధరించుకొని మగ్దలేనె మరియకు కనబడి పరలోకానికి ఆరోహణమయిపోయాడు. **(ఎఫెసి. 4:10, యోహాను 20:17).**

కొందరు బాప్తిస్మమును గూర్చి మాట్లాడుతూ ఎలా తీసుకొన్నా ఒకటే అనగా చిలకరింపు కూడా సరియైనదే అంటూ లేదా తీసుకోకపోయినా ఒకటే ఎందుకంటే సిలువలోని దొంగ బాప్తీస్మం తీసుకోకుండానే రక్షణ పొంది ప్రభువుతో పరలోకం పోయాడు గదా అంటారు. యేసు బ్రతికి ఉన్నప్పుడు ధర్మశాస్త్రం అమలులో ఉంది గనుక ధర్మశాస్త్ర ప్రకారంగా క్రియలు లేకుండా దేవుడెవనినైనా నీతిమంతునిగా తీర్చవచ్చు అనే వాగ్ధానం ప్రకారం దొంగ పరదైసుకెళ్ళాడు. **(కీర్తన 32:1,2)** అయితే యేసుప్రభువు మరణించి, సమాధి చేయబడి మూడవ దినమున లేపబడి, 40 దినాలు శిష్యులకు అగుపడి పరలోకానికి ఆరోహణమయ్యేటప్పుడు బాప్తిస్మం అనే దానిని ఆజ్ఞాపించాడు **(మార్కు 16:16, మత్తయి 28:18)** గనుక ప్రభువు మరణించి, తిరిగి లేచిన తర్వాత కాలంలో జీవించిన వారందరు తప్పని సరిగా బాప్తిస్మం అడిగి తీసుకోవాలి. యేసుతో పాటు పాత ధర్మశాస్త్రం కొట్టి వేయబడని కాలంలో దొంగ మరణించాడు గనుక ఆ దొంగ వాడికి బాప్తిస్మం అవసరం లేదు. ఇలా ఆలోచిస్తేనే బైబిల్ అర్థమవుతుంది.

పైన చెప్పబడిన వాక్య భాగములను బట్టి క్రీస్తు మరణించిన వెంటనే దొంగవానిని తీసుకొని పాతాళ లోకములోనికి వెళ్ళాడని

అర్థమగుచున్నది. **(1సమూయేలు 2:6)** అయితే దొంగతో చెప్పిన మాట ప్రకారంగా ఆలోచిస్తే పరదైసు అనేది ఆ పాతాళ లోకంలో ఒక భాగమైయున్నది. అనగా దొంగతో కలిసి ఇశ్రాయేలీయుడు, యూదుడైన క్రీస్తు కూడా తన పితరుల యొద్దకు చేర్చబడినాడని, వారిని కలుసుకొని మాట్లాడడానికి, తన రెండవ రాకడను గూర్చి తెలియజేయడానికి అంతవరకు వారితో పాటు దొంగ కూడా పరదైసులోని జీవ వృక్ష ఫలాలను అనుభవించాలని చెప్పాడు **(ప్రకటన 2:7).** ఇంతవరకు మనకు తెలిసిన మర్మం ఏమిటంటే క్రీస్తుతో పాటు, నేటి వరకు క్రీస్తునందున్న వారు ఎంరు మరణించినా పరదైసుకే వెళ్ళాలి తప్ప పరలోకం వెళ్ళరు అని అర్థం అగుచున్న **(2కొరింథీ 12:1-4).** ఇప్పటివరకు చనిపోయిన మన వారందరు పరలోకం చేరారని నమ్మి, ప్రార్థించి, పేపర్లలో ప్రకటన ఇస్తున్నాం. ఇది వాక్యానుసారంగా తప్పని అందరూ గ్రహించాలని సిలువలో మన ప్రభువు మన పరలోక ప్రయాణం గూర్చి తన మార్గంలో వివరంగా తెలియజేయడానికే సిలువలో ఈ రెండవ మాటను పలికాడని గ్రహిస్తే అద్భుతం.

పరలోకంలో ఒకప్పుడు దేవునిలో ఆత్మయై ఉన్న మనం ఆదాము ద్వారా ఈ లోకానికి వచ్చాం. పాపులమైన మన పాపానికి క్రీస్తు శరీరం ద్వారా సిలువలో క్షమాపణ అనుగ్రహించిన దేవుడు ఆ యేసు ద్వారానే పరదైసులో 1000 యేండ్లు గా చెప్పబడిన పరిపాలన దీర్ఘకాలంలో విశ్రాంతినిచ్చి తిరిగి రెండవ రాకడలో మనకన్నా ముందు చనిపోయిన వారితో కలిసి ఏకంగా ఒకేసారి ఆ దివ్యలోకాన్ని చేరటానికి ఏర్పాటుచేసిన ఆ అద్భుతమైన సంగతి చెప్పడానికే ప్రభువు సిలువలో పలికిన మాటయే **"నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు"** మనందరం పరలోకం వెళ్ళాలంటే యేసు మరల రావాలి **(యోహాను 14:1-6)** అని మరచిపోవద్దు. అయితే ఈ సంగతి ఈ రోజు మీకెందుకు తెలియజేశాడు దేవుడు. ప్రతి సం॥ ఒక్కొక్కరం ఒక్కోమాట కేవలం వంతుకు పలికి, నేనెంత బాగా

చెప్పానో చూడు అని మురిసిపోవడానికా? లేక ఇందులో ఏమైనా పరమార్ధమున్నదా? అని ఒకసారి ఆలోచిద్దాం. ప్రభువు సిలువలో పలికిన ఏడు (7) మాటలే కాదు ఆయన జీవితంలో పలికిన ప్రతి మాటా చాలా విలువైనది. లేఖనాలలో ఆయన పలికిన మాటలను గూర్చి ముందే మనల్ని హెచ్చరించాడు అదేదనగా "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా! ప్రభువా! అని నన్ను, పిలుచుట ఎందుకు?" **(లూకా 6:46)**. ప్రతి గుడ్‌ఫ్రైడే నాడు మనం యేసును మరలా సిలువ వేయుచు ప్రభువా నీవు మాకోసం చనిపోయావు నాయనా అని నెత్తినోరు కొట్టుకుంటూ రోదిస్తూ బాధగా ఏడుమాటలను కొందరు మాత్రమే పలికితే, అందరు బాధగా కూర్చొని ధ్యానించామని అనుకొని వెళ్ళిపోతున్నారు. ఆయన పలికిన మాటలను మనల్ని పలకమనలేదు, ధ్యానించమనలేదు కాని వాటి ప్రకారం చేయమని ముందే ఆజ్ఞాపించాడు. మనం ఆచారంగా పెదవులతో పలికి వెళ్లిపోతున్నామే గాని వాటిని హృదయపూర్వకంగా గ్రహించి ఆచరించడం లేదు అని ఆలోచిస్తే ఎంత బాగుంటుందో ఆలోచించండి.

యేసు తన జీవితంలో చివరిరోజు మాత్రమే భయంకరమైన, శాపగ్రస్తమైన ఆ మ్రాను అనగా సిలువను మోసి రక్తాన్ని కార్చి ఆ మాటలు పలికినాడు. ఆ యేసును వెంబడించే మనం మోయాల్సింది ఎవరి సిలువనో తెలుసా? "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువను ఎత్తుకొని నన్ను వెంబడింపవలెను" **(లూకా 9:23)** యేసు తన సిలువను ఒక్కరోజు మోసాడు. మనం ఆయన మోసిన సిలువను గాకుండా మన సిలువను మనం ప్రతి దినం మోస్తూ ఆయన పలికిన మాటల ప్రకారం చేయాలని చెప్పి వెళ్ళాడు. మన సిలువ వేరు ఆయన సిలువ వేరు. ఆయన సిలువను నేటికి మనం మోస్తే మనం కూడా ఇంకా శాపగ్రస్తులమే అవుతాము. ఆయన త్యాగం నిరర్థకమవుతుంది. మనందరికి ఒక్కొక్కరికి ఒక్కో సిలువ ఉన్నది.

మన జీవితాంతం వరకు ప్రతిక్షణం మన సిలువను మోస్తూ లేక అందులో వేలాడుతూ లేదా సిలువ వేయబడుతూ ఎంత కష్టమైనా మనల్ని హింసించిన వారిని క్షమించి, వారి కొరకు ప్రార్థించాలి. మన పొరుగువారు కూడా ప్రభువును నమ్మి, వారు క్రీస్తు మార్గములో నడిచినట్లు అయితే నేడు మనం చనిపోయినా తప్పనిసరిగా నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉంటావని వారికి ధైర్యంగా చెప్పాలి. మన పొరుగు వారికి సువార్తను ప్రకటించి కారణం అడిగిన ప్రతివారికి ప్రభువు త్యాగాన్ని వివరిస్తూ బ్రదర్ నేడు మనం కలిసి మరణించినా పాతాళ లోకం లోని నరకానికి కాకుండా "పరదైసు"లోనికి తప్పక వెళుతాం అని మనల్ని ప్రతిరోజు చెప్పమని, లేదా పలుకమని ఆరోజు ప్రభువు దొంగతో ఆ మాట చెప్పాడు. ఇప్పుడు చెప్పండి ఈ మాట గుడ్ ఫ్రైడే రోజు మాత్రమే పలుకుదామా? లేక ధ్యానిద్దామా? ప్రతిరోజు ధ్యానిద్దామా? ప్రతి సంవత్సరం గుడ్ ఫ్రైడే జరిపి సజీవుడైన క్రీస్తు యేసును మరలా, మరలా సిలువ వేసి చంపి, మనం మాత్రం కేవలం మాటలు పలికి పాటలు పాడి ఆనందంగా ఇంటికి వెళ్ళి పండగ చేసుకుందామా? మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోండి దేవుడు మనకు తోడై ఉండి నడిపించును గాక.... ఆమెన్.....

## 3. "అమ్మా ఇదిగో నీకుమారుడు ఇదిగో నీ తల్లి"

మనలాంటి మామూలు శరీరాన్ని ధరించుకొని దేవుని చిత్తప్రకారము సంపూర్ణ సిద్ధి పొందినవాడు, మెల్కీసెదెకు యొక్క క్రమములో చేరిన ప్రధాన యాజకుడని దేవునిచేత పిలువబడి, తనకు విధేయులైన వారందరికిని నిత్య రక్షణకు కారకుడైన క్రీస్తు యేసు సిలువ బలియాగము మానవ మేధస్సుకందనిది. మనము మన శరీరేచ్ఛల నుండి విడుదల పొందుటకై తన శరీరం పెట్టే బాధలను, వేదనను తట్టుకొని మన కర్తవ్యాన్ని గుర్తు చేయుటకై తన బాధ్యతను నెరవేరుస్తూ సిలువలో పలికిన మాటలు నిజంగా అద్వితీయం. మొదటి మాటలో ప్రేమ, క్షమాపణ, విజ్ఞాపనలను నేర్పించి, రెండవ

మాటలో పరలోక ప్రయాణం గూర్చి తెలిపి, దానిపై అభయ హస్తాన్నిచ్చి మన నిరీక్షణకు ఆధారమయ్యాడు. ఇప్పుడు 3వ మాటలోని అంతర్యాన్ని గ్రహించి, ప్రభువు మనస్సునెరిగి, యెహోవా ఎంత ఉత్తముడో రుచి చూసి యెరిగి ఆయన మాటలన్నిటిని దివారాత్రులు ధ్యానిద్దాం.

''యేసు తల్లియు తాను ప్రేమించిన శిష్యుడు దగ్గర నిలిచియుండుట చూసి, **"అమ్మా, యిదిగో నీ కుమారుడు"** అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూసి **"యిదిగో నీ తల్లి"** అని చెప్పెను. ఆ గడియ నుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను'' **(యోహాను 19:26,27).**

ఈ మాటలో క్రీస్తు యొక్క కుమారత్వము, సహోదరత్వము, నాయకత్వము, ప్రేమతత్వము మానవత్వము తల్లియొక్క హృదయ వేదన కనబడుచున్నది. దేవుని ఆజ్ఞ నెరవేర్చుటలో, అనగా వాక్యపరిచర్యలో ఉన్నపుడు ''ఎవరు నా తల్లి? ఎవరు నా చెల్లి, ఎవరు నా సహోదరులు, పరలోకమందున్న నా తండ్రి చిత్తము నెరవేర్చువారే బంధువులు లేక రక్త సంబంధులు'' **(మత్తయి 12:46-50, మార్కు 3:31-35, లూకా 8:19-21)** అని చెప్పిన ప్రభువే సిలువలో ఈ మాటను మాట్లాడాడు అంటే ఆలోచించాలి. తల్లీ కుమారుల బంధాన్ని, శిష్యుల అనుబంధాన్ని గుర్తు చేస్తున్నాడంటే ఆయన కూడా ఈ లోకంలోని భవబంధాలను కలిగిన పరిపూర్ణ మానవుడుగా తన బాధ్యతను నెరవేరుస్తున్నట్లుగా కనబడుచున్నది. నిబంధనలో మార్పులు చేస్తున్నప్పుడు యూదులు తనను అపార్థము చేసుకుంటున్నారని, నన్ను బ్రతకనియ్యరని తెలిసి నేను ''ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల గ్రంథములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు రాలేదని'' **(మత్తయి 5:17,18)** ఆయన చెప్పాడు మరియు ధర్మశాస్త్రానికి లోబడ్డాడు **(గలతీ. 4:4,5).**

దేవోక్తులు యూదులకే స్వంతమని, ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇచ్చాడని **(కీర్తన 78:8)** ఆ వాక్యమే మనకు చెబుతున్నది గనుక ఇశ్రాయేలీయులలోని యూదా గోత్రానికి చెందిన దావీదు వంశస్థుడైన యేసుక్రీస్తు ధర్మశాస్త్రాన్ని తప్పక ఆచరించి నెరవేర్చాలి **(రోమా 9:2-5)**.

ధర్మ విరోధులుగా బ్రతుకుతున్న నాటి ఇశ్రాయేలీయులను తన ప్రజలుగా ఎన్నుకొన్నాడు గనుక వారిని చీకటిలో నుండి వెలుగులోనికి నడిపించుటకై వారికి మోషే ద్వారా 10 ఆజ్ఞలనిచ్చాడు. అందులోని 5వ ఆజ్ఞను మనం పరిశీలిస్తేనే గాని ఈ మాటలోని పరమార్ధం బోధపడదు.

**"నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవై నీకు క్షేమమగునట్లు దేవుడైన యెహోవా నీ కాజ్ఞాపించులాగున నీ తండ్రిని, నీ తల్లిని సన్మానింపుము." (ద్వితీ. 5:16, నిర్గమ 20:12)**. ఇశ్రాయేలీయుడైన ప్రతి వాడు ఈ పది ఆజ్ఞలలో ఒక్కటికూడా తప్పకూడదు. తొమ్మిది నెరవేర్చి ఒకటి తప్పినా అపరాధి అవుతాడు **(యాకోబు 2:10)**. తన కడుపులోపడినప్పటి నుండి సిలువలో మరణించేంత వరకు క్రీస్తును వెన్నంటి ఉన్న మహాతల్లి మరియమ్మ. తన తమ్ముళ్ళు వెళ్ళగొట్టినా, తండ్రి అనుమానస్థుడై దూరంగా ఉన్నా తల్లి కన్న పేగు బంధాన్ని మరువలేదు. తన తల్లి రుణం మరియు దేవుని ఆజ్ఞ నెరవేర్పుకై తన బాధ్యతను కనపరుస్తున్నాడు. నేటి క్రైస్తవులలోని అనేకులలోని వారివలెనే నాటి ఇశ్రాయేలీయులలో అనేకులు కూడా పితృ, మాతృహంతకులుగా, తల్లి దండ్రులకవిధేయులుగా ఉండి వారి ఆలనా పాలన చూడక **'యెహోవాయీరే'** అనగా దేవుడే చూసుకొంటాడని చెప్పారు గనుకనే ఈ ఆజ్ఞ ఇచ్చాడు దేవుడు **(1తిమోతి 1:8-11)**.

యేసు ప్రభువు బాల్యం నుండే తల్లి పెంపకంలో ప్రభువు బోధలోను, శిక్షలోను పెరిగినాడు గనుకనే దేవుని దయ యందును,

మనుష్యుల దయయందును, లోకజ్ఞానంలోను దేవుని జ్ఞానంలోను దినదినము వర్ధిల్లాడని వ్రాయబడినది. ఇశ్రాయేలీయులకే కాదు మనందరికి కూడా ఇదే ఆజ్ఞను మళ్ళీ ఇచ్చాడు దేవుడు "పిల్లలారా, ప్రభువు నందు మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడి, ఇది ధర్మమే. **నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని, తల్లిని** సన్మానింపుము **అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు.** ఇది వాగ్ధానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది" **(ఎఫెసి 6:1-3).** ఇశ్రాయేలీయులైతే వారికివ్వబడిన దేశములో ఆజ్ఞలు పాటించాలి, మనందరు భూమంతటా ఉన్నాం గనుక మనకు భూమి మీద అని చెప్పాడు. దీర్ఘాయుష్మంతుడు అంటే ఎక్కువ కాలం బ్రతుకుతాడనే కాదు. ప్రజల హృదయాలలో కలకాలం జీవించి ఉంటాడని అర్థం. సన్మానించడం అంటే శాలువ కప్పి, దండ వేసి దండము పెట్టడం కాదు. వారి మాటలకు విలువనిచ్చి, వారిని గౌరవించి, సంరక్షించి, పోషించే ఏర్పాట్లు చేయడమే.

"ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన ఇంటి వారిని, సంరక్షింపకపోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్నా చెడ్డవాడై యుండును" **(1తిమోతి 5:8).** నేటి క్రైస్తవులలో అనేకులు బ్రతుకుదెరువు కోసమే బైబిల్ పట్టి, రెండు మాటలు నేర్చుకొని ఒక సంచి తగిలించుకొని దేవుని సేవ పేరుతో ఊర్లు మీదపడి తిరుగుతూ సన్యాసుల్లాగా భార్యాపిల్లలను, తల్లితండ్రులను వదిలేస్తున్నారు. అదేమంటే దేవుడే చూసుకొంటాడు బ్రదర్ **"యెహోవా యీరే"** అని అంటున్నారు.

మనం ఇలా మాట్లాడుతామని ముందే ఎరిగిన దేవుడు మనకు ముందుగా మన ప్రభువుచేత తన బాధ్యతను నెరవేర్చి మనకు బుద్ధి కలుగడానికే ఈ మాటలు వ్రాయించాడు. తన వారిని విడిచి వచ్చిన తల్లిని అనాధను చేయకుండా ఆమె సంరక్షణను తన శిష్యునికి అప్పగించి ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడు. మనం కూడా మన

తల్లితండ్రుల కన్నా ముందే చనిపోయే పరిస్థితి వస్తే మనం కూడా ఈ బాధ్యతను మరొకరికైనా అప్పగించాలనేది ఈ మాటలలోని మర్మము.

ఆవిధముగానే కాపరి, నాయకుడై ఉండవలసిన వాడు తనతోపాటు తన బోధ విన్న వారిని కూడా రక్షించుకోవలసిన బాధ్యత కల్గియుండాలి **(1తిమోతి 4:16)** గనుక నాయకుడైన క్రీస్తు తన శిష్యుని రక్షణ కోసం తన తల్లికి అప్పగించాడు. తన తల్లి పెంపకమే నన్ను ఇంతవరకు నడిపించిందని తెలుసుకొన్న యేసు తన ప్రియ శిష్యుడైన యోహానును తల్లి ఆదరణ, పెంపుదల కోసం అప్పగించి తన కర్తవ్యం నెరవేర్చాడు. నా చిన్నతనంలోని కాలంలోకంటే నేటి తరంలోని పిల్లలలో తల్లిదండ్రుల యెడల భయభక్తులు తగ్గినట్లుగా కనబడుతున్నాయి. ఇప్పటికే సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్న సంగతిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

దీనికి బాధ్యులు నేటి తరంలోని తల్లిదండ్రులే. ఎందుకంటే మనం "వారికి కోపం రేపక ప్రభువు శిక్షలోను, బోధలోను వారిని పెంచడం లేదు" **(ఎఫెసి 6:4)** ఈరోజు కడుపునింపే కార్పోరేట్ కాలేజిల బోధలోనే పెంచుతున్నామే గాని, ఆత్మను రక్షించుకొని దేవుని బోధలో పెంచడంలేదు. కార్పోరేట్ కాలేజీల "తల్లిలాంటి శిక్షణ, తండ్రి లాంటి రక్షణ" అనే స్లోగన్ మాయలో పడుతున్నారే, దాని వెనుకాల మనలను అవమానిస్తున్నారనే జ్ఞానోదయం కావడం లేదు. దేవత్వంలోనికి మార్పు చెందాల్సిన పిల్లలు ఈలోక జ్ఞానం బోధలో మార్కుల పోటీ ఎక్కువై మానవత్వము పోటీ తగ్గిపోయి ప్రతివాడు డబ్బుకాశపడే చదువు చదివి దానవులైపోతున్నారు. విదేశీ ధనం మోజుతో స్వదేశంలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను స్వయంగా ఆదరించలేక వృద్ధాశ్రమంలో చేర్చుచున్నారు. అక్కడ వారు రక్తసంబంధం, ఆత్మీయత కానరాక అల్లాడుతున్నారు. దీనిని ముందే ఎరిగిన దేవుడు దేవుని బోధల్లో కూడా మీ పిల్లలను పెంచండి

అని వ్రాయించినా పట్టించుకోకుండా తప్పించుకు తిరుగుచున్నారు. అందుకే నేటి ఆరాధనలలో అందరూ వేషధారణతో ఆరాధిస్తున్నామే గాని, ఆత్మతో - సత్యముతో ఆరాధిస్తున్నామా? ఒకసారి ఆలోచించండి.

ఈ విషయాన్ని ప్రతి నిత్యము గుర్తు చేసుకొని దేవుని ఆజ్ఞను నెరవేరుస్తూ మన తల్లిదండ్రులను సన్మానించుటకే యేసు ఈమాటను పలికి మనల్ని పలకమంటున్నాడు. అలాగే మన పిల్లలు మంచి కాపరులు, నాయకులు కావాలని దేవుడు కోరుకున్నాడు. ఇది మానవ బంధుత్వాలకు, మమతానురాగాలకు, ఆదరణలకు, అనుబంధాలకు సంబంధించిన అద్భుతమైన మాట. కాబట్టి ఇకనుండైనా యేసు మాటల ప్రకారం మనం, మన పిల్లలు ప్రతిదినం మన సిలువ నెత్తుకొని ఆయన మార్గములలో నడువాలంటే దేవుని బోధలో పెరిగి, ఆయన క్రీస్తు ద్వారా ఇచ్చిన ఆజ్ఞలను నెరవేర్చాలి.

ఈమాటలో మరో గొప్ప ఆదరణను మన నిరీక్షణకు ఆధారమును చూపెట్టాడు క్రీస్తు. ఈలోకములో ఎవరైతే దేవుని రాజ్యము నిమిత్తము, సువార్త నిమిత్తము అందరిని, అంతా పోగొట్టుకొంటారో వారికి ఎన్నోరెట్లు దొరుకుతాయని చెప్పిన దానికి రుజువు చూపాడు. అన్ని, అందరిని వదలుకున్న కుమారుడికి తల్లిని, తల్లికి కుమారుడి నిచ్చాడు. "అందుకు యేసు ఇట్లనెను. నా నిమిత్తమును, సువార్త నిమిత్తమును ఇంటినైనను, అన్నదమ్ములనైనను, అక్క చెల్లెండ్రనైనను, తల్లిదండ్రులనైనను, పిల్లలనైనను, భూములనైననూ విడిచిన వాడు, ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరంతలుగా ఇండ్లను, అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను, తల్లులను, పిల్లలను, భూములను, రాబోవు లోకమందు నిత్య జీవమును పొందుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" **(మార్కు 10:28-30, మత్తయి 19:27-30, లూకా 18:28-30).** ప్రభువు నమ్మితే ఈ దేశంలో అనేకులు తమ పిల్లలను, తల్లి, దండ్రులను ఇంట్లోంచి వెళ్ళగొడుతున్నారు లోకానికి భయపడి.

వాళ్ళు మిమ్మల్ని వదిలినా, మీరు వారిని వదిలినా ఈలోకంలో మనకు ఎంతో మంది దొరుకుతారు అని చెప్పాడు. సిలువ దగ్గర నుండే మొదలెట్టి నేటికి ఎంతోమందికి దొరికారుకూడా. ఇదంతా మనం దేవునిలో ఉంటేనే గాని పర్మనెంటు కాదు. ఇవన్నీ క్రీస్తు రక్తంలోని సంబంధాలే. మన అసలు తల్లిదండ్రులను, పిల్లలను శాశ్వతంగా వదిలి వేయమనికాదు. అది మళ్ళీ అవిశ్వాసి కిందకు వస్తుంది. సువార్త పనికి అడ్డొచ్చినపుడు మాత్రమే వారిని వదిలివెయ్యాలి అంటే ఇక్కడొక అద్భుతమైన పాయింట్ ఉంది మీరు ఆలోచించారో లేదో గాని, నేను ఆలోచించాను. ఎవరిని వదిలినా ఫర్వాలేదు గాని భార్యను వదలకూడదు. వదలమని ప్రభువు చెప్పలేదు. వదిలితే భార్యగాని, భార్యలు గాని దొరుకుతారని గూడా చెప్పలేదు అలాగుననే భార్యకు వర్తిస్తుంది. గనుక జాగ్రత్తసుమా!

దేవుని ఆజ్ఞ నెరవేర్చుటకు, మనల్ని నమ్మిన వారికి ఆదరణ, సంరక్షణ నిచ్చి ప్రతి దినము ఎట్టి ప్రతికూల పరిస్థితిలోనైనా మనము ఈ మాటను పలుకుతూ, మన పరుగు పందెములో గెలుద్దాం. దేవుడు మనల్ని ఈ మహా యుద్దానికి సిద్ధపరచును గాక... ఆమెన్

## 4. ఏలి, ఏలి, లామా సబక్తానీ!

సర్వమానవాళి రక్షణార్థమై దేవుని కుమారుడైన క్రీస్తు తన రక్తాన్ని పాప పరిహారార్ధ బలిగా అర్పించే సమయములో మాట్లాడిన మాటల్లో ఇది చాలా ప్రాముఖ్యమైనది. నాటి ఇశ్రాయేలీయులకు, నేటి క్రైస్తవులకు దేవుడెవరో అర్థమయ్యాడు గాని క్రీస్తు మాత్రమే అర్థం కాలేదు. మొదటి మాటలో మనం పరలోకం చేరాలంటే మన పొరుగువారిని ప్రేమించి, మనల్ని హింసించిన వారిని క్షమించి, వారికొరకు విజ్ఞాపన చేయాలని తనే చేసి చూపాడు. రెండవ మాటలో పాపక్షమాపణ కోరిన వారికి పరలోక ప్రయాణ వివరాలు చెప్పాడు. మూడవ మాటలో ఈ మార్గములో ప్రయాణిస్తున్న వారు తమ కుటుంబ బాధ్యతను మరచి పోకూడదని ఒక యూదుడుగా తన

బాధ్యతను నెరవేర్చి మనకు మార్గమైనాడు. ఇక నాల్గవ మాటలోని పరమార్థాన్ని దేవుని ఆలోచనలోనికెళ్ళి ధ్యానిద్దాం.

**“ఇంచుమించు మూడు గంటలపుడు యేసు - ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను (మత్తయి 27:46).**

**మూడు గంటలపుడు యేసు - “ఎలోయీ, ఎలోయీ, లామా సబక్తానీ” అని బిగ్గరగా కేకవేసెను (మార్కు 15:34).**

ఆమాటకు నాదేవా, నాదేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము. ఇదే మాటను క్రీస్తు పూర్వము మన ప్రభువు యొక్క మూలపురుషుడుగా, శరీర సంబంధమైన తండ్రిగా పిలువబడ్డ దావీదు గారు ప్రవచించి, పలికిన కీర్తన గ్రంథములోనిదే. ఈ 7 మాటలు చాలా వరకు కీర్తనలలోనివేనని మనకు తెలుసు. “నా దేవా, నాదేవా, నీవు నన్నేల విడనాడితివి? నన్ను రక్షింపక నా ఆర్తధ్వని వినక నీవేల దూరముగా నున్నావు” **(కీర్తన 22:1)** పాత నిబంధనలోని ఈ మాటలు హెబ్రూ భాషలో వ్రాయబడ్డా, దాని తెలుగు అర్థాన్ని మాత్రమే తెలుగులో వ్రాశారు. యేసు ప్రభువుకు హెబ్రూ, గ్రీకు, అరామిక్ లాంటి భాషలొచ్చినా ఎక్కువగా అరామిక్‌లోనే మాట్లాడారని చరిత్రకారులు సాక్ష్యమిచ్చారు. హీబ్రూలో ఎలోహిం అంటే దేవుడు. అరామిక్‌లో ఎలీ, ఎలోయీ రెండు పర్యాయపదాలు గనుక దాని అర్థం దేవుడే. గ్రీకులో థియోస్ అంటే దేవుడు. ప్రభువు మాటలు ఏ భాషలో ఉన్నాయి అని కొట్టుకు చావకుండా, అవి ఎందుకు మాట్లాడాడో అని మాత్రమే ఆలోచించాలి. మన భాషలో నాదేవా అనే అర్థం తెలిసింది గనుక మన భాషలో దేవుని ఆత్మచేతనే ఈ మాటను పరిశీలించి, పరిశోధించి ఆ ప్రకారం ప్రవర్తిద్దాం.

ప్రభువు సిలువలో పలికిన మాటలన్నీ ధర్మశాస్త్రాన్ని, అనగా లేఖనాలను నెరవేర్చుటకు పలికాడని గ్రహించాలి. అయితే ఈ మాట కీర్తన గ్రంథంలోనే ఉన్నా **కొత్త నిబంధన వ్రాసిన సువార్తికులు ఈ మాటముందు కూడా లేఖనము నెరవేరునట్లు** అని మాత్రం

వ్రాయలేదు అని ఆలోచించాలి. ఆయన పలికిన మాటలన్నిటినీ బట్టీపట్టి గుడ్‌ఫ్రైడే నాడు మాత్రమే మాట్లాడకూడదనే విషయాన్ని ప్రతి మాటలోనూ జ్ఞాపకం చేసుకోవాలి **(లూకా 6:46).** యేసుప్రభువుకు చిన్నప్పటి నుండి దేవుడు తోడై ఉండి నడిపించాడు. తను బోధ ప్రారంభం నుండి ఈ మాటలు మాట్లాడక ముందు వరకు చేసిన క్రియలు, సూచక క్రియలు, మహత్కార్యములన్నిటినీ దేవుని సహాయంతోనే చేశాడు. దేవుని దయతోను, మనుషుల దయతోను వర్ధిల్లెను అని వ్రాయబడిన మాటను మర్చిపోకూడదు. **(లూకా 2:40,52, యోహాను 11:41, 42, అపో.కా. 2:22, 3:13,10:38).** బైబిల్‌లో ఎప్పుడు నేనే తండ్రిని అని యేసు చెప్పలేదు. అయినా ఆయనే తండ్రని, త్రిత్వములో ఒకడని నమ్ముతున్న క్రైస్తవులు మరణం దగ్గరకొచ్చేసరికి ఇలా బిగ్గరగా కేకలేసి మనిషిగా ఎందుకు ఆక్రందన చేస్తున్నాడని ఆలోచించలేకపోతున్నారు.

సిలువలోనే కాదు అంతకు క్రితము అనగా అప్పగింపబడేముందు ప్రార్థన సమయంలో కూడా తన ప్రాణం పోతుందని కలవరపడి "తండ్రీ సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్ద నుండి తొలగించమని కోరాడు" **(మత్తయి 26:37-39)** ఈ మాటలన్నిటిని బట్టి యేసు దేవుని కుమారుడైన క్రీస్తు మాత్రమేనని, మనిషైన దావీదు మాట్లాడినట్లే మనుష్య కుమారుడైన క్రీస్తు మాట్లాడాడని, తనుకూడా మనందరి లాంటి మానవుడేనని తెలియపరుచుటకే ఈ కేక బిగ్గరగా వేశాడు. ఇది ఆయన పరిపూర్ణ మానవత్వాన్ని సూచించుచున్నది.

లేఖనములన్నియు నన్ను గూర్చి సాక్షమిచ్చుచున్నాయని చెప్పిన యేసు లేఖనాల ద్వారా తండ్రి తనకిచ్చిన వాగ్ధానాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఒక మనిషిగా మనం కూడా మన ఆక్రందన లేకా మన హక్కును అడుగవలెనని గుర్తు చేస్తున్నాడు. సాధారణంగా ఈలోకంలో మనకు అన్నీ బాగున్నపుడు దేవునిదయ, కృప, ఆశీర్వాదము లాంటి మాటలు మాట్లాడుతూ దేవున్ని స్తుతించుచున్నామని అనుకొంటాము గదా. అయితే

కష్టాలొచ్చినపుడు, నష్టాలొచ్చినపుడు, అనుకొన్నవి నెరవేరనపుడు దేవుడు మమ్మల్ని మరచిపోయాడనడం సర్వసాధారణం. నిన్ను విడువను యెడబాయను, ముదిమివచ్చు వరకు ఎత్తుకొంటాను, భయపడకుము నేను నీకు తోడైయున్నాను, అని ఇశ్రాయేలుకిచ్చిన వాగ్ధానాలు గుర్తు తెచ్చుకొంటాము. వారు అనేకసార్లు దేవుని కోపానికి గురై దేవుడు వదిలినప్పుడు ఎన్నో ఆక్రందనలు చేస్తే వారి మొరవిన్న దేవుడు వారిని మళ్ళీ, మళ్ళీ కనికరించి చేరదీసి తన హస్తముతో ఆదుకోవడం చూస్తాము.

నాటి ఇశ్రాయేలీయులు మొదలుకొని నేటి క్రైస్తవులమైన మనకోసం వ్రాసిన దేవుడు తన ప్రియ కుమారుడైన క్రీస్తుకోసం కూడా, అనగా ఆయన కోసం మాత్రమే కూడా కొన్ని వాగ్ధానాలు చేసాడు. తాను ఆపదలో పడ్డానని మామూలు మనిషిగా దేవునికి తన మొర వినిపిస్తున్నాడు. ఆయనకిచ్చిన వాగ్ధానాన్ని చూద్దాం. బైబిల్ ఎలా చదివితే అర్ధం అవుతుందో ఆశ్చర్యపోదాం.

"ఆకాశములను సృజించి, వాటిని విశాలపరచి భూమిని అందులో పుట్టిన సమస్తమును పరచి, దాని మీదనున్న జనులకు ప్రాణమును, దానిలో నడచు వారికి జీవాత్మను ఇచ్చుచున్న దేవుడైన యెహోవా ఇలాగు సెలవిచ్చుచున్నాడు. గుడ్డి వారి కన్నులు తెరుచుటకును, బంధింపబడిన వారిని చెఱసాలలో నుండి వెలుపలికి తెచ్చుటకును, చీకటిలో నివసించువారిని బంధీ గృహములో నుండి వెలుపలికి తెచ్చుటకును, యెహోవానగు నేనే నీతి విషయములలో నిన్ను పిలిచి నీ చేయిపట్టుకొనియున్నాను. నిన్ను కాపాడి ప్రజల కొరకు నిబంధన గాను, అన్యజనులకు వెలుగుగాను నిన్ను నియమించియున్నాను" **(యెషయా 42:5-7).**

యెషయా గ్రంథము **42లో మొదటి 4**వచనాలలో యేసును గూర్చి ఇశ్రాయేలీయులతో మాట్లాడిన దేవుడు. **5 నుండి 7 వచనాలలో** యేసు ప్రభువుతో మాత్రమే మాట్లాడినాడని గ్రహించాలి. ఈ వాగ్ధానం

ఈలోకంలో ఇంకెవరికి య్యబడలేదు. అందుకే ప్రభువు తన పరిచర్య ప్రారంభంలో నజరేతుకు వచ్చినపుడు సమాజ మందిరంలో ఆయనకివ్వబడిన యెషయా గ్రంథపు చుట్టలోని దాన్ని చదివి మీ వినికిడిలో ఈ లేఖనము నాకొరకు మాత్రమే వ్రాయబడినదని, అది ఈరోజు లేఖనము నెరవేరినదని చెప్పాడు. **(యెషయా 61:1-3, లూకా 4:16-19).** యెషయా గ్రంథంలోని వాగ్ధానం ద్వారా నా చెయ్యి పట్టుకొని, నన్ను కాపాడుతానన్నావు గదా తండ్రీ, నాదేవా ఈరోజు నా చెయ్యి ఎందుకు విడిచావయ్యా అని అడుగుతున్నాడు. ప్రాణం పోతుందనే భయంతోనే ఒక మానవుడుగానే ఆర్తనాదము చేశాడు. ఇది నాటి నుండి నేటి వరకున్న అనేకులైన క్రైస్తవులకు అర్ధంగావడం లేదు.

ప్రతి శుభ శుక్రవారం నాడు, అనేక ఆరాధనలలో యేసుప్రభువు మరణాన్ని గూర్చి చింతిస్తూ పాటలుపాడుతూ, తండ్రీ మాకోసం చనిపోయావు నాయనా అని ఏడుస్తూ ప్రార్ధిస్తున్నారు. ఆదియందు వాక్యమైన దేవుడుగా ఉన్న ప్రభువు **(యోహాను 1:1-14),** ఈలోకంలో శరీర ధారియైన తర్వాత మనలాంటి మామూలు మానవుడుగానే బ్రతికాడు. ఎన్నోసార్లు నేను మనుష్యకుమారున్ని గట్టిగా (నిశ్చయముగా) చెప్పాడు. అయినా నేటి క్రైస్తవ్యం తప్పుడు విశ్వాసంలోనికి వెళుతుందని గ్రహించిన ప్రభువు తన చివరి క్షణంలో కూడా తన మానవత్వాన్ని గుర్తు చేస్తున్నాడు ఈ మాట ద్వారా, మనలో ఇప్పటికీ నేనే దేవున్నని, దేవుని అవతారాన్నని అనేకులను మోసపుచ్చుతున్నారు. మనం అలాంటి ఆలోచనలోనికెళ్ళవద్దని హెచ్చరిస్తున్నాడు. పరిశుద్ధమైన శరీరాన్ని కలిగిన మొదటి మానవుడైన ఆదాము శోధనలో పడి **పాపాన్ని మనకు వారసత్వ సంపదగా ఇస్తే,** కడపటి ఆదాము అయిన క్రీస్తు పాపశరీరాకారంతో **(రోమా 8:3-4)** వచ్చి పాపాన్ని జయించి 'పరలోకాన్ని' స్వాస్థ్యముగా ఇచ్చాడు. సిలువలో మరణిస్తున్న నేను మీలాంటి మానవున్నే అని దేవునితో పాటు మనందరం వినేటట్లు బిగ్గరగా కేకవేస్తున్నాడు. అందుకే

యేసు క్రీస్తును అందరికి ప్రభువుగా దేవుడు నియమించాడు.

యేసుక్రీస్తు మాత్రమే శరీరధారిగా వచ్చాడు, దేవునికి రక్తమాంసాలు లేవు అని అపోస్తలులు గొంతెత్తి అరచినా **(1యోహాను 4:1-6, 2యోహాను 7-11)** పౌలుగారు తన పత్రికలన్నిటిలో బోధించి, మనందరికి మధ్యవర్తి క్రీస్తు యేసనే నరుడని **(1తిమోతి 2:5,6)** ఎంత చెప్పినా, అనేక సంఘాలలోని విశ్వాస ప్రమాణాలలో వ్రాసుకున్నా, ఈనాటి అనేకమంది బైబిల్ పండితులకు, రెవరెండ్లు, బిషప్‌లకు అర్థంగావడం లేదు. "నా వంటి ఒక ప్రవక్తను మీ సహోదరులలో నుండి మీకొరకు పుట్టిస్తానని" **(ద్వితీ. 18:16-18)** మోషె మొదలుకొని ప్రవక్తలందరు ప్రవచించి ప్రకటించినా నాటి ఇశ్రాయేలీయులు గ్రహించలేదు. యేసు అబ్రహాము సంతానమైన ఇశ్రాయేలీయుల స్వభావాన్ని ధరించుకొని, మానవులందరిలాగే రక్తమాంసములలో పాలివాడైన మానవుడని సిలువ వేయబడిన క్రీస్తు బోధలో **(హెబ్రీ 2:9-18, 5:7-10)** ఉన్నా, ఇంకా ప్రవక్తల బోధలోనే ఉంటూ నాటి ఇశ్రాయేలీయులవలె నేటి క్రైస్తవులు క్రీస్తు నెరుగక, అనేకులు క్రీస్తును మరలా, మరలా అనగా ప్రతి సం॥ము సిలువ వేయుచున్నారు.

ఈ పరిస్థితికి ముందే ఎరిగిన దేవుడు క్రీస్తుతో ఈ మాటను పలికించి మనల్ని ప్రతి దినము పలకమంటున్నాడు. దేవుడు చేయి విడిచినా, ఆయన చిత్తాన్ని ఎరిగిన మానవుడు సంపూర్ణ సిద్ధి పొందితే అనగా పరిశుద్ధుడైతే ఒంటరిగానే దేవుని సంకల్పాన్ని నెరవేర్చగలడని క్రీస్తు ద్వారా మనకు రుజువు చూపాడు. క్రీస్తు ద్వారా మాత్రమే దేవుని యొద్దకు చేరాలనే క్రైస్తవులందరూ కూడా ప్రతి దినము తన సిలువనెత్తుకొని (క్రీస్తు మోసిన సిలువను కాదు) ప్రతి దినం, ప్రతీ క్షణం ఎలాంటి ప్రతికూల స్థితిలోనైనా ఈ కేక వేస్తూ ముందుకు సాగాలని, అనేకులచేత వేయించాలనే **(లూకా 9:23,24)** క్రీస్తు మనకు మాదిరిగా, మార్గము చూపాడు. అయితే మనమేమో ప్రతి సం॥ము ఒకమాట మాత్రమే మాట్లాడి ఎంతో గర్వంగా ఫీల్ అయి మనకు

తప్ప ఇంకెవరికిస్తాడు పరలోకం అనే భ్రమలో ఉన్నాము. మన జీవితంలో సాతాను ఇచ్చే శోధనలు జయించి, దేవుడు పెట్టే ప్రతి పరీక్షలోనెగ్గి, దేవుడిచ్చే జీవకిరీటము పొందుటకే ప్రభువు మనకు వినబడేటట్లు ఈ కేక వేశాడు. దేవుడు కొన్ని సందర్భాలలో ప్రభువు చేయి విడిచినట్లుగానే మన చేయి విడిచినా, మామూలు మానవులంగా భయపడి పారిపోకుండా, ధైర్యంతో దేవుని చిత్తాన్ని నెరవేర్చి దేవుని కుమారులముగా రుజువు చేసుకొనుటయే ఈ మాటలోని పరమార్ధమని గ్రహించిన వారు ధన్యులు.

## 5. “నేను దప్పిగొనుచున్నాను”

రాజులకు రాజు ప్రభువులకు ప్రభువై యున్న యేసుక్రీస్తు తన మానవ జీవితములోని చివరి క్షణాల్లో పలికిన మాటలలోని పరమార్థాన్ని ధ్యానిస్తున్న మనకు ఈ ఐదవ మాటలో ఒక ప్రత్యేకత కనబడుచున్నది. **మరియు లేఖనము నెరవేరునట్లు** అని ప్రత్యేకముగా ఈమాటకు ముందుగా సువార్తికుడు చెప్పుచున్నాడు. ఆయనను గూర్చిన లేఖనాలన్నిటిని నెరవేర్చడానికొచ్చిన ప్రభువుకు, ఇక్కడ మాత్రమే ప్రత్యేకముగా నెరవేర్చుటకై ఈ మాట పలికాడు అన్నాడంటే నిజంగా దీనిని ప్రత్యేకంగా పరిశీలించి పరిశోధించి, ఆలోచించి గ్రహించి తీరాల్సిన అవసరం ఎంతగానో ఉన్నది.

“అటు తరువాత సమస్తమును అప్పటికి సమాప్తమైనదని యేసు ఎరిగి, లేఖనము నెరవేరునట్లు - నేను దప్పిగొనుచున్నాననెను” (యోహాను 19:28)

క్రీస్తు ఈ లోకములోనికి శరీరముతో నరుడిగా ప్రవేశించినపుడు దేవుడు తన గ్రంథపు చుట్టలో ఆయనను గూర్చి వ్రాసుకొన్నవాటిని నెరవేర్చుటకే వచ్చానని చెప్పాడు (హెబ్రీ 10:5-7). ఆయన చేయవలసిన పనులన్నిటిని నెరవేర్చానని యోహాను సువార్త 17వ అధ్యాయంలో తండ్రికి చేసిన ప్రార్థనలో విన్నవించుకొన్నాడు. ఆయన చేయాల్సిన పనులలో మరొకటి మిగిలి

ఉన్నది అదే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చి (మత్తయి 5:17) దానిని కొట్టి వేయాలి. అప్పటికి అనగా బ్రతికి ఉండగా లేఖనములో వ్రాసిన దానిని నెరవేర్చాలి గనుక దావీదు గారు వ్రాసిన కీర్తన 69:21లోని లేఖనము నెరవేర్పుకొరకు ఈ మాట పలికాడని బైబిల్ పండితులందరు నిర్వివాదంగా ఒప్పుకుంటారు. అయితే ఇది ఆత్మల రక్షణ కొర్కైన ఆత్మీయ దాహమా? శరీరములో పుట్టిన నిజమైన దాహమా? ఆలోచించాలి.

సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి వెళ్ళి సువార్తను ప్రకటించండి అని ప్రభువు ఆజ్ఞాపింపకమునుపు ఆయన స్వయంగా తన ప్రాంతంలోని అన్ని ప్రదేశాలను తిరిగాడు. అలా తిరిగి ఒక రోజు మధ్యాహ్నం సమరయలోని సుఖారను ఊరిలోని యాకోబు బావి దగ్గర అలసి, సమరయ స్త్రీని తన దాహమునకిమ్మని నీళ్ళడిగాడు (యోహాను 4:4-14) ఆయనకు, ఆ స్త్రీకి మధ్య జరిగిన మాటల సందర్భములో "జీవజలముల"ను గూర్చి ప్రస్తావన తెచ్చాడు. జీవజలములను అనగా, ఆయన ఇచ్చే నీళ్ళను త్రాగేవాడు ఎప్పుడు దప్పిగొనడు అని చెప్పాడు. జీవజలములను పంచేవాడు కూడా శరీరములో ఉన్నాడు.

గనుక శరీర ప్రకారముగానైన దాహానికి నీళ్ళు త్రాగి తీరాలి. ఆయన దేవుని పనిలో తిరిగినప్పుడు వేసిన దాహాన్ని మనం గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే ఆయనకు సిలువలో వేసిన దాహం వేరు అప్పుడు ఇచ్చిన నీరు వేరు. మనిషి శరీరంలోని రక్తం పోతున్నప్పుడు తప్పక గొప్ప దాహం వేస్తుంది కదా! ఏదైనా యాక్సిడెంట్‌లో రక్తం పోయినవారు దాహం, దాహం అని అరుస్తారు. మనం మంచినీళ్ళు అందిస్తాం. అయితే యేసుకు బాధ తెలియకుండా ఉండటానికి చేదు కలిపిన ద్రాక్షారసం ఇవ్వబడింది. ఇది లేఖనాలలో ముందుగానే వ్రాయబడింది. ఎందుకంటే ద్రాక్షారసం నొప్పిని నివారిస్తుందిగదా! ఈ దాహం దేవుని పనిచేస్తున్నప్పుడు కలిగే దాహంగానే మనం తీసుకోవాలి. ఆపనే దేవుని పిల్లలను దేవుని యొద్దకు నడిపించుట.

సిలువలో ఈ మాటను పలుకక ముందే యేసు చెప్పిన సంగతిని మరోసారి లేదా ప్రతిసారి గుర్తు చేసుకోవాలి. ‘‘నేను చెప్పుమాటల ప్రకారం చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు’’ (లూకా 6:46). ఆయన ఈమాటలు చెప్పకముందే చేసినాడు. మనం ప్రతీ సంవత్సరము చెప్పికూడా చేస్తున్నామా? అని మనల్ని మనము పరీక్షించుకోవాలి లేదా విమర్శించి చూసుకోవాలి. ప్రవక్తల ద్వారా ప్రవచింపబడిన జీవజలము, యేసు ద్వారా పంపబడిన పరిశుద్ధాత్మ ద్వారా అపోస్తలుల మీద కుమ్మరింపబడిన జీవవాక్యమనే సిలువ వేయబడిన క్రీస్తు బోధను సర్వలోకములోని సకలజనుల సాక్షార్థమై ప్రకటించుటకు, రాత్రనక, పగలనకా పరుగెత్తి ప్రకటిస్తున్న మన శరీరాలు దప్పిగొనగా ‘‘నేను దప్పిగొనుచున్నాను’’ అని మాట్లాడుచున్నామా? ఆలోచించండి. యేసు తన తండ్రియైన దేవుని పని ప్రారంభించినప్పటి నుండి జీవితంలోని చివరిక్షణం వరకు ఆత్మలను రక్షించాలనే తపనతో శరీరప్రకారంగా దప్పిగొన్నాడు. మనిషిగా శరీర దాహాన్ని తీర్చుకొన్నాడు. ఆయనకున్నది మనలాంటి మామూలు శరీరమే అన్నది ఎన్నటికి మరచిపోరాదు.

ఇశ్రాయేలీయుల ధర్మశాస్త్రంలో ఒక భాగమైన కీర్తనలను రచించిన దావీదు గారు తన శత్రువులనుండి రక్షించమని మొర్రపెట్టినప్పుడు తన గొంతుక ఎండిపోయినపుడు కలిగిన దాహాన్ని సూచిస్తూ ఈ లేఖనాన్ని ప్రవచించాడు (కీర్తన 69:1-29) ఆయనకు చిరకనిచ్చినప్పుడు యూదుడుగా అది తీసుకొని వారిని శపించాడు లేదా తిట్టాడు. ఎందుకంటే తనను హింసించిన వారిని హింసించే హక్కులేదా స్వేచ్ఛ ధర్మశాస్త్రంలో వారికిచ్చాడు దేవుడు. అయితే యూదుడైన యేసు తన్ను హింసించిన వారిని ద్వేషింపక, వారిని క్షమింపమని రక్షించమని కోరాడు. ధర్మశాస్త్రాన్ని నెరవేర్చి దాన్ని తీసివేసి దానికంటే మరి శ్రేష్ఠమైన దానిని ప్రవేశపెట్టాలి గనుక ఆయన ఎదుటి వారి మార్పుకోసం తనకు వారిని శపించే హక్కున్నా

దీవించాడు, తన శరీరములో దేవత్వాన్ని చూపించాడు.

ఒక వ్యక్తి మనల్ని (ఈకాలంలో) హింసించితే వారి మీద తిరగబడాలని, తిరిగి వారిని హింసించాలని మన దేహం రెచ్చగొడుతున్నపుడు, మనరక్తం సలసల కాగుతున్నపుడు (బి.పి. ఎక్కువైనప్పుడు) ఆ బాధను దిగమింగుతూ దేవునికి మొర్రపెట్టినపుడు కూడా మన గొంతుక తడారిపోయి మనకు దాహం వేయాలి అంతవరకు మన కోపాన్ని, తాపాన్ని దిగమించి చల్లబడటానికి దాహం తీరటానికి గుక్కెడు నీళ్ళు తాగాలి. ఇలాంటి దాహం మన జీవితంలో దేవుని పనికి అప్పగించుకొన్న లేదా మారుమనస్సు పొందిన మరుక్షణం నుండి వేయాలి. ప్రతి దినం, ప్రతిక్షణం నేను దప్పిగొనుచున్నానని మనల్ని పలకమనే, ఆయన దప్పిగొని పలికాడని గ్రహించిన వారే ధన్యులు. సంవత్సరానికొక్కసారి గుడ్‌ఫ్రైడే నాడు మాత్రమే పలికేవాడు లేదా వినేవాడు కాదు. "మరియు ఆయన అందరితో ఇట్లనెను - ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతి దినము **'తన సిలువ'ను** ఎత్తుకొని నన్ను వెంబడింపవలెను" (లూకా 9:22). యేసు మోసిన సిలువను మనం మోయకూడదు, మొక్కకూడదు.

ఈ శ్రమల దినాలు (మంచి దినాలు కావని), గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలన్నీ మన పెద్దలు నిర్ణయించిన పారంపర్యాచారాలే తప్ప దేవుని ఆజ్ఞలు కావు. వీటిని నెరవేర్చాలని ఈ 40రోజులు మాత్రమే కన్నీటి, ఉపవాస ప్రార్థనలు చేసి మిగతారోజులలో యేసుమరణ - సమాధి - పునరుత్థానాలను మరచే వారి హృదయము దేవునికి దూరంగా ఉంది గనుక వారు నిత్యాగ్ని దండనకు పాత్రులవుతారని గుర్తుంచుకోవాలి. ప్రతిదినం మనకోసం, (యేసుకోసం కాదు) మన పిల్లలకోసం, బంధువులు, స్నేహితులు మనకు తెలిసిన ప్రతి మనిషి ఆత్మ రక్షణకోసం శరీరంలో దప్పిగొన్నవారు వీరే ధన్యులు. ఆయన మరణ దినాన్ని గాక

మరణాన్ని మాత్రమే మరియు ఆయన చేసిన పనులను, మనలను చేయమని పలికిన మాటలను అనగా ఆయనను ప్రతిరోజు జ్ఞాపకం చేసుకోవాలి. సువార్త ప్రకటన ఈలోకానికి వెర్రితనంగా ఉంటుంది గనుక మనల్ని పిచ్చి వాళ్ళుగా తలంచి, మన శరీరానికి నచ్చనిది, రెచ్చగొట్టేది అయిన చేదును చిరకగా ఇస్తే పుచ్చుకొని మన దాహాన్ని తీర్చుకోవాలి. (రోమా 12:9-21) ఆయనను గూర్చి లేఖనము ఆయన నెరవేర్చి వెళ్ళాడు. మనలను గూర్చిన పై లేఖనము మనం నెరవేర్చునట్లు (ఎఫెసీ 2:10) అనగా నెరవేర్చుటకు మనం కూడా దప్పిగొనుచున్నామని పలకమనే యేసు సిలువలో పలికిన ఈ మాటకు ముందు లేఖనము నెరవేరునట్లు అని యోహాను గారు ప్రత్యేకముగా వ్రాశాడు. ఆలోచించండి. పరమార్థాన్ని గ్రహించండి, దాని ప్రకారం ప్రవర్తించి తండ్రి చిత్తాన్ని యేసులాగే మనం నెరవేర్చి యేసుతో పాటు పరలోకాన్ని స్వతంత్రించుకొందాం. కృపా, సమాధానములు మనకు తోడై యుండును గాక...!

## 6. "సమాప్తమైనదని చెప్పెను"

మనుషులందరి జీవగ్రంథమైన బైబిల్‌లోని జీవ వాక్కులను గూర్చి ఇవి జుంటి తేనె కన్నా మధురమైనవని చెప్పి అవి వ్రాయించిన దేవుడిని రుచి చూచి ఎరుగమన్నాడు కీర్తనా కారుడు. తన మనస్సును మానవ మేథస్సు అందుకోవాలనే ఆశతో దేవుడు ఎంతో మనోహరంగా వ్రాయించాడు మన బ్రతుకు పుస్తకాన్ని. దీనిని ఆలోచించి చదివితే ఎన్నో అద్భుతమైన సంగతులను వెలికి తీయవచ్చు. చదువురాని వాడు ఎవరు చదివినా వింటే పర్వాలేదులే అంటున్నాడు. చదువు వచ్చిన వాడు ఎలా చదివినా పర్వాలేదు అనుకొని తనకిష్టమొచ్చిన రీతిలో చదువుతున్నాడు. అందుకే ఈ సత్యవేద గ్రంథము కేవలము అలంకార ప్రాయంలా మిగిలి లోకంలోని అన్ని మత గ్రంథాలవలెనే ఇదొక మత గ్రంథమై పోయింది. యేసు పలికిన ఐదవ మాటలో **"సమాప్తమైనదని ఎరిగి"** అని వ్రాయబడింది. కాని దాని తర్వాత పలికిన మాటల్లో లేదా బిగ్గరగా వేసిన కేకలో **"సమాప్తమైనదని**

**చెప్పి"** అని వ్రాయబడిందని గమనించి, ఆలోచించితే అందులో ఉన్న ఆత్మ జ్ఞానం అర్థమవుతుంది.

"యేసు ఆ చిరక పుచ్చుకొని - సమాప్తమైనదని చెప్పి తలవంచి ఆత్మను అప్పగించెను" (యోహాను 19:30).

దేవుని ఆలోచనలు మన ఆలోచనలకు (తలంపులకు) భిన్నమైనవని దేవుడు ముందే చెప్పాడు. సంగతులు సమాప్తమైనవని తెలుసుకోవడం వేరు, చెప్పడం వేరు. సమాప్తమైనవని ఎరిగి ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వాటిని కూడా పూర్తిచేసి అపుడు సమాప్తమైనది, ఇక ఏమి మిగిలిలేదు అని చెప్పడం అతిప్రాముఖ్యం. మనం ఎవరితోనైనా ఇవి అంత్య దినాలలోని అపాయకరమైన కాలములో చివరి ఘడియలో ఉన్నాం బ్రదర్ అంటే, అతను అవును బ్రదర్ నాకంతా ఎప్పుడో తెలుసు అంటాడు. తెలిస్తే ఏం ప్రయోజనం, ఈలోపున నీకివ్వబడిన పనిని పూర్తిచేశావా? అంటే ఏంపని అని ఎదురు ప్రశ్న వేసే క్రైస్తవులే ఎక్కువగా ఉన్నారీ రోజుల్లో. ఆదివారంనాడో, శనివారం నాడో, ప్రత్యేక కూటములు, పండుగ రోజుల్లోనో కొంచెంసేపు సంఘంలో, సహవాసంలో గడిపి కానుకలు వేసి ఆశీర్వాదాలు తీసుకోవడవే పని అని అనేక మంది అనుకొంటున్నారు. లోతుగా ఆలోచిస్తే ఈ ఆరవమాట, ఏడవమాట ఒక్కటేనని సుళువుగా గుర్తించవచ్చు. మనవాళ్ళు ఏడు సంపూర్ణ సంఖ్యగదా అని ఈ మాటలను ఏడుగా విభజించారని అనిపిస్తుంది.

అయినా ఈ మాటను ధ్యానిస్తే కొన్ని ప్రత్యేక పదాలు కనిపించాయి గనుక దీనిని కూడా ధ్యానిస్తున్నాం.

యేసు యోహాను సువార్త 17వ అధ్యాయం ప్రారంభంలోనే తండ్రీ చేయుటకు నీవు నాకిచ్చిన పనిని సంపూర్ణముగా నెరవేర్చానని దేవునికి చేసిన ప్రార్థనలో విన్నవించుకొన్నాడు. అయితే సిలువలో సమాప్తమైనదని బిగ్గరగా కేకవేసినట్లు చెప్పాడంటే మనకు సాక్షార్థముగా వినిపించాలని. ఈ లోకంలోని వారికి కూడా నా పని

నేను చేశాను, మీపని మీరు పూర్తి చేసి చూపండని చెప్పడం కోసమే ఈ మాటలోని ప్రత్యేకత. ఈ సంగతిని గ్రహించిన అపోస్తలుడైన పౌలు గారు సంఘములోని వారందరికి సాక్ష్యార్థమై వ్రాసాడు. "అయితే నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము, శ్రమ పడుము, సువార్తికుని పని చేయుము, నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము. నేనిపుడే పానార్పణముగా పోయబడుచున్నాను, నేను వెడలిపోవు కాలము సమీపమైయున్నది. మంచి పోరాటము పోరాడితివి, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసమును కాపాడుకొంటిని". (2తిమోతి 4:1-8) పౌలుగారు నన్ను పోలి నడుచుకోండి అని ధైర్యముగా చెప్పాడు.

ఈరోజుల్లో ఎవరైనా ఇంత ధైర్యముగా నా పరుగు కడముట్టించానని దేవునితోను, సాటి సహోదరులతో చెప్పేవారున్నారా? కాని పత్రికల్లో ప్రకటించే ఒక పచ్చి అబద్ధాన్ని మీకు తెలియజేయాలని వ్రాయుచున్నాను. బైబిల్‌లో ఎన్ని పుస్తకాలున్నాయో తెలియని వాడు, విశ్వాసం, నిరీక్షణలకు వాక్యానుసారమైన అర్థం తెలియనివాడు, పండుగలకు, పబ్బాలకు మాత్రమే తన దివ్య మంగళ స్వరూపాన్ని చర్చిలో దర్శింపజేసేవాడు, ప్రభుత్వ - ప్రైవేటు ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారాలలో తన జీతంలో చివరిక్షణం వరకు తన కుటుంబం కోసం రక్తాన్ని ధారపోసినవాడు చనిపోతే, జ్ఞాకార్థ కూటమనో, సంస్మరణ సభలనో, వర్ధంతి అనో పేపర్లో ఫోటో వేసి దాని క్రింద మాత్రం **"నాపరుగు తుదముట్టించానని"** వారి పిల్లలో, బంధువులో వేయడం హాస్యాస్పదంగా లేదా. ఇది అక్రమంకాదా? ఆలోచించండి చనిపోయేముందు వారు పలుకాల్సిన మాటను, చనిపోయిన తర్వాత ఎక్కడున్నాడో తెలియని మనం ఈ మాటను వ్రాయడం పరిశుద్ధాత్మకు విరోధముగా చేసే పాపంగానే దేవుడు పరిగణిస్తే మనగతేంటి. అందుకే పేపర్లలోను, సమాధిమీదనున్న ఫలకాలమీదనో ఈ వాక్యాన్ని చదువుకున్నపుడు నేను లోలోపల

రోదిస్తూ, ఏమి చేయలేక నవ్వుకుంటూ ఇలాంటి అవకాశం వచ్చినపుడు నా ఘోష వినిపిస్తున్నాను. ప్రతి విశ్వాసి తన జీవితం ముగింపుదశలో ప్రభువు నందు ఆనందిస్తూ దేవుడు నాకిచ్చిన పని సమాప్తమైనదని చెప్పటానికే ఆయన మనకు మాదిరిగా, ఆయన కర్తవ్యంగా ఈ మాట పలికాడు.

ఈ ఆరవ మాటలో మరొక అద్భుతమైన పదం ఉంది. సమాప్తమైనదని చెప్పాక తలవంచి ఆత్మను అప్పగించెను అని వుంది. తలవంచడం అనేది తగ్గింపునకు సూచనగదా! దేవుని యొద్ద దేవుడుగా సృష్టికి పూర్వం ఉన్న తనూ కుమారుడననే గుర్తుంచుకొని, దేవుని కన్నా మనిషిగా ఉన్నపుడు దేవదూతలకన్నా తక్కువ వాడినని భయభక్తులతో జీవించాడు. తనకు పరలోకంలో సీటు గ్యారంటీ అని తెలిసినా చివరి క్షణంలో కూడా దేవుని ముందు తలవంచాడు. కాని ఈరోజుల్లో బ్రతుకుదెరువు కోసం బైబిల్ పట్టిన పెద్దపెద్ద సంస్థానాదీశులు మా అంత భక్తులు లేరని, నా అంతటి మహాజ్ఞాని ఈలోకంలోనే మరొకడు లేడని విర్రవీగుతూ అహంకారముతో ప్రతిచోట తమ ప్రత్యేకతను చాటింపు వేసుకొని ఊరేగుతున్నారు. కొందరు ఈ మాటలు గుడ్‌ఫ్రైడేనాడు చెప్పాల్సిన అవసరం లేదు అసలు గుడ్‌ఫ్రైడే చేయనవసరం లేదు అని తమని తాము సమర్ధించుకొంటున్నారు. వారి వాదన కరెక్టు అయినా ఇందులో ఉన్న పరమార్థాన్ని ప్రతి రోజు ఈ మాటల ప్రకారం చేయాల్సిన అవసరాన్ని తాము గుర్తుంచుకొని అనేకులకు వినిపించాలి గదా!

దేవుడు పరిశుద్ధుడు గనుక మనల్ని పరిశుద్ధులుగా ఉండమన్నాడు. దేవున్ని చూసే ఓపిక (వాక్యం ద్వారా ఆయన పరిశుద్ధతను గ్రహించలేకపోతే) లేకపోతే మనల్ని పిలిచి యేసు ఎలా పరిశుద్ధుడయ్యాడో చూడమన్నాడు (2పేతురు 1:13-16). ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండని పిలిచిన యేసు, నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను, నాకాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి అన్నాడు (మత్తయి 11:28-30).

ఆత్మ ఫలాలలో కూడా ఈ సాత్వీకం కనిపిస్తుంది. మనల్ని పిలిచిన యేసు సాత్వీకుడు గనుక పరిశుద్ధుడుగా దేవుని చేత, మనుషులచేత, పరిశుద్ధాత్మచేత సాక్ష్యము పొందాడు. అదే పరిశుద్ధతను మనం నేర్చుకొని పొందాలనే ప్రభువు చివరి క్షణంలో తండ్రి ముందు తలవంచాడు. ఈలోకంలో ప్రతివాని మోకాలు యేసు నామంలో దేవుని ముందు వంగాలని పరిశుద్ధాత్మ వ్రాయించాడు. కాబట్టి మనందరికి రాజైన యేసే ముందుగా దేవుని ముందు తలవంచి మనకు మార్గమైనాడు. తెల్లబట్టలేసుకున్న ప్రతివాడు పరిశుద్ధులమనే ఫోజు కొడతారు. తెలుపు బట్టలకున్నది కాని మనసుకుండాలి. అందుకే దీనమనస్సు, జాలిగల మనస్సు, దయాళుత్వము, వినయము, సాత్వీకము, దీర్ఘశాంతమును ధరించుకొనుడి అని వ్రాయబడింది (కొలస్సీ 3:12-17). ఇది పరిశుద్ధలకు తగినది అది మరోసారి మనకు జ్ఞాపకం చేయడానికే తన తలవంచి ఆత్మను దేవునికప్పగించాడు.

కాబట్టి ప్రభువా, ప్రభువా నీవు మాకోసం చనిపోయావు తండ్రీ, నీరక్తము కార్చావు నాయనా అని ఏడ్పు ముఖాలతో ప్రభువును పిలవకూడదు. 40 దినముల ఉపవాసముండడం పెద్ద గొప్పతనం కాదు కాని మనల్ని తిట్టిన వారిని తిట్టకుండా 4 నిమిషాలుండడమే దేవునికి కావాలి. అని గుర్తుంచుకోవాలి. ఎల్లపుడు ప్రభువునందు ఆనందించండి అని సిలువ వేయబడిన క్రీస్తు బోధలోని దేవుని సంగతులన్నియు అర్ధంకావాలంటే ప్రతీవారు "యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అని హృదయమందు విశ్వసించి, మనందరి పాపముల నిమిత్తము సిలువలో మరణించి, సమాధి చేయబడిన ఆయనను దేవుడు మూడవ దినమందు లేపాడని నమ్మిన వారికి మాత్రమే పరిశుద్ధాత్మ సహాయముంటుందని గ్రహిస్తేనే మంచిది. అప్పుడే దేవుని ముందు యేసు నామములో సాత్వికముతో మనము తలవంచ గలము.

మొదటిది ప్రేమ - క్షమాపణ, రెండవది విశ్వాసము - నిరీక్షణ, మూడవది బరువు - బాధ్యత, నాల్గవది ప్రార్థన - సహవాసము, ఐదవది భయము - భక్తి, ఆరవది కర్తవ్యము - పరిశుద్ధత ఇలా ఎన్నో సంగతులను మనకు జ్ఞాపకం చేసి మన చేత దేవుని పని చేయించి మనలను దేవుని దగ్గరకు చేర్చడానికే క్రీస్తు సిలువలో ఈ మాటలు పలికాడని జ్ఞాపకముంచుకొని తండ్రి చిత్తాన్ని జరిగించి పరలోకాన్ని స్వతంత్రించుకుందాం. క్రీస్తు కృప మనందరికి తోడైఉండును గాక!

## 7. "తండ్రీ నీచేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను"

సర్వోన్నతుడైన దేవుని అనాది సంకల్పాన్ని నెరవేర్చుటకే పరలోకం నుండి ఈ భూలోకానికి నరుడిగా దిగివచ్చిన క్రీస్తు యేసు తన తమ్ముళ్ళమైన మనకోసం అనగా తండ్రి నుండి ఆయన తర్వాత భూలోకములో విడిపోయి నరుడిగా భువిలో అవతరించిన మనంకూడా తిరిగి మనకన్న తండ్రిని చేరుటకే ఈ సిలువయాగాన్ని నెరవేర్చాడు. మనము కూడా లోకాన్ని ఆయనలాగ జయించుటకే సిలువలో ఈ 7 మాటలు పలికాడు. మొదటి మాటలో ప్రేమ, క్షమాపణ చూపి అనేకుల కొరకు విజ్ఞాపన చేయమన్నాడు. రెండవ మాటలో క్రీస్తు ద్వారా పాపక్షమాపణ అడిగితే చనిపోగానే పరదైసుకెళ్ళి, ఆయన రెండవ రాకడలోనే అందరూ ఒకేసారి పరలోకం చేరుతారనే అభయహస్తం ఇచ్చి దారి చూపించాడు. మూడవ మాటలో కుమారుడిగా తల్లిదండ్రుల యెడల మనం నెరవేర్చాల్సిన భాధ్యతను గుర్తు చేసాడు. నాల్గవ మాటలో మనిషి ఎలా ప్రవర్తిస్తాడో రుజువు చూపమన్నాడు. ఐదవ మాటలో మన ఆత్మల రక్షణకై ఆయనకున్న దాహాన్ని తెలిపి మనల్ని గూడ మన సహోదరుల నిమిత్తము దప్పిగొనమన్నాడు. ఆరవ మాటలో ఆయనకిచ్చిన పని సమాప్తమైనదని చెప్పి మనల్ని గూడా మనకిచ్చిన పని సమాప్తమైనదని చెప్పమన్నాడు. ఇప్పుడు ఏడవ మాటలో ఆయనేది చేశాడో మనల్నేమి

చేయమన్నాడో ధ్యానిద్దాం. క్రీస్తుతో పాటు మనకోసం కూడా ముందుగా సిద్ధపరచిన సత్క్రియల **(ఎఫెసి 2:10)** నెరవేర్పుకోసం వేగిరపడుదాం.

“అప్పుడు యేసు గొప్ప శబ్ధముతో కేకవేసి, తండ్రీ నీచేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను” అలాగు చెప్పి ప్రాణము విడిచెను **(లూకా 23:46)**

ఈమాట యోహాను సువార్తలో చెప్పిన ఆరవ మాటను విడదీసి ఏడవ మాటగా కొనసాగించినట్లు కనపడ్డా, ఇందులో ఇంకా చాలా స్పష్టత, కొన్ని ప్రత్యేక విషయాలున్నాయి గనుక పెద్దలు నిర్ణయించినట్లు ఏడవ మాటగానే ఆలోచిద్దాం. ఈ మాటకూడా రాజైన దావీదు నరుడిగా పలికినదే”. నా ఆత్మను నీచేతికి అప్పగించుచున్నాను. యెహోవా సత్య దేవా, నన్ను విమోచించువాడవు నీవే” **(కీర్తన 31:5)**. ఇది ఎందుకు ఇంత ధైర్యంగా చెప్పాడంటే దాని తర్వాత మాటలో “నేను యెహోవాను నమ్ముకున్నాను” **(కీర్తన 31:6)** అనే నిశ్చయత కల్గియున్నాడు గనుక. అనగా మనుష్యులమైన మనకు దేవునిపై ఉండాల్సిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని తెలియజేసాడు. మన ప్రారంభం మనకు తెలియదుగాని మన అంతం మనకు తెలియజేసాడు గనుక విశ్వాసంతోనే ముందుకు కొనసాగి తీరాలి. కేవలము లేఖనము నెరవేర్పుకోసమే అయితే ఈ మాటకు ముందు లేఖనము నెరవేరునట్లు అని ప్రత్యేకముగా వ్రాసేవారు సువార్తికులు. వాక్యాన్ని తమ క్రియలతో నెరవేర్చుటకు, **జీవితంలోని ఆఖరి క్షణంలో కూడా విశ్వాసాన్ని వదలకుండా లోకాన్ని వదలాలనే ఆజ్ఞ** కూడా ఇందులో ఇమిడియున్నది.

ఈమాటలో ఉన్న మరో ప్రత్యేకత ఏమున్నదంటే క్రీస్తు తన ఆత్మను తండ్రికి అప్పగించి “ప్రాణము విడిచెను” అని వ్రాయబడియున్నది. మనుషులందరిని చంపేది, బ్రతికించేది దేవుడే అని వాక్యము చెబుతుంటే **(1సమూ. 2:6, ద్వితీ. 32:39)** ఇక్కడ

యేసు ప్రభువు మాత్రమే తన ప్రాణము తానే విడిచాడు. దేవుడు తన ప్రియుడైన క్రీస్తు మీద ఉన్న నమ్మకంతో ఆయన ప్రాణాన్ని ఆయనే పెట్టుటకు ప్రత్యేకంగా అధికారాన్నిచ్చాడని యేసే స్వయంగా చెప్పాడు **(యోహాను 10:11-18).** యేసుక్రీస్తువలె దేవుని పనికోసం, దేవుని యొద్దకు చేరటం కోసము, ప్రజల రక్షణ కోసము మనము కూడా మన ప్రాణాన్ని పెట్టబద్దులమైయున్నాము **(1యోహాను 3:16).** దేవుని మీద మనిషికి మనిషి మీద దేవునికి ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నాడు. అంతేగాని లోకంలోని మనుషులవలె ప్రతిరోజు లేవగానే తండ్రీ నన్ను సజీవుల లెక్కలో ఉంచినందుకు స్తోత్రము, ఇంకా బ్రతికించు ఈ లోకాన్ని అనుభవిస్తాననే పనికిమాలిన ప్రార్థన చేయకూడదని ఈ మాట తెలియజేయుచున్నది. ఇది గ్రహించిన పౌలు గారు క్రీస్తును పోలి నడుచుటకే "బ్రతుకుట క్రీస్తుకొరకే, చావైతే లాభం" **(ఫిలిప్పీ 1:21)** అని అనడమే కాదు శరీరంతో పాటు దానికి కావాల్సిన వాటిని పెంటతో సమానంగా ఎంచుకొన్నాడు. మనమేమో ప్రభువు పలికిన 7 మాటలను ధ్యానించుట అని చెప్పి సంవత్సరానికొక్కసారి మాత్రం నోటితో పలికి, హృదయాన్ని మాత్రము దూరంగా ఉంచుతున్నామనే సత్యాన్ని గ్రహించక క్రీస్తు సిలువకు శత్రువులుగా మారుచున్నాము.

యేసు చెప్పిన మాటల ప్రకారం చేసి చూపాడు గనుకనే విశ్వాసమునకు కర్తగా కొనియాడబడ్డారు **(హెబ్రీ 11:2).** అసలు నిరీక్షణ కాధారం లేనపుడు అబ్రహాము దేవున్ని నమ్మి పరీక్షల్లో నెగ్గాడు గనుక విశ్వాసులకు తండ్రి కాగలిగాడు **(రోమా 4:18-24).** విశ్వాసులమని చెప్పుకొంటున్న మనము మన విశ్వాసానికి ఎన్నో ఆధారాలున్నా ఆయన చెప్పిన మాటల ప్రకారం చేయడం లేదంటే. మనకు దేవుడెవరో అర్థంకాలేదు. ఎవరూ శరీరంతో చనిపోయి తిరిగిలేచిన దృష్టాంతాలు లేకున్నా మనలాంటి మానవుడైన క్రీస్తు దేవుని మాటపై పరిపూర్ణ విశ్వాసముంచి మరియు దేవుడు తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన ప్రాణాన్ని తానే

ధైర్యంగా విడిచిపెట్టి మనకు మార్గమును చూపి ఆ మార్గము చాలా ఇరుకైనదైనా అందులో నడచి అంతము వరకు సహించమన్నాడు. మనకు ఎంతో గొప్ప సాక్షి సమూహమున్నా **(హెబ్రీ 11,12 అధ్యాయాలు)**, స్వయంగా యేసు పునరుత్థానానికి సాక్షులున్నా దేవుడి మీద, క్రీస్తు మాటల మీద నమ్మకం లేకనే మనకు చావంటే చాలాభయంవేస్తుంది. ఆస్తి, అంతస్తులను అవలీలగా విడిచినా, శరీరం (ప్రాణం) దాని కోరికలను విడుచుట కిష్టపడుటలేదు. అందుకే నేటి క్రైస్తవులనేకులు తమకు శ్రమలు కల్గినపుడు, ప్రాణభయంకలిగినపుడు ఈ దేశంలో క్రైస్తవులకు రక్షణ లేదు అని లోకాధికారుల యొద్ద విజ్ఞాపన చేస్తున్నారు గాని దేవునిపై అవిశ్వాసముతో తమ ఆత్మలను అప్పగించి ప్రాణాన్ని విడుచుటకు ఇష్టపడుటలేదు. అందుకే యేసు నేను చెప్పుమాటల ప్రకారం చేయుమనే ఈ మాటను పలికి మనల్ని కూడా విశ్వాసంతో పలకమన్నాడు. మన ఆత్మ దేవునిలో భాగమైనా, ఇప్పుడది మనది గనుక దాన్ని భద్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనదే గనుక దానిని దేవుని చేతికి మాత్రమే అప్పగించమంటున్నాడు.

శరీరము కేవలము నిష్ప్రయోజనమని, ఆత్మను రక్షించుటయే ముఖ్యమని ఎరిగి, పరిశుద్ధాత్మ సహవాసముతో నడిచి, సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిన అపోస్తలుల బోధలో ఎదిగి మన ఆత్మలను కూడా తండ్రికి అప్పగించాలనే ఆజ్ఞను కలిగియున్నాము. "క్రీస్తు శరీరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ధరించుకొనుడని, అగ్నివంటి మహాశ్రమలు గలిగినా ఆశ్చర్యపడవద్దని, క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించి తీరాలని అనేకులు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవున్ని మహిమపర్చాలి కాబట్టి దేవుని చిత్త ప్రకారము బాధపడువారు సత్ ప్రవర్తన (వాక్యముతో / సత్యమైన క్రీస్తు ప్రవర్తించినట్లు ప్రవర్తించి) గల వారై "నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించవలెను" అని మనకోసం లేఖనాలను వ్రాయించాడు. **(1పేతురు 4:1-19, ఫిలిప్పీ**

**2:5-11)** వీటిని ఎన్నిసార్లు విన్నా చదివినా అనేకమంది విశ్వాసులమనుకొంటున్న వారి చెవికెక్కడంలేదు. నా గొఱ్ఱెలు నా స్వరం వింటాయని ఆయన చెప్పిన మాటలు విన్న మొదటి శతాబ్ధములోని అనేక గొఱ్ఱెలు హతసాక్షులయ్యారు. ఎప్పటికీ ఆయన స్వరము వినబడాలనే గొప్ప శబ్దముతో కేకవేసాడు అపోస్తలుల బోధ ద్వారా మన మన ఆత్మను దేవునికే అప్పగించాలని ఆజ్ఞాపించాడు. ఇది మనకు అత్యవసరమైనది కూడా.

ఈరోజులల్లో మనలో అనేకులు (దైవసేవకులతో సహా) తమ ఆత్మలను శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములనే లోకాశలకు అనగా సాతానుకు అప్పగిస్తున్నాం. దైవాశీర్వాదం అనే భ్రమలో డబ్బుకు దాసోహం అంటున్నారు. ఏనాటికైనా మట్టిశరీరం మట్టిపాలై తీరుతుందని ఎంత చెప్పినా, దానిపై ఆశ - మమకారాలు చావక ఆకురాలినట్లు రాలిపోతున్నారు. మన ఆత్మ దేవుడు పెట్టిన దీపమని, మనమే అనగా మన ఆత్మ దేవునిలో ఒక భాగమని **(కీర్తన 18:5)** వాక్యంగా ఉన్నప్పుడు చెబితే నమ్మలేదు గనుకనే ఆ వాక్యము శరీరధారియై వచ్చి చివరి క్షణంలో కూడా మన ఆత్మను తండ్రికి అప్పగించి, దానిని రక్షించు కోవాలని కేక వేసాడు. దేవుని ఆత్మ దేవుని యొద్దకు చేరి తీరాలనేది న్యాయంగదా. అందుకే మనకు రాజు, ప్రభువైన క్రీస్తు ముందుండి సాతానుతో యుద్ధం చేసి జయించి, మనం జయించాలనే మనకు మార్గదర్శియై యుండుటకే తన ఆత్మను తండ్రికి అప్పగించాడు. తన ప్రాణాన్ని ఇష్టపడి తానే విడిచాడు. ఇదే జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ. ఆయన లాగే బ్రతుకు కాలమంతా సత్ప్రవర్తన కలిగి బ్రతకాలని మనకోసం తన ప్రాణాన్ని పెట్టాడే గాని ఒక్కో సంవత్సరము ఒక్కొమాటను కేవలము పలికో, మాట పలకడానికి అవకాశమివ్వకపోతే కాపరిమీద, పెద్దల మీద అలిగి వెళ్ళటానికి మాత్రం ఈ మాటను పలకలేదు.

ఆయన జీవితంలో ఆఖరి క్షణంలో ఈ మాటలు పలికాడు, తన ప్రాణం తానే పెట్టాడు. మనకు మరలా సిలువలో ప్రాణం

విడిచే అవకాశం లేదు గనుకనే మన సిలువను మాత్రమే ఎత్తుకొని ప్రతి దినము ఈ మాటలు పలికి విశ్వాసంతో మన ఆత్మను అప్పగించాలి. ఆయన తనపని చేసి తండ్రి కుడిపార్శ్వమున ఆసీనుడయ్యాడు. మనం మనకివ్వబడిన పని చేసి క్రీస్తు కుడిపార్శ్వమున కూర్చోవాలంటే మనము కూడా ప్రతి దినం మరణానికి అప్పగింపబడాలి. **(2కొరింథీ 4:9-13, 2కొరింథీ 4:7-11,6:3-10)** మరికొందరికి కనీసం సం॥ కొకసారైనా పలకటానికి కూడా చేతనవటం లేదు ఇంక ఆత్మను అప్పగించి, శరీరాన్ని విడవటానికి ఎప్పుడు అలవాటుపడతారు, ఈలోగా యేసుప్రభువు వస్తే వారి (మన) పరిస్థితి ఎంత భయంకరమో ఆలోచించండి.

ఇశ్రాయేలీయులకు మోషె ధర్మశాస్త్రాన్ని మొదటి 4 గ్రంథాలలో ఇచ్చినా, వాటినే మరలా అనగా రెండవసారి ద్వితియోపదేశం చేసాడు. నేటి ప్రసంగికులు, బోధకులు, లెక్చరర్లు కూడా తమ బోధ పూర్తి చేసాక చివర్లో సారాంశాన్ని పాయింట్ వైజ్‌గా చెప్పడం చూస్తున్నాం. పౌలుగారు కూడా మనం ఒకసారి చెబితే వినేరకం కాదని మరలా చెప్పుదును ప్రభువు నందు ఆనందించుడి అని చెప్పాడు. అలాగే క్రీస్తు కూడా తన జీవితకాలంలో బోధించిన బోధనంతా, చేసిన క్రియలన్నిటిని మరలా తన భూలోకయాత్రలోని చివరి ఘడియలో మళ్ళీ క్రియారూపకంగా పలికి, బోధించి, హెచ్చరించాడనే ఈ మాటలలోని సారాంశముగా అర్థమగుచున్నది. ఈ మాటలతో కూడిన గుడ్‌ఫ్రైడే ఆరాధన గూర్చి బైబిల్ చెప్పకపోయినా మనముందు తరంలోని బోధకులు ఎందుకు ప్రవేశపెట్టారో మనకెవరూ వివరంగా చెప్పడంలేదు. ఎవ్వరినడిగినా అందరూ చేస్తున్నారు మేం చేస్తున్నామంటారు. వాక్యంలో చేయమని లేదు గనుక మేం చేయడం లేదని మరికొందరంటున్నారు. మనం మనకు తెలియని దానిని ఆరాధిస్తున్నామని యేసు ముందు చెప్పాడు గనుక ఆయనకు (వాక్యానికి) తెలిసిన దానినే ఆరాధిద్దాం **(యోహాను 4:19-24)**.

మనందరి మేలుకొరకు దేవుడు క్రీస్తు మరణ దిన్నాన్ని (**ప్రసంగి 7:1**) జగత్తు పునాది వేయబడక ముందే ఏర్పాటు చేశాడు (**ఎఫెసి 1:3-12**). ఇది బైబిల్‌లో యెహోవా ఏర్పాటు చేసిన దినముగా చెప్పిన దావీదు దీనియందు ఉత్సహించి సంతోషించమన్నాడు (**కీర్తన 118:22-24**) కాని మనం ఏడ్పు మొఖాలతో, ఉపవాసాలతో ప్రభువా మాకోసం సిలువలో ఎంత శ్రమ అనుభవించి చనిపోయావు తండ్రీ అని ఆయన చెప్పిన మాటలు ఆయనకే అప్పజెప్పి ఇంటికి వెళ్ళకుండా (**మత్తయి 7:21, లూకా 6:46**) ఈలోకమంతా ప్రకటించడమే నిజమైన ఉపవాసమని (**యెషయా 53**), ఈపని ప్రతిరోజు చేయాలని మరచిపోతున్నారు. ఆయన చేసిన త్యాగం వలన మనకు మేలు జరిగింది గనుక ప్రతి దినం ఉత్సాహించి, (**ఫిలిప్పీ 4:4**) సంతోషించి, పండుగ చేసుకొని ప్రభువునందు ఆనందించి, మన సహనాన్ని సకల జనులకు తెలియజేస్తూ మాటచేతగాని, పాట చేతగాని, క్రియచేతగాని ఏవిధము చేత నైనను క్రీస్తు, మరణ, సమాధి, పునరుత్థానాలను అనేకులకు ప్రకటించి అందరూ ఈ మేలులో పాలుపొందునట్లు చేయడమే ఈ మాటల ఆంతర్యమైయున్నది.

తన జన్మకు కారణం తెలుసుకొన్న యేసు భూమిమీద దేవునిని మహిమపరిచాడు మనం కూడా మన జన్మకు కారణం తెలుసుకొని (**ఎఫెసి 3:3-12**) క్రీస్తు ద్వారా తండ్రియైన దేవుని కృపా మహిమకు కీర్తి కలుగజేయాలి. దీనికై జీవ వాక్యాన్ని చేతబట్టి లోకమందు జ్యోతులవలె కనబడుతూ, ప్రతి దినం మన సిలువ నెత్తుకొని ప్రేమ, క్షమాపణ, విజ్ఞాపన చేస్తూ పరలోక ప్రయాణం గూర్చి అనేకులకు అభయహస్తం ఇస్తూ, మన బాధ్యత నెరవేర్చి, పరిపూర్ణ మానవత్వంలో నుండి దైవత్వంలోనికి మార్పు చెంది, అనేక ఆత్మల యెడల దాహం కలిగి, మనకివ్వబడిన పనిని సంపూర్ణముగా నెరవేర్చి సమాప్తమైనదని చెప్పి, మన ఆత్మను మన తండ్రికి అప్పగించి, ప్రాణాన్ని విడిచి క్రీస్తు రెండవ రాకడలో మహిమ శరీరాన్ని (మన ప్రాణాన్ని తిరిగి దక్కించుకొని) పొంది మన పరలోకాన్ని తిరిగి

స్వతంత్రించుకొందాం. మన ప్రభువైన క్రీస్తు కృప, తండ్రియైన దేవుని ప్రేమ, పరిశుద్ధాత్ముని సహవాసము సదాకాలము మనకు తోడైయుండును గాక... ఆమెన్.

సిలువ వేయబడిన క్రీస్తు బోధలో

మీ సోదరుడు

**డా॥ బొంకూరి జాన్**

**మరిన్ని వివరాల కోసం, బైబిల్‌పై మీకున్న అనుమానాలు, ప్రశ్నలకు సమాధానాల కోసం, ఉచిత బైబిల్ తర్ఫీదు కోసం, ఉచిత కరపత్రాలు, దేవుని జ్ఞానంతో వ్రాసిన పుస్తకాలు, మాట్లాడిన ఆడియో/ వీడియో సి.డి.ల కోసం ఈ క్రింది చిరునామాలలో ఎల్లవేళలా సంప్రదించండి.**

**Dr. JOHN BONKURI,** Director
**Institute of Bible Technology Hyd & Temples of God Meets Here Church**
Ph : 040-20000700 Cell : 9440142887, www.bibletechnology.org
e-mail : johnbonkuri@bhelhyd.co.in bibletechnology@gmail.com

**Bible College :** #06-264/13/1/5H, HAL Colony, Opp. Godavari Homes,
Suchitra Bus Stop to Quthbullapur Road,
Chintal Post, Quthbullapur GHMC, Hyd - 500 054, India

**for Free Bible Training** contact :
**Bro. J. RAVI,** Admn. Officer - IBT,
H.No. 7-1-38/1/33, BJR Nagar, Ameerpet, Hyd-16,
Cell : 9440792192, 9959372221, 9440551149, 9849469229, 8008969770,
9848961763, 9441727357, 9247128962, 9963623438, 9866509138,
9490453041, 9948612802, 9849434353, 9949242423, 9346373553
**R.K. Evangelical Marketing,** 9704692533